ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
ఒంగోలు, fb.com/vaartha
Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
22-1-2025 బుధవారం సంపుటి: 30 సంచిక: 354 పేజీలు: 12 వెల: 6.50

ఆసుపత్రి నుంచి సైఫ్ అలీఖాన్ డిశ్చార్జి

ట్రంప్ కుటుంబమే వలసదారుల మయం

9లో

## వలసదారులపై ట్రంప్ కొరడా



### జన్మతః పౌరసత్వచట్టం రద్దు

ప్రవాస భారతీయులు సహా ఆందోళనలో 30 దేశాల ప్రజలు

**వాషింగ్టన్,జనవరి 21:** వలసదారులకు అమెరికా గడ్డపై పిల్లలు పుడితే ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. ఇపుడు అధ్యక్షుడుగా డొనాల్డ్‌ట్రంప్ పదవీస్వీకారంచేసిన వెంటనే మొట్టమొదటి చర్యగాజన్మతహా పౌరసత్వ హక్కు చట్టాన్ని రద్దుచేసారు. అక్రమ వసలదారులకు అమెరికాలోపుట్టే పిల్లలకు లభించే ఈ పౌరసత్వాన్ని మా ఫెడరల్‌ప్రభుత్వం గుర్తించదని ట్రంప్ స్పష్టంచేసారు. అయితేట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రవాసభారతీయులపై ఎలాంటి ప్రభావం చూపిస్తుందని చట్టసవరణ సాధ్యమవుతుందా అన్నది ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రపంచంలోని 30కిపైగా దేశాలు ఈ చట్టాన్ని అమలుచేస్తుంటే ఇపుడు ట్రంప్ వచ్చినవెంటనే ఈ చట్టం రద్దు చేయడాన్ని పాలకవర్గాల్లోనే విమర్శలకు దారితీసింది. 1868లో చేసిన 14వ రాజ్యాంగసవరణ ఆధారంగా శరణార్థుల పిల్లలకు అమెరికా జన్మతఃపౌరసత్వాన్ని అందిస్తోంది. ఇప్పటివరకూ ఈప్రక్రియ నిరాఘాటంగాసాగింది. ట్రంప్‌జారీచేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులతో ఇపుడుబ్రేకులు పడానడయి. ట్రంప్ ఉత్తర్వులప్రకారం బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లితండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా ఒకవేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ శాశ్వత నివాసి కాకపోయినా పుట్టిన పిల్లలకు పౌరసత్వం రాదు. అలాగే తండ్రి శాశ్వత నివాసి అయినా తల్లి తాత్కాలిక వీసాపై నివాసం ఉంటున్నా ఇదే చట్టం వర్తిస్తుంది. అమెరికాలో నివసిస్తున్న ప్రవాసభారతీయుల సంఖ్య వేగంగా పెరుగుతోంది. 2024చివరి నాటికి 5.4మిలియన్లమంది ఎన్నారైలు అక్కడ >>2

# 100 దేశాల్లో తెలుగువారు



మంగళవారం దావోస్‌లో ఎల్జీ సిఇఒ షినాక్ సియోల్‌తో భేటీ అయిన సిఎం చంద్రబాబు

గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగే సత్తా

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఏపి విధానం

గ్రీన్‌హైడ్రోజన్, గ్రీన్‌ఫ్యూయల్ రంగాల్లో వడివడిగా ముందుకు

దావోస్ సిఐఐ సెషన్‌లో సిఎం చంద్రబాబు

**విజయవాడ,జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** వ్యాపార, వాణిజ్య రంగాల్లో విజయం సాధించి గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్లుగా ఎదిగే సత్తా భారతీయల్లో ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రపంచంలో అందరికీ అత్యంత ఆమోదయోగ్యమైన ఏకైక కమ్యునిటీగా భారతీయులు గుర్తింపు పొందారని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ (డబ్ల్యూఈఎఫ్) రెండో రోజున, భారత పరిశ్రమలసమాఖ్య(సీఐఐ) ప్రత్యేక సెషన్‌లో గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్‌పై ముఖ్యమంత్రి ప్రసంగించారు. 100కు పైగా దేశాల్లో తెలుగువారు ఉన్నారని, తక్కువ సమయంలోనే ఇంతలా తెలుగువారు విశ్వవ్యాప్తం అవుతారని ఎవరూ ఊహించలేదన్నారు. మానవ వనరుల లభ్యత ఏపీకి ప్లస్ పాయింట్ అని, భారతీయ పారిశ్రామికవేత్తలు, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంతోమంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు దోహదపడుతున్నారని, తమ ప్రతిభతో రాణిస్తున్నారని ముఖ్యమంత్రి అన్నారు.

**సరైన సమయంలో సరైన ప్రధాని:** 25 ఏళ్ల క్రితం బిల్ గేట్స్ ఇంటర్నెట్ ప్రవేశపెట్టారు. 1991లో భారత ప్రభుత్వం ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చింది. ఈ రెండింటిని అవకాశంగా తీసుకుని మేము రెండవ దశ సంస్కరణలు తీసుకొచ్చాం. ఫలితాలు వచ్చాయి. సరైన సమయమంలో దేశానికి సరైన వ్యక్తి ప్రధానిగా ఉన్నారు. మూడవ సారి నరేంద్ర మోదీ ప్రధాని అయ్యారు. చాలా దేశాల్లో రాజకీయ సందిగ్ధత ఉంది కానీ భారతదేశంలో అది లేదు. పరిపాలనలో ఒక స్పష్టతతో వెళ్తున్నారు అని చంద్రబాబు అన్నారు.

**నాటి సంస్కరణల ఫలితమే నేటి హైదరాబాద్ :** నాడు తాను తెచ్చిన సంస్కరణలతో రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, గ్రూప్ ఆఫ్ కాన్సెప్ట్ రూపొందించడంలో ట్రాక్ రికార్డ్ ఉందని, హైదరాబాద్ కూడా ఒక గ్రూప్ ఆఫ్ కాన్సెప్ట్ నగరం అయ్యిందని అన్నారు. దేశంలో నివాసయోగ్యానికి హైదరాబాద్ అత్యంత అనువైనం ప్రాంతంగా తీర్చిదిద్దామని అన్నారు. ఫార్మా, ఐటీ, ఫైనాన్స్, క్రీడలు, ఆసుపత్రులు ఇలా అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధించిందన్నారు.

**వచ్చేది భారత యుగం:** జీడీపీ వృద్ధి రేటులో భారతదేశం అగ్రగామిగా ఉందని, ఇదేస్థాయిలో వృద్ధి నమోదు చేస్తామనే నమ్మకం ఉందన్నారు. 2028నుంచి భారత యుగం ప్రారంభమవుతుందని చెప్పారు. భారతదేశాన్ని ప్రపంచంలో సూపర్ పవర్‌గా చేసేందుకే వికసిత్ భారత్ 2047ప్రణాళికలను ప్రధాని నరేంద్ర మోడీ అమలుచేస్తున్నారని, సుస్థిరప్రభుత్వంతో కూడినదార్శని >>2

## భారీ ఎన్‌కౌంటర్ మరో 27మంది మావోయిస్టులు హతం



### వణుకుతున్న ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దులు

మృతుల్లో అగ్రనేతలు చలపతి, బాలన్న, పలువురు కేంద్రకమిటీ సభ్యులు

**పాడేరు,జనవరి21, ప్రభాతవార్త:** ఛతీస్‌గఢ్ అడవుల్లో కాల్పుల మోత మోగుతూనే ఉంది. ఛత్తీస్‌గఢ్-ఒడిశా రాష్ట్రాల సరిహద్దులో మంగళవారం జరిగిన ఎంటర్లో మావోయిస్టులకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పులలో ఇప్పటి వరకు ఎదురు కాల్పుల్లో 20 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీసులు వెల్లడించారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సరిహద్దుల్లో జిల్లా రిజర్వ్‌గార్డ్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఛతీస్‌గఢ్‌కు చెందిన కోబ్రా, ఒడిశాకు చెందిన స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ సంయుక్తంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. ఎదురు కాల్పుల్లో మావోయిస్టుల మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం. ఈ కాల్పుల్లో భద్రతా సిబ్బంది సంయుక్తంగా ఈ ఆపరేషన్లో పాల్గొంటున్నాయి. ఒడిశాకు సరిహద్దు జిల్లా గరియాబంద్ జిల్లా మెయిన్పురి పోలీస్ స్టేషన్ పరిధిలోని కులారి ఘాట్ అటవీ ప్రాంతంలో నిన్న రాత్రి నుంచి ఆపరేషన్ కొనసాగిస్తున్నారు. సోమవారం జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరుమహిళా మావోయిస్టుల మృతిచెందగా, ఓ జవానుకు >>2

## 25మంది ఐఎఎస్‌ల బదిలీ

**విజయవాడ.జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పాలనా యంత్రాంగంలో కీలక మార్పులు చేస్తూ నిర్ణయాలు తీసుకున్నారు. ఇరవైఐదుమంది ఐఎఎస్‌అధికారుల్ని బదిలీ చేశారు. ఇందులో ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అమరావతి పనుల్ని పర్యవేక్షిస్తున్న సీఆర్డీఏ కమిషనర్ కాటమనేని భాస్కర్ ను కూడా బదిలీ చేశారు. ఆయన స్థానంలో సీనియర్ ఐఏఎస్ కన్నబాబును నియమించారు. మంత్రి నారాయణ వేగాన్ని కాటమనేని భాస్కర్ అందుకోలేకపోతున్నారని ఆయనపై మంత్రి అసంతృప్తిగా ఉన్నారన్న ప్రచారం కొంత కాలంగా సాగుతోంది. దానికి తగ్గట్లుగానే ఆయనను మార్చి కన్నబాబును నియమించారు. ఇక చీఫ్‌సెక్రటరీ రేసులో ప్రముఖంగా వినిపించిన పేరు సాయిప్రసాద్. ఆయనను ఎక్స్ ఆఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నేరుగా ముఖ్యమంత్రికి రిపోర్టు చేసేలా బదలీచేశారు. మరో సీనియర్ ఐఎఎస్ అజ య్‌జైన్‌ను టూరిజం, >>2



రాష్ట్రంలో వివిధ జిల్లాలకు

## బిజెపి చీఫ్‌ల ఎన్నిక

### అభినందనలు తెలిపిన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** బీజేపీ ఏపీ జిల్లాల అధ్యక్షులను ఆ పార్టీ అధిష్ఠానం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలను బీజేపీ నిర్వహించింది. మొత్తంగా 24 జిల్లాలకు కొత్త అధ్యక్షులను నియమిస్తూ ఓ ప్రకటన విడుదల చేసింది. వీరంతా ప్రజాస్వామ్యబద్ధంగా ఎంపికయిన వారేనని ,వారందరికి ఏపీ బీజేపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పురంధేశ్వరి మాట్లాడుతూ ప్రజాస్వా మ్యబద్ధంగా బీజేపీ సంస్థాగత ఎన్నికలు జరిగాయని తెలిపారు. నేతలు ప్రతి కార్యకర్తను కలుపుకొని ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఏపీకి కేంద్రం అన్నివిధాలా సాయం అందిస్తోందని చెప్పారు. గత ఐదేళ్ల పోలవరంలో చిటికెడు మట్టి కూడా వేయలేదన్నారు. కొత్త డయాఫ్రమ్ వాల్ నిర్మాణం ప్రారంభమైందని పురంధేశ్వరి పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షునిగా ద్వారపు శ్రీనివా సరావు,అల్లూరి సీతారామరాజు జిల్లా(అరకు),మఠం వాంతకుమారి,శ్రీకాకుళంజిల్లా అధ్యక్షునిగా సిరిపురం తేజేశ్వరరావు,విజయనగరం జిల్లా ఉప్పలపాటి రాజేష్‌వర్మ, విశాఖజిల్లా అధ్యక్షునిగా మంతెన పరుశురాంరాజు, అనకాపల్లిజిల్లా ద్వారపురెడ్డి పరమేశ్వరరావు,కాకినాడ జిల్లా బిక్కిన విశ్వేశ్వరరావు, >>2

## రహదారుల విస్తరణకు త్వరగా భూసేకరణ



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల నిర్మాణం,విస్తరణ వాటిపై బైపాస్ రహదారుల నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూసేకరణను వేగవతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు జజిల్లా కలక్టర్లు,సంయుక్త కలక్టర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వ .జాతీయ రహదారుల నిర్మాణం,విస్తరణ, బైపాస్ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ,అటవీ అనుమతుల మంజూరు తదితర పెండింగ్ అంశాలపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి రెవెన్యూ,అటవీ, టిఆర్అండ్బి,జాతీయ రహదారుల సంస్థ,మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్సు పోర్టు అండ్ హైవేస్ శాఖల అధికారులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లు,జెసిలతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ జాతీయ రహదార్లు వంటి ప్రాధాన్య రహదార్ల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి సంబంధిత నిర్మాణ ఏజెన్సీలకు సకాలంలో అందించే విధంగా కలక్టర్లు,జెసిలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ,అటవీ అనుమతుల మంజూరుపై జిల్లాల వారీగా కలక్టర్లు,జెసిలతో సిఎస్ విజయానంద్ సమీక్షించారు.భూసేకరణకు సంబంధించిన నిబంధనల ప్రకారం రైతులకు నష్ట పరిహారాన్ని అందించి సకాలంలో భూసేకరణ ప్రక్రియను పూర్తి చేసి ఆయా నిర్మాణ సంస్థలకు అందించాలని స్పష్టం చేశారు. ఈవిషయంలో వివిధ సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు వీలుగా రెవెన్యూ, ఆటవీ, టిఆర్ అండ్బి,జాతీయ రహదార్ల సంస్థ,మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్సు పోర్టు అండ్ హైవేస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ చెప్పారు. ఈసమావేశంలో సిసిఎల్ఏ జి.జయలక్ష్మి,టిఆర్అండ్బి ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే,అదనపు పిసిసిఎఫ్ రాహుల్ పాండే,ఎన్ హెచ్ ఎఐ రీజనల్ అధికారి ఆర్కె సింగ్, మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్సు పోర్టు అండ్ హైవేస్ రీజనల్ అధికారి రాకేశ్ కుమార్ పాల్గొన్నారు.అదే విధంగా వివిధ జిల్లాల కలెక్టర్లు,జెసిలు వర్చువల్ గా ఈవీడియో సమావేశంలో పాల్గొన్నారు.

తాలిబన్లతో అమెరికా ఒప్పందం

ఖాన్‌మహ్మద్ విడుదలకు యుఎస్ ఓకే 9లో

# అమరావతికి సిఐఐ సెంటర్

## గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్ హబ్‌గా రాష్ట్రం

వివిధ దేశాల పెట్టుబడిదారుల సదస్సులో సిఎం చంద్రబాబు

సింగపూర్ డి.పిఎం గాన్ కిమ్ యాంగ్‌తోనూ ముఖ్యమంత్రి చర్చలు



**విజయవాడ.జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోందని, ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం దావోస్ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబు నేడు ప్రపంచ ఆర్థిక సదస్సులో భాగంగా సీఐఐ ఆధ్వర్యంలో గ్రీన్ ఇండిస్ట్రియలైజేషన్‌పై నిర్వహించిన మీటింగ్‌లో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ భారతీయుల రక్తంలోనే వ్యాపార లక్షణాలు ఉన్నాయని అన్నారు. సదస్సు లో ఉన్న అందర్నీ చూస్తుంటే తనలో నమ్మకం పెరిగిందని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో తన కలలు నిజమవుతాయనే నమ్మకం కలిగిందన్నారు. రెండున్నర దశాబ్దాల్లో హైదరాబాద్ అభివృద్ధి చెందిందన్నారు. భారత్‌లో అత్యంత నివాసయోగ్యమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఎంతో కృషి చేశామని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. 25 ఏళ్ల కిందట బిల్ గేట్స్ ఐటీ సేవలను తీసుకొచ్చారని తెలిపారు. 1991లో దేశంలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టారని అన్నారు. ఇంటర్నెట్, ఆర్థిక సంస్కరణలను వినియోగించి రెండో తరం సంస్కరణలను ప్రవేశపెట్టానని చంద్రబాబు తెలిపారు. 1999లో తొలిసారిగా విద్యుత్ సంస్కరణలు ప్రారంభమయ్యాయన్నారు. పాలనా వ్యవస్థలో ఉన్న వ్యక్తిగా ఆ సంస్కరణలు తీసుకు వచ్చినందుకు ఎన్నికల్లో ఓడిపోయానని, ఇప్పుడు ఆ విధానాలే ప్రజలకు అనుకూలంగా, అత్యుత్తమంగా మారిపోయాయని చంద్రబాబు తెలిపారు. 2014లో మరోమారు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక సౌర విద్యుత్‌పై ఎక్కువ దృష్టిపెట్టామన్నారు. ఇప్పుడు ప్రధాన మంత్రి సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌర ఉత్పత్తి చేయాలని ఓ విధాన నిర్ణయం ప్రకటించారని వెల్లడించారు. సంప్రదాయేతర ఇంధన వనరుల్లో సౌర, పవన,గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తిపై ఎక్కువ దృష్టి పెట్టామన్నారు. అలాగే పంప్డ్ స్టోరేజీ ద్వారా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపైనా ఏపీలోఎక్కువ దృష్టి పెట్టామన్నారు. 115 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు ఇంధనవనరుల్లో వస్తున్నాయన్నారు. 500 మెగావాట్ల, 5ఎంపీటీపీఎ గ్రీన్‌హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతు >>2

# 'స్వయం ఉపాధి'లో మార్పులు

### వాటా చెల్లించనవసరంలేని లబ్ధిదారులు: రాష్ట్ర ప్రభుత్వం కీలకనిర్ణయం

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** వెనుకబడిన తరగతులు(బీసీలు), ఆర్థికంగా బలహీనవర్గాలు(ఈబీసీ)ల్లో పేదరికాన్ని రూపుమాపేలా ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయా వర్గాల్లోని పేదలకు స్వయం ఉపాధి రాయితీ రుణాల మంజూరు ప్రక్రియను మరింత సులభతరం వేగవంతం చేసింది. 2024-25 ఏడాదికిగానూ రాయితీ రుణాలు అందించేందుకు బీసీలకు రూ.896 కోట్లు, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు రూ.384 కోట్లు బడ్జెట్‌లో కేటాయించింది. జిల్లాల వారీగా ఆయా వర్గాల జనాభాను బట్టి ఈ నిధుల వ్యయానికి లక్ష్యాన్ని నిర్దేశించింది. పథకం అమలుకు మార్గదర్శకాలు పంపిన ఉన్నతాధికారులు వారం రోజుల్లో అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణకు సిద్దంగా ఉండాలని ఆదేశాలిచ్చారు. మొత్తంగా ఈ ఏడాది స్వయం ఉపాధి రాయితీ రుణ పథకం కింద 1.30 లక్షల మంది బీసీలు 59 వేల మంది ఈడబ్ల్యూఎస్ వర్గాలకు లబ్ధి చేకూరనుంది. గతంలో రాయితీ రుణాల మంజూరు పథకంలో ఎంపికైన వారు లబ్దిదారు వాటా కింద కొంతమొత్తం పెట్టుబడిగా పెట్టాల్సి వచ్చేది. ఆపై కొంత సొమ్మును ప్రభుత్వం రాయితీపై ఇచ్చేది. మరికొంత బ్యాంకు రుణంగా ఇప్పించేది. తాజా మార్గదర్శకాల్లో లబ్దిదారు వాటాను తొలగించింది . యూనిట్ వ్యవస్థాపక వ్యయంలో ప్రభుత్వ రాయితీ పోనూ, మిగతా మొత్తాన్ని బ్యాంకు నుంచి రుణంగా అందించనుంది. గత అనుభవాల దృష్ట్యా ఈ దఫా పథకం పక్కాగా అమలయ్యేలా యూనిట్లకు జియోట్యాగింగ్ చేయించనుంది. పూర్తి స్థాయిలో గ్రౌండింగ్ అయ్యింది. లేనిదీ పర్యవేక్షించేందుకు జిల్లా స్థాయిలో తనిఖీ బృందాలను నియమించనుంది. స్వయం ఉపాధి రాయితీ రుణ పథ కాలకు అర్హులనుంచి దరఖాస్తుల స్వీకరణకు ప్రభుత్వం >>2

మాజీ మంత్రి మెరుగు నాగార్జునకు

## హైకోర్టులో ఊరట

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ మంత్రి మెరుగు నాగార్జునకు ఏపీ హైకోర్టులో ఊరట లభించింది. ఆయనపై నమోదైన అత్యాచారం కేసును హైకోర్టు క్వాష్ చేసింది. మాజీ మంత్రి మేరుగ నాగార్జునపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో గత ఏడాది నవంబర్‌లో తనను లైంగికంగా వేధించారని విజయవాడకు చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. తనకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మేరుగు నాగార్జున రూ.90 లక్షలు తీసుకున్నాడని విజయవాడకు చెందిన బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. తనను శారీరంగా కూడా ఉపయోగించుకున్నారని పలుమార్లు >>2

22-1pg2exHMNWJQE.qxd:22-1pg2exHMNWJQE.qxd 01/01/01 9:22 AM Page 1






## రేపటినుండి యధావిధిగా ఎస్ఎస్‌డి టోకెన్లు జారీ

**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో టిటిడి గతంలోలాగే ఏరోజుకారోజు దర్శన ఎస్ఎస్‌డి టోకెన్లు జారీచేయనుంది. ఈనెల 23వతేదీ గురువారం తెల్లవారుజాము నుండి ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు అందించనుంది. తిరుపతి ఆర్టీసిబస్టాండు సమీపంలోని శ్రీనివాసం, రైల్వేస్టేషన్ సమీపంలోని విష్ణునివాసం, అలిపిరి వద్ద వున్న భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్లలో గతంలో మాదిరిగానే ఈ టోకన్లు భక్తులు పొందవచ్చని టిటిడి తెలిపింది.

# 100 దేశాల్లో తెలుగువారు

>> కత కలిగిన నాయకుడు మోదీ అని చంద్రబాబు ప్రశంసించారు. సంపద సృష్టిలో భారతీయులు అగ్రగామిగా ఎదగడం ద్వారా 2047 నాటికి భారత్ తొలి రెండు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలుస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. **స్వర్ణాంధ్ర 2047 విజన్:** స్వర్ణాంధ్ర - 2047 విజన్ రోడ్‌మ్యాప్‌లో భాగంగా రాష్ట్రంలో అమలు చేస్తున్న పది మార్గదర్శక సూత్రాలను ముఖ్యమంత్రి వివరించారు. కాస్ట్ ఆప్టిమైజేషన్, పర్యావరణ సమతుల్యతపై దృష్టి పెట్టి గ్లోబల్ గ్రీన్ హైడ్రోజన్, ఫ్యూయల్ మార్కెట్‌లలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రగామిగా చేస్తున్నామని, కాకినాడ వంటి పటిష్టమైన ఓడరేవుల ద్వారా ప్రపంచానికి గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తులను ఎగుమతి చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. స్వర్ణాంధ్ర - 2047 విజన్ రూపకల్పనలో టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ మార్గనిర్దేశాన్ని మరిచిపోలేమన్నారు. అమరావతిలో గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ భవిష్యత్ నాయకులను సిద్ధం చేయడానికి అమరావతిలోని గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ (బిలిది) దోహదపడుతుందన్నారు. నాయకత్వ వికాసాన్ని పెంపొందించడానికి స్విట్జర్లాండ్‌కు చెందిన ఐఎండీ బిజినెస్ స్కూల్, జీఎల్‌సీ మధ్య అవగాహన కలిగిందన్నారు. సంక్లిష్ట సమస్యలను పరిష్కరించడానికి, దైనందిన జీవితాన్ని మెరుగుపరచడానికి ఏఐ, రియల్ టైమ్ డేటా వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాల్సిన అవసరాన్ని చంద్రబాబు వివరించారు. భారతదేశం అందించిన సేంద్రియ వ్యవసాయం ప్రపంచ సమాజానికి ఒక వరంగా చంద్రబాబు పేర్కొన్నారు. పీ4 మోడల్ ద్వారా ప్రభుత్వప్రైవేటు పబ్లిక్ భాగస్వామ్యాన్ని ఇటు పాలనలోనూ తీసుకువచ్చామని చెప్పారు. హరిత పారిశ్రామికీకరణ, డీప్‌టెక్ ఇన్నోవేషన్, సమ్మిళిత నాయకత్వంపై దృష్టి సారించామని చెప్పారు. రాష్ట్రాన్ని గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌కు గ్లోబల్ హబ్‌గా మార్చడానికి కృషి చేస్తున్నట్టు చంద్రబాబు చెప్పారు. ఇంధన సంస్కరణలు కూడా సుస్థిర అభివృద్ధికి ఒక ఉదాహరణగా తెలిపారు. 1999లో రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం ఎదుర్కొంటున్న సమయంలో సాహసోపేతమైన విద్యుత్ సంస్కరణలను ప్రవేశపెట్టి విజయం సాధించనని గుర్తు చేశారు. నాడు దేశం తీవ్రమైన విద్యుత్ కొరతను ఎదుర్కొంది, పరిశ్రమలు మూసివేయవలసి వచ్చిందని.. కొన్ని సవాళ్లుభయాలు ఉన్నప్పటికీ క్లిష్టమైన సంస్కరణలను చేపట్టానని... ఆనాటి సంస్కరణల వల్ల తన రాజకీయంగా నష్టం కలిగించిందని, అయితే ఆ నిర్ణయాలతో ఇప్పుడు ప్రయోజనాలు పొందుతున్నామనే సంతృప్తి ఉందన్నారు. అలాగే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తిలో గణనీయమైన పురోగతిని సాధించామని, ఇంధన ఖర్చులు తగ్గించగలిగామని అన్నారు. మిషన్ మోడ్‌లో క్లీన్ ఎనర్జీ పాలసీ అమలు : సుస్థిర లక్ష్యాలను సాధించేందుకు మిషన్‌మోడ్ విధానంతో ఆంధ్రప్రదేశ్‌ను క్లీన్ ఎనర్జీ హబ్‌గా మార్చాలనేది తన ఉద్దేశంగా ముఖ్యమంత్రి చెప్పారు. 2030 నాటికి 500 లీజా పునరుత్పాదక విద్యుత్‌ను, 500 మిలియన్ మెట్రిక్ టన్నుల గ్రీన్ ఎనర్జీని ఉత్పత్తి చేయడానికి ఇంధన రంగంలో 115 బిలియన్ డాలర్ల భారీ పెట్టుబడులను ఆకర్షించామని, ఇది జాతీయ లక్ష్యంలో 30 శాతంగా చెప్పారు. భారతదేశ పునరుత్పాదక ఇంధన ఆశయాలను వేగంగా సాధించేలా జాయింట్ వెంచర్‌గా నెలకొల్పుతున్న 21 బిలియన్ డాలర్ల విలువైన గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టును ఇటీవల ప్రధాన మంత్రి విశాఖపట్నంలో శంకుస్థాపన చేశారని ముఖ్యమంత్రి చెప్పారు. అదనంగా, బయో ఫ్యూయల్ రంగంలో రిలయన్స్ రూ. 65 వేల కోట్ల పెట్టుబడులు ఏపీలో పెడుతోందని అన్నారు.

**ప్రజల చెంతకు సాంకేతిక పురోగతులు**

ప్రజల్నే విద్యుత్ ఉత్పత్తిదారులుగా చేసేలా రూఫ్‌టాప్ సౌర విద్యుత్ ఏర్పాటును, కర్బన ఉద్గారాలను తగ్గించడానికి నెట్ జీరో లక్ష్యంగా ఎలక్ట్రిక్‌వెహికల్‌ను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. డ్రోన్ సాంకేతికతను వ్యవసాయరంగ అభివృద్ధికి వినియోగిస్తున్నామని అన్నారు.

**పారిశ్రామికవేత్తలకు మద్దతు**

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనేది తమ విధానమని, పారిశ్రామిక వేత్తలకు, ఇంధన వ్యయాలను మరింత తగ్గించేలా నిరంతర పరిశోధనలు అభివృద్ధికి తమ మద్దతు ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. తన ప్రసంగంలో 1995 నుంచి నేటి దాకా సీఐఐతో తనకున్న సుదీర్ఘ అనుబంధాన్ని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. పేదరికం, సమాజంలో అసమానతలను రూపుమాపడానికి కార్పొరేట్ సంస్థలు, అధిపతులు ముందుకొచ్చి బాధ్యత తీసుకోవాలని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.



పట్టుబడిన గంజాయితో నిందితులను చూపుతున్న పోలీసులు

## చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద 218 కిలోల గంజాయి పట్టివేత

**జగ్గయ్యపేట, జనవరి 21, ప్రభాతవార్త:** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు సమీపంలోని జాతీయ రహదారి-65పై గల జిఎంఆర్ టోల్‌ప్లాజా వద్ద మంగళవారం అక్రమంగా 218 కిలోల గంజాయిని రవాణా చేస్తున్న రెండు కార్లను గుర్తించి పోలీసులు వాటిని స్వాధీనపర్చుకున్నారు. నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌ను గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే ధ్యేయంతో ప్రభుత్వం ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటుచేసింది. ఈక్రమంలో విజయవాడ నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వి రాజశేఖరబాబు పర్యవేక్షణలో రూరల్ డిసిపి కెఎం మహేశ్వరరాజు, నందిగామ ఏసిపి పిబిజె తిలక్ సూచనలతో జగ్గయ్యపేట సిఐ పి వెంకటేశ్వర్లు, వత్సవాయి ఎస్ఐ వారి సిబ్బంది కలిసి చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు చేస్తుండగా దాదాపు రూ.30 లక్షల విలువైన గంజాయిని గుర్తించారు. నిందితులు అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం టెన్న భూపాల పట్నం గ్రామానికి చెందిన బియ్యాల నాగేశ్వరరావు (33), అనుమాల ప్రసాద్ (55), అదేజిల్లా అదే మండలంలోని మరుపాక గ్రామా నికి చెందిన తలారి రమణ (29), నర్సీపట్నం మండలం పాత టైపురెడ్డి గ్రామానికి చెందిన టైపురెడ్డి ఎల్లయ్య (31)ను అరెస్ట్‌చేశారు. పోలీసు ఉన్నతాధికారులు ఈ సందర్భంగా వత్సవాయి, జగ్గయ్యపేట సర్కిల్ పోలీసులను అభినందించారు.

# వలసదారులపై ట్రంప్ కొరడా

>>నివసిస్తున్నారు. అమెరికా మొత్తం జనాభాలో సుమారు 1.47శాతంమంది భారతీయులే. వీరిలో 34శాతం మంది అమెరికాలో పుట్టినవారున్నారు. మిగిలినవారంతా వలసదారులే. ఈక్రమంలో ట్రంప్ నిర్ణయం భారతీయులపై ప్రభావం చూపిస్తుంది. తాత్కాలిక తీసాపై అమెరికా వెళ్లి గ్రీన్‌కార్డుకోసం వేచిచూస్తున్నవారికి పుట్టిన పిల్లలెవరికీ అమెరికా పౌరసత్వం లభించదు. ఈప్రభావం ఇపుడు భారతీయులకే ఎక్కువగా ఉంటున్నది. అమెరికాలో ఇపుడు భారతీయ తల్లితండ్రుల పిల్లలకు ఇప్పటిలా అక్కడి జన్మతఃపౌరసత్వంలభించదు. ఇప్పటికే గ్రీన్‌కార్డురాకుండా ఉన్న భారతీయ వలసదారులు వారి పిల్లలకు అక్కడి పౌరసత్వం రాకపోతే గ్రీన్‌కార్డు జారీప్రక్రియ మరింతజాప్యం అవుతుంది. అమెరికాలోజన్మించిన వారికి జన్మతఃపౌరసత్వం రాకపోతే వారికి 21 ఏళ్లు నిండిన తర్వాత తమ తల్లితండ్రులను అమెరికాకు తీసుకొస్తామని ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేరు. దీనివల్ల తల్లితండ్రులు భారత్‌లో పిల్లలు అమెరికాలో ఉండాల్సి వస్తుంది. చట్టపరంగా చిక్కులు ఎదురవుతాయి. ఇక బర్త్‌టూరిజం అదృశ్యం అవుతుంది. పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించే లక్ష్యంతో ఉన్నతస్థితిలో ఉన్న అనేకమంది భారతీయ మహిళలు డెలివరీసమయానికి అమెరికా వెళ్లిపోతుంటారు. దీనినే బర్త్ టూరిజం అంటారు. ఇకపై దీనికి బ్రేకులు పడుతున్నాయి. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాపై అమెరికా వెళ్లిన భారతీయ విద్యార్థులకు జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం అనేది ఇక లభించదు. అమెరికాలో ఉంటున్న విదేశీ విద్యార్థుల్లో ఎక్కువమంది భారతీయులే. ప్రత్యేకంగా ఇంజినీరింగ్, టెక్నాలజీ విభాగాల్లో ఎక్కువగా ఉంటారు. వీరిలో కొందరు ఇతర దేశాలవారిని అక్కడే వివాహంచేసుకుంటారు. ఇలాంటి వారు ఇకపై పిల్లల విషయంలో చాలా సమస్యలు ఎదుర్కొంటారు. 2011లో అమెరికా ఇమ్మిగ్రేషన్ మండలి విడదలచేసిన వివరాలప్రకారం జన్మతఃపౌరసత్వం నిలిపివేస్తేప్రభావం అందరిపైనా పడుతుంది. అమెరికా ప్రజలు కూడా తమ పిల్లలు ఈదేశానికి చెందినవారే అని నిరూపించుకోవాలి. ట్రంప్ సంతకాలుచేసినా ఈ చట్టం రద్దుకు న్యాయపరమైన చిక్కులుంటాయి. రాజ్యాంగంలోని నిబంధనలు మార్చాలంటే సుదీర్ఘ ప్రక్రియ ఉంటుంది. అమెరికా రాజ్యాంగానిక సవరించాలంటే హౌస్, సెనెట్‌లో మూడింట రెండొంతుల మెజార్టీ ఓట్లు అవసరం. తర్వాత రాష్ట్రాల శాసనసభల్లో నాలుగింట మూడొంతులమెజార్టీ ఆమోదించాలి. కొత్త సెనేట్‌లో డెమొక్రాట్‌లకు 47 స్థానాలుంటే రిపబ్లికన్లకు 53స్థానాలున్నాయి. మరోవైపు హౌస్‌లో డెమొక్రాట్లకు 215 స్థానాలు రిపబ్లికన్లకు 220స్థానాలున్నాయి. ఈక్రమంలో రాజ్యాంగసవరణ అంతసులువేమీ కాదు.

# జనసేనకు గాజు గ్లాస్ గుర్తును రిజర్వు చేసిన ఎన్నికల సంఘం



**విజయవాడ,.జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** జనసేన పార్టీని కేంద్ర ఎన్నికల సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుర్తింపు పొందిన పార్టీల జాబితాలో చేర్చింది. జనసేనకు గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ కు లేఖ పంపించింది. సార్వత్రిక ఎన్నికల్లో 100శాతం విజయం నమోదు చేసిన పార్టీగా జనసేన రికార్డు సాధించింది. పోటీ చేసిన 21 అసెంబ్లీ స్థానాల్లో, 2 లోక్‌సభ స్థానాల్లో అఖండ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ క్రమంలో జనసేన రికగ్నైజ్డ్ పార్టీగా నిలిచి, గాజు గ్లాసు గుర్తును రిజర్వ్ చేసుకుంది. జనసేన పార్టీని పవన్ కల్యాణ్ 2014లో స్థాపించారు. అప్పుడు జరిగిన ఎన్నికలలో జనసేన నేరుగా పోటీ చేయకుండా ఇతర పార్టీలకు మద్దతిచ్చింది. 2019 ఎన్నికలలో పోటీ చేసిన జనసేన ఒక సీటు గెలుచుకుంది. 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీతో కలిసి కూటమిగా ఏర్పడి అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేసి అన్ని స్థానాల్లో గెలుపొంది రికార్డ్ సాధించింది.

# 25మంది ఐఎఎస్‌ల బదలీ

>> కల్చర్ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా బదిలీ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బుడితి రాజశేఖర్ కు ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా కొనసాగిస్తూ అగ్రికల్చర్, సెరీకల్చర్ బాధ్యలు అప్పగించారు. పబ్లిక్ ఎంటర్ ప్రైజెస్ డిపార్టుమెంట్‌కు కె సునీతను ప్రిన్సిపల్ సెక్రటరీగా నియమించారు. ఆర్కియాలజీ, మ్యూజియమ్స్ కమిషనర్‌గా జీ వాణి మోహన్, ప్రిన్సిపల్ ఫైనాన్స్ సెక్రటరీగా పీయూష్ కుమార్ ను నియమించారు. అత్యంత కీలకమైన జీఏడీ పొలిటికల్ బాధ్యతలను ముఖేష్ కుమార్ మీనాకు అప్పగించారు. సురేష్ కుమార్‌కు సీఆర్డీఏ కమిషనర్ గా నియమితులైన కన్నబాబు నిర్వహించిన బాధ్యతలన్నీ అప్పగించారు. సెలవులో ఉండి తాజాగా రిపోర్టు చేసిన సౌరభ్ గౌర్ ను సివిల్ సప్లయిస్ శాఖ కమిషనర్ గా నియమించారు. కోన శశిధర్ ను హయ్యర్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ సెక్రటరీగా నియమించారు. సీఆర్డీఏ కమిషనర్ గా బదిలీ చేసిన కాటమనేని భాస్కర్ కు ఐటీసీ అండ్ ఈ సెక్రటరీగా, ఆర్టీజీఎస్, గ్రామ సచివాలయం, వార్డు సచివాలయం బాధ్యతలను కూడా ఇచ్చారు. వాకాటి కరుణను సెర్ప్ సీఈవోగా, ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ సెక్రటరీగా యువరాజ్, ముడా వత్ ఎంనాయక్‌కు సోషల్ వేల్ఫేర్ డిపార్టుమెంట్ సెక్రటరీగా నియమించారు. పవన్ కుమార్ కు పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శిగా పోస్టింగ్ ఇచ్చారు. శేషగిరిబాబు కార్మిక శాఖ కమిషనర్ గా, వాద్రేవు వినయ్ చంద్ ఎండోమెంట్ రెవిన్యూ సెక్రటరీగా పోస్టింగు పొందారు. వీరపాండియన్ ఫ్యామిలీ అండ్ హెల్త్ కమిషనర్ , హరి నారాయణ స్టాంప్స్ డిపార్టుమెంట్ ఐజీగా, గిరిశను ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్‌గా , పాతంశెట్టి రవి సుభాష్ ను ఎన్టీఆర్ వైద్య సేవ సీఈవోగా నియమించారు.

# రాష్ట్రంలో వివిధ జిల్లాలకు బిజెపి చీఫ్‌ల ఎన్నిక

>> డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షునిగా అడబబాల సత్యనారాయణ, తూర్పుగోదావరి జిల్లా పిక్కి నాగేంద్ర, పశ్చిమగోదావరి జిల్లా జనంపూడి శ్రీదేవి. ఏలూరు జిల్లా అధ్యక్షునగా చౌటపల్లి విక్రమ్ కిశోర్, ఎన్టీఆర్ జల్లా అడ్డూరి శ్రీరామ్, గుంటూరు జిల్లా చెరుకూరి తిరుపతి రావు, పల్నాడు జిల్లా, ఏలూరి వెంకట మారుతి శశికుమార్, ఒంగోలు జిల్లా సెగ్గం శ్రీనివాసులు, నెల్లూరు జిల్లా శ్రీపారెడ్డి వంశీధర్‌రెడ్డి, తిరుపతి జిల్లా సామంచి శ్రీనివాసరావు, అన్నమయ్య జిల్లా వసంత సాయిలోకేష్. చిత్తూరు జిల్లా సూరపనేని జగదీశ్వర్‌నాయుడు, కడప జిల్లా ఒంగిటి వెంకట సుబ్బారెడ్డి, సత్యసాయి జిల్లా గోరంట్ల మోహన్ శేఖర్, అనంగపూర్ జిల్లా కొనకొండ రాజేష్, కర్నూలు జిల్లా బాపురం రామకృష్ణ పరమహంస, నంద్యాల జిల్లా అభిరుచి మధులు ఎన్నికయ్యారు.

# మరో 27మంది మావోయిస్టులు హతం

>> గాయాలయ్యాయి. మంగళవారం ఉదయం జరిగిన ఉదురుకాల్పుల్లో 18 మంది మావోయిస్టులు మృతి చెందారు. దీంతో మావోల మృతుల సంఖ్య 20కి చేరింది. ఇప్పటికి సెర్చ్ ఆపరేషన్ జరుగుతున్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశమున్నట్లు అంచనా వేస్తున్నారు. ఈ ఆపరేషన్లో వెయ్యి మంది వరకు వివిధ భద్రతా సిబ్బంది పాల్గొన్నట్లు సమాచారం. ఈ ఎదురుకాల్పుల్లో మృతి చెందిన వారిలో మావోయిస్టు పార్టీ అగ్ర నేతలు ఉన్నట్టు సమాచారం. ఈ ఉదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిశా రాష్ట్ర కార్యదర్శి చలపతి అలియాస్ రామచంద్రారెడ్డి మరణించినట్లు తెలుస్తోంది ఆయనపై రూ. కోటి రివార్డును గతంలో ప్రభుత్వం ప్రకటించింది. చలపతి స్వస్థలం చిత్తూరు జిల్లా. ఇంకా మృతుల్లో కేంద్ర కమిటీ సభ్యుడు మనోజ్ అలియాస్ మోడం బాలకృష్ణ, స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు గుడ్డు కూడా ఉన్నట్లు రాయ్పూర్ రేంజ్ ఐజీ అమ్రేశ్ వెల్లడించారు. ఇప్పటివరకు 20 మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామనిఅయన వెల్లడించారు. ఘటనా స్థలం నుంచి ఏకే 47, ఎస్ఎల్దీర్, ఇన్సాస్, పలు ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ప్రస్తుతం మావోయిస్టులు భద్రతా బలగాలు మధ్య ఎదురుకాల్పులు జరుగుతున్నాయని పోలీస్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. **నక్సలిజం లేని భారత్‌కు బలమైన అడుగు: కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా:** 2026 మార్చి నాటికి మావోయిస్టుల ఉనికే లేకుండా చేస్తామని, ఈ ఎన్ కౌంటర్ను నక్సలిజం రూపుమాపేందుకు మరో బలమైన అడుగు అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. నక్సలిజం లేని భారత్ నిర్మించడంలో మన భద్రతాదళాలు భారీ విజయాన్ని సాధించాయి. సీఆర్పీఎఫ్, ఎస్జీ ఒడిశా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ఒడిశా ఛత్తీస్ గఢ్ సరిహద్దులో సంయుక్త ఆపరేషన్లో నక్సలైట్లను మట్టు బెట్టారు అని ఆయన సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు.

# అమరావతికి సిఐఐ సెంటర్

>> న్నామని తెలిపారు. 21 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ఎన్టీపీసీఏపీ జెన్‌కో సంయుక్తంగా గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి చేయబోతున్నాయని చెప్పారు. ఏపీ గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా మారబోతోందని చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో విద్యుత్ ఉత్పాదనకు మంచి అవకాశాలున్నాయని తెలిపారు. సుదీర్ఘమైన తీరప్రాంతం, రవాణాకు అందుబాటులో పోర్టులు ఉన్నా యన్నారు. ఈవీ వాహనాలు ఉత్పత్తి చేసేందుకు ఏపీ ప్రోత్సా హకాలు అందిస్తుందని భరోసానిచ్చారు. పీఎం సూర్యఘర్ కింద ఇంటింటికీ సౌరఫలకాలు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేయబోతున్నామని వెల్లడించారు. అత్యంత తక్కువ ఖర్చుతోనే ఈ విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి రావాలని, ఓవైపు పర్యావరణాన్ని సంరక్షిస్తూనే ఈ విద్యుత్ ఉత్పత్తి పెద్ద ఎత్తున జరగాల్సి ఉందని సూచించారు. రాష్ట్రంలో ఆర్గానిక్ వ్యవసాయంపైనా దృష్టి పెట్టామని చంద్రబాబు తెలిపారు. గ్లోబల్ కమ్యూనిటీ కోసం ఏపీ ఓ మంచి మోడల్ అవుతుందని అన్నారు. విధాన రూపకర్తగా ప్రజల ప్రయోజనాల కోసం మాట్లాడుతూనే పరిశ్రమలకూ ప్రోత్సా హకాలు అందిస్తామని తెలిపారు. గ్రీన్ ఎనర్జీ, గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేసేందుకు ఏపీలో ఉన్న అవకాశాలు వినియోగించుకోవాలని పారిశ్రామికవేత్తలను కోరారు. ఎక్కడికి వెళ్లినా ఏపీ పారిశ్రామికవేత్తలే కనిపిస్తున్నారని ఆనందాన్ని వ్యక్తం చేశారు. భారతీయులు అందిస్తున్న సేవలపట్ల గర్విస్తున్నానన్నారు. భవిష్యత్‌లోనూ ఇదే తరహాలో సేవలు అందించాలని సీఎం చంద్రబాబు ఆశించారు. భవిష్యత్తు కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు రూపొందించాల న్నారు సీఎం చంద్రబాబు. పీ4 మోడల్ ద్వారా సమాజంలో ఊహించని మార్పులు వస్తాయని మనసులోని మాట వెల్లడించారు. దీని ద్వారా అసమానతలు తగ్గుతాయ న్నారు. ప్రపంచ ఆర్థిక సదస్సులో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రీన్ ఇండస్ట్రియలైజేషన్ పేరిట ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతీయులు వ్యాపారంలో బాగా రాణిస్తారని, ఆ లక్షణాలు వారిలో పుష్కలంగా ఉన్నాయన్నారు. మీ అందర్నీ చూస్తుంటే తనకు నమ్మకం పెరిగిందని, భవిష్యత్‌లో నా కలలు నిజమవు తాయన్నారు సీఎం. హైదరాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామన్నారు. 25 ఏళ్లలో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. రెండున్నర దశాబ్దాల కిందట బిల్ గేట్స్ ద్వారా ఐటీ సేవలు తీసుకొచ్చామన్న సీఎం, త ద్వారా రూపు రేఖలు మారిపోయాయని వివరించారు. దావోస్ కాంగ్రెస్ సెంటర్ ప్లీనరీ హాలు లాబీలో ఏర్పాటు చేసిన నెట్ వర్కింగ్ డిన్నర్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర పరిశ్రమల మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. ఇక రెండవ రోజు కార్యక్రమంలోను తనను కలుసుకున్న తెలుగుసంఘాల వారితో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ ఎవరు ఏ రంగంలో రాణించాలన్నా ఆర్థికంగా ఇబ్బందులు ఉండకూడదు. రాజకీయాల్లో ఉండి డబ్బులు సంపాదిస్తే ఎప్పటికీ గౌరవం రాదు. కుటుంబం రాజకీయాలపై ఆధారపడకూడదని ఒకటి రెండుసార్లు విఫలం అయినా హెరిటేజ్ స్థాపించి గౌరవంగా ఉన్నాం. నేను రాజకీయం చేస్తే నా సతీమణి వ్యాపారం చూస్తుంది. లోకేష్ కూడా రాజకీయాలు చేస్తుంటే బ్రాహ్మణి వ్యాపారాలు చూస్తున్నారంటూ జ్యూరిచ్ లో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు సీఎం. నిత్యస్ఫూర్తినిచ్చే తెలుగు జాతిలో పుట్టడం నా అదృష్టంగా భావిస్తున్నా. మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగుబిడ్డగానే పుడతా. నేనెక్కడున్నా నా మనసు తెలుగు జాతి కోసమే తపనపడుతుంది అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ఇన్ని దేశాల్లో తెలుగువారు ఉంటారని నా జీవితంలో ఊహించలేదు. అవకాశాలు అందిపుచ్చుకుని విదేశాలకు వచ్చారు. నన్ను జైలుకు పంపిన సమయంలో మీరు పోరాడిన తీరు నేను చూశాను.. ఇన్ని దేశాల్లో తెలుగువారు ఉన్నారా అనిపించింది. 53 రోజుల పాటు నా కోసం మీరు ఉద్యమం చేశారు. రాజకీయాల్లో ఉండటానికి అర్హత లేని వ్యక్తి అధికారంలో ఉంటే ఏమైందో గత ఐదేళ్లు చూశాం. రాష్ట్రాన్ని గట్టెక్కించడానికి టీడీపీ, జనసేన, బీజేపీ కలిసి పోటీ చేశాయి. ఎన్నికల సమయంలో ప్రపంచంలో ఎక్కడున్నా వచ్చి ఓట్లు వేసి మమ్మల్ని గెలిపించారు. ఇది నా జీవితంలో మర్చిపోలేను అన్నారు.

## మాజీ మంత్రి మెరుగు నాగార్జునకు హైకోర్టులో ఊరట

>> అత్యాచారం చేశాడని తెలిపింది. ఇప్పుడు తన డబ్బు తిరిగి ఇవ్వాలని అడిగితే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేసింది. విశాఖలో ఓ గిరిజన టీచర్‌ను స్లో పాయిజన్ ద్వారా చంపేశానని.. నీదే గతి పడుతుందని మేరుగు నాగార్జున పీఏ మురళి బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొంది. తనకు రావాలని రూ.90లక్షలను ఇప్పించాలని విజ్ఞప్తి చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే తనపై నమోదు చేసిన కేసును క్వాష్ చేయాలని.. ఫిర్యాదు చేసిన మహిళ తప్పుడు కేసు పెట్టినట్లుగా వాంగ్మూలం ఇచ్చిందని ఆయన హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఆ మహిళ కూడా నాగార్జునపై తాను తప్పుడు ఫిర్యాదు చేశానని.. పోలీసులు కేసును కొట్టేస్తే అభ్యంతరం లేదని అఫిడవిట్ దాఖలు చేశారు. కానీ ధర్మాసనం వెంటనే క్వాష్ చేయడానికి అంగీకరించలేదు. ముందు ఫిర్యాదు చేయడం ఆ తర్వాత కోర్టుకొచ్చి కేసు కొట్టే యాలని కోరడాన్ని ఈమధ్య తరచూ చూస్తు న్నామని బాధిత మహిళ కోరగానే కేసు కొట్టే యలేమని తప్పుడు ఫిర్యాదు చేసినట్ల తేలితే ఫిర్యాదుదారు కూడా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హైకోర్టు హెచ్చరించింది. పోలీసులు కూడా ఈ కేసుపై విచారణ కొనసాగించారు. అయితే మహిళ సహకరించలేదు. దీంతో పోలీసులు కూడా దర్యాప్తు చేయడానికి ఏమీ లేకపోయింది. చివరికి హైకోర్టు కేసును క్వాష్ చేస్తూ నిర్ణయం తీసుకుంది.

# ‘స్వయం ఉపాధి’లో మార్పులు

>> ఆన్‌లైన్ బెనిఫిషియరీ మానిటరింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ అనే వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. దీనిద్వారా గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆన్‌లైన్‌లో సొంతంగానూ దరఖాస్తు చేసుకోవచ్చు . లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను ఎంపీడీవో/ మునిసిపల్ కమిషనర్లకు అప్పగించింది. గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది ఇందుకు సహకరిస్తారు. దరఖాస్తుల పరిశీలనలో ఎవరైనా అనర్హులుగా తేలితే, వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించేలా నిర్దేశిత లక్ష్యం కంటే అదనంగా అర్హులుగా తేలితే, వారి స్థానంలో మరొకరికి అవకాశం కల్పించేలా నిర్దేశిత లక్ష్యం కంటే అదనంగా అర్హులను ఎంపిక చేయనున్నారు. ఎంపికైన వారు డాక్యుమెంటేషన్ కోసం బ్యాంకర్ల చుట్టూ తిరగకుండా మొత్తం ప్రక్రియ ఎంపీడీవో/ మునిసిపల్ కమిషనర్ కార్యాలయంలోనే పూర్తి చేయనున్నారు. ఎంపికైన లబ్ధిదారుల రాయితీ మొత్తాన్ని ప్రభుత్వం సంబంధిత బ్యాంకులకు జమ చేయనుంది. యూనిట్ ఏర్పాటుకు సంబంధించిన డాక్యుమెంట్లను లబ్ధిదారులు బ్యాంకుకు సమర్పించిన వెంటనే వారు కొనుగోలు చేసిన దుకాణానికి రాయితీ బ్యాంకు రుణం మొత్తం జమ చేయనున్నారు. యూనిట్లు మంజూరైన తర్వాత నియోజకవర్గ స్థాయిలో మేళాలు నిర్వహించి అందజేస్తారు. లబ్ధిదారుల సకాలంలో బ్యాంకు రుణ వాయిదాల చెల్లింపును పర్యవేక్షించే బాధ్యతను గ్రామ వార్డు సచివాలయ సిబ్బందిలో ఒకరికి అప్పగించనున్నారు.

# ఫ్లెమింగో సంబరాల్లో హైలైట్‌గా మంగ్లీ



**సూళ్లూరుపేట, జనవరి 21 ప్రభాతవార్త:** సూళ్లూరుపేట కేంద్రంగా మూడురోజులు పాటు నిర్వహించిన ఫ్లెమింగో ఫెస్టివల్ సంబరాల్లో ప్రముఖ నేపథ్య గాయని మంగ్లీ హైలైట్‌గా నిలిచారు. సోమవారం రాత్రి ఆమె సూళ్లూరుపేట జూనియర్ కాలేజి గ్రౌండ్స్‌లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. రెండున్నర గంటల సేపు ఆమె తన వైవిధ్యమైన పాటలతో ప్రేక్షకులను ఉర్రూ తలూగించారు. తెలంగాణ యాసతో మంగ్లీ పాడిన పాటలకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన కనిపించింది. అలాగే మూడురోజుల పాటు నేలపట్టు, పులికాట్, బివిపాలెంలకు సందర్శకుల తాకిడి ఎక్కువయింది. జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తదితరులు నేలపట్టు, అటకానితిప్ప, బివిపాలెంలలో సందర్శించి సందర్శకులను ఉత్తేజపరిచారు.



ఫ్లెమింగో ఫెస్టివల్ పోటెత్తిన సందర్శకులు

## వారం - వర్జ్యం

తేది : 22-01-2025, బుధవారం
శ్రీ క్రోధి నామ సంవత్సరం,
పుష్యమాసం, ఉత్తరాయణం,
హేమంత ఋతువు, కృష్ణపక్షం,
అష్టమి మ.3.19
స్వాతి రా.2.33
వర్జ్యం : ఉ.5.53-7.41
దు.మ.12.04-12.49
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం :** వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా కొత్త విశేషాలేవీ చోటుచేసుకోవు. ఆరోగ్యం జాగ్రత్త.

**వృషభం:** పాత సమస్యలు కొత్త, కోణంలో తారసపడతాయి. స్త్రీలతో విభేదాలు ఏర్పడవచ్చు.

**మిథునం:**జమా ఖర్చులను ఎప్పటి కప్పుడు సరిచూసుకుంటారు. నేర్పుగా ఆర్థిక సర్దుబాట్లను చేసుకోగలుగుతారు.

**కర్కాటకం :** పుకార్లు ప్రచారంలో ఉంటాయి. వ్యక్తిగత హెూదాకు మాత్రం మచ్చఏర్పడదు.

**సింహం:**ఎడ్డెమంటే తెడ్డెమనే వారితో ముఖాముఖి చర్చించవలసిన రావడం నొప్పిగా పరిణమిస్తుంది

**కన్య :** రాబడి కన్నా ఖర్చులు అధికంగా ఉంటాయి. నూతన కార్యక్రమాలను వాయిదా వేయడం మంచిది.

**తుల :** వస్త్ర వ్యాపారస్తులు, ఫైనాన్స్ రంగంలోని వారు మెలుకువతో వ్యవహరించవలసి ఉంటుంది.

**వృశ్చికం:**మీ మనస్సులోని భావాలను ఇతరులకు తెలియని వ్యకండి. ఉద్యోగస్తులకు అనుకూలం.

**ధనుస్సు:** చిన్న చిన్న వివాదాలు చిలికి చిలికి గాలివానగా మారకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

**మకరం:** పనులు నిదానంగా సాగినప్పటికీ ప్రయోజనాలు పదిలంగా ఉంటాయి. వస్తు సేకరణ.

**కుంభం:** భగవంతుని మీద భారం వేసి మీ శక్తికి మించిన నిర్ణయాలను అమలుచేస్తారు.

**మీనం :** ఇతరుల అతిజోక్యం వలన కుటుంబ కలహాలు ఏర్పడే సూచనలు. ఉన్నాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

22-01Pg3exHMNWJQEL.qxd:22-01Pg3exHMNWJQEL.qxd 01/01/01 8:13 AM Page 1



# డిప్యూటీ సీఎం అంశాన్ని ఆపేయండి

## కార్యకర్తలతో జనసేన అధిష్ఠానం

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీలో మరో డిప్యూటీ సీఎం వస్తున్నారనే అంశం రాజకీయంగా ప్రకంపనలు సృష్టించింది. కూటమి ప్రభుత్వ పాలన ప్రశాంతంగా కొనసాగుతున్న తరుణంలోనారా లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలంటూ కొందరు టీడీపీ నేతలు చేసిన డిమాండ్ చర్చనీయాంశంగా మారింది. ఈ డిమాండ్ లేవనెత్తుతున్న టీడీపీ నేతల సంఖ్య క్రమంగా పెరుగుతుండటంతో జనసేన నేతలు కూడా సీన్ లోకి ఎంటర్ అయ్యారు. లోకేశ్ ను డిప్యూటీ సీఎం చేయాలని టీడీపీ నేతలు కోరుకోవడంలో తప్పు లేదని... తమకు కూడా పవన్ ను సీఎంగా చూడాలని ఉందని వారు కౌంటర్ అటాక్ ఇచ్చారు. దీంతో విషయం హద్దులు దాటుందనే అంశాన్ని జనసేన,టీడీపీ అధినాయకత్వం గుర్తించింది.తక్షణం ఈ వ్యవహారానికి చెక్ పెట్టేందుకు సిద్ధమయ్యాయి. ఇప్పటికే ఈ అంశంపై దృష్టి సారించిన టీడీపీ హైకమాండ్ వివాదానికి ముగింపు పలికే విధంగా చర్యలు తీసుకుంది. ఈ అంశంపై ఎవరూ బహిరంగంగా మాట్లాడొద్దని పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేసింది. ఇదే అంశంపై జనసేన కేంద్ర కార్యాలయం కూడా స్పందించింది. డిప్యూటీ సీఎం అంశంపై జనసేన నేతలు, కార్యకర్తలు బహిరంగంగా మాట్లాడొద్దని, సోషల్ మీడియాలో స్పందించవద్దని ఆదేశాలు జారీ చేసింది.ఇటువంటి ప్రకటనలను ఆపేయాలని ఆదేశించింది.

# సీఎంఏలో ఎంజెపి విద్యార్థుల ప్రతిభ



## 97మంది ఉత్తీర్ణత

### - మంత్రి సవిత హర్షం

**సచివాలయం,జనవరి 21,ప్రభాతవార్త :** సీఎంఏ (సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెన్సీ) ఫౌండేషన్ పరీక్షల్లో ఎంజేపి గురుకుల కళాశాలల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పరీక్షకు 104మంది విద్యార్థులు హాజరవ్వగా, 97మంది విద్యార్థులు హాజరవ్వగా, 97మంది ఉతీర్ణత సాధించారు. రాష్ట్రంలో 18ఎంజేపి గురుకుల కళాశాలలకు చెందిన 104మంది విద్యార్థులు సీఎంఏ ఫౌండేషన్ పరీక్షలకు సిద్ధమయ్యారు. వారికి నెల్లూరుకు చెందిన రావూస్ విద్యా సంస్థ ఉచితంగా ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందజేసింది. విద్యార్థులకు పలు అంశాల్లో ఎంజేపి కళాశాలల సిబ్బంది సలహాలు సూచనలు కూడా అందజేశారు. ఇటీవల విడుదలైన సీఎంఏ ఫౌండేషన్ పరీక్షా ఫలితాల్లో 104మంది విద్యార్థులకు గాను 97మంది ఉత్తీర్ణత సాధించారు. వారంతా సీఎంఏ ఇంటర్మీడియట్ అర్హత సాధించారు. ఈ పరీక్షల్లో గట్టెక్కితే సీఎంఏ ఫైనల్ చేరుకోనున్నారు. సీఎంఏ ఫౌండేషన్ పరీక్షా ఫలితాల్లో అర్హత సాధించిన విద్యార్థులకు ప్రైవేటు కంపెనీల్లో రూ.30నుంచి రూ.40వేల ప్యాకేజీ లభించే అవకాశముంది. సీఎంఏ ఫౌండేషన్ పరీక్షల్లో 97మంది ఎంజేపి గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంపై రాష్ట్ర బిసి, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళిశాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ఉచిత శిక్షణ అందజేసిన రావూస్‌కు, కళాశాల సిబ్బందికి, విద్యార్థులకు ఆమె అభినందనలు తెలియజేశారు. బిసి విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని, అత్యుత్తమ స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. బిసి గురుకుల పాఠశాల, కళాశాల్లో అత్యుత్తమ విద్య అందిస్తున్నారనడానికి ఎంజేపి గురుకుల కళాశాల విద్యార్థుల ప్రతిభే ఇందుకు నిదర్శనమని మంత్రి సవిత పేర్కొన్నారు.

# తిరుమల సమాచారం

## అందరికీ శుభాలు కలగాలి

### - దేవుని దర్శనం ఆనందం కలిగించింది - తిరుమలలో సినీప్రముఖులు



**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ శుభాలు కలగాలని సినీనటి సంయుక్త, పూరీజగన్నాథ్ కుమారుడు ఆకాశ్‌పూరీ, గాయని మంగ్లీ, ఎమ్మెల్యే విజయశ్రీ ఆకాంక్షించారు. తిరుమల ఆలయంలో ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు ప్రశాంతంగా దేవుని దర్శనం చేసుకునేలా క్యూలైన్ల నిర్వహణ అద్భుతంగా ఉందని అన్నారు. మంగళవారం ఉదయం వేర్వేరుగా వీళ్ళంతా ఆలయంలోనికి చేరుకుని శ్రీవారిని దర్శించు కున్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

# జాతీయ పోటీల్లో రాష్ట్రం సత్తా చాటాలి

## - శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

**విజయవాడ.జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఉత్తరాఖండ్ రాష్ట్రంలో ఈనెల 28నుంచి ఫిబ్రవరి 14వ తేదీ వరకూ జరిగే 38వ జాతీయ క్రీడాపోటీల్లో ఏపీ క్రీడాకారులు సత్తాచాటాలని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ అనిమిని రవినాయుడు ఆకాంక్షించారు. విజయవాడ గుణదలలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో ఓల్గా ఆర్చరీ అసోసియేషన్ ప్రెసిడెంట్ చెరుకూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన కోచింగ్ క్యాంపును శాప్ చైర్మన్ సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 38వ జాతీయస్థాయి పోటీల్లో ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహించనున్న ఆర్చరీ క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకుని అభినందనలు తెలియజేశారు. అనంతరం కృష్ణానదిలో ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచి శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన బీచ్ కబడ్డీ కోచింగ్ క్యాంపును శాప్ చైర్మన్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని వారికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో మాట్లాడుతూ జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు శిక్షణ తీసుకుంటున్న క్రీడాకారులు అత్యుత్తమ ప్రదర్శనను కనబరిచి ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టాలన్నారు. క్రీడాకారుల భవిష్యత్తే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం నూతన స్పోర్ట్స్ పాలసీని తీసుకొచ్చిందని, ప్రభుత్వ ఉద్యోగాల కల్పనలో స్పోర్ట్స్ కోటాను 2శాతం నుంచి 3శాతానికి పెంచిందని, క్రీడా ప్రోత్సాహకాలను భారీగా పెంచిందని వివరించారు. ఏపీ నుంచి అంతర్జాతీయ క్రీడాకారులను తయారుచేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు గారు కృషి చేస్తున్నారన్నారు. దానికి అనుగుణంగా క్రీడాకారులకు ప్రయోజనకరంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో క్రీడావసతులను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. క్రీడాకారుల భవిష్యత్తు రాష్ట్ర ప్రభుత్వ బాధ్యతని, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అత్యధిక పతకాలు సాధించి రాష్ట్ర కీర్తిప్రతిష్టతలను విస్తరింపజేయాల్సిన బాధ్యత క్రీడాకారులపైనే ఉందన్నారు. ఉత్తరాఖండ్‌లో జరిగే 38వ జాతీయ పోటీలకు సిద్ధమవుతున్న అథ్లెటిక్స్ మోడ్రన్ పెంటాథ్లన్ క్రీడాకారులను శాప్ చైర్మన్ రవినాయుడు గారు సోమవారం కలిసి అభినందించారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు నిర్వహిస్తున్న కోచింగ్ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో ఆయన మాట్లాడుతూ 38వ జాతీయస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శనే లక్ష్యంగా, ప్రథమస్థానమే ధ్యేయంగా క్రీడాకారులు రాణించాలని సూచించారు. ఏపీకి అత్యధిక పతకాలు సాధించి దేశ వ్యాప్తంగా రాష్ట్ర కీర్తిప్రతిష్టతలను ఇనుమడింప చేయాలన్నారు. క్రీడాకారుల భవితకు రాష్ట్రప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, దానికి అనుగుణంగా క్రీడల్లో ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టేందుకు కృషి చేయాలని శాప్ చైర్మన్ ఆకాంక్షించారు.

# గ్రూప్1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను ఎపిపిఎస్సీ విడుదల

**విజయవాడ,జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రూప్1 మెయిన్స్ పరీక్షల షెడ్యూల్‌ను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. ఈ ఏడాది మే 3 నుంచి 9వ తేదీ వరకు ఈ పరీక్షలు నిర్వహించనున్నట్లు మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఏపీపీఎస్సీ వెల్లడించింది. ఈ పరీక్షలు ఉదయం10.00 గంటల నుంచి మధ్యాహ్నం1.00 గంట వరకు జరుగుతాయని ఏపీపీఎస్సీ స్పష్టం చేసింది.

**గ్రూప్ 1 మెయిన్స్ నిర్వహించే తేదీలు**

మే 3వ తేదీ : తెలుగు
మే 4వ తేదీ : ఇంగ్లీష్
మే 5వ తేదీ: పేపర్ 1 జనరల్ ఎస్సే
మే 6వ తేదీ: పేపర్ 2 హిస్టరీ, కల్చరల్
మే 7వ తేదీ: పేపర్ 3 పాలిటీ, లా
మే 8వ తేదీ: ఎకానమీ
మే 9వ తేదీ: సైన్స్, టెక్నాలజీ పరీక్షలను నిర్వహిస్తారు. ఇందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ఏపీపీఎస్సీ సైట్‌లో తెలుసుకోవచ్చు.

# న్యాయసేవాధికార సంస్థ ఇసిగా జస్టిస్ తిల్హరీ



**విజయవాడ జనవరి 21 ప్రభాత వార్త ప్రతినిధి:** ఏపీ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ కార్య నిర్వాహక అధ్యక్షుడిగా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హరీ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు ఉత్తర్వులనిచ్చింది. హైకోర్టులో సీనియారిటీలో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని ఈసీగా నామినేట్ చేయడం సంప్రదాయంగా వస్తోంది. హైకోర్టుసీజేను సంప్రదించాక ఈసీని గవర్నర్ నామినేట్ చేస్తారు. ఇప్పటివరకు ఈసీగా బాధ్యతలు నిర్వహించిన జస్టిస్ నరేందర్ పదోన్నతిపై ఉత్తరాఖండ్ సీజేగా వెళ్లారు.

# వీరజవాన్ కార్తీక్ వీరమరణం

## సైనికులు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో రాష్ట్రానికి చెందిన జవాన్ మృతి

### - కార్తీక్ మృతి వార్త కలచివేసిందన్న సిఎం చంద్రబాబు

### - అతని ధైర్యసాహసాలకు శాల్యూట్ అన్న మాజీ సిఎం జగన్

**విజయవాడ.జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** జమ్మూకశ్మీర్ లో నిన్న సైనికులు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన కాల్పుల్లో చిత్తూరు జిల్లాకు చెందిన జవాన్ కార్తీక్ మృతి చెందిన ఘటనపై ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు,మాజీ సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డి తీవ్ర సంతాపం వ్యక్తం చేసారు. బంగారువాండ్లపల్లె మండలం ఎగువ రాగిమానుపెంటకు చెందిన కార్తీక్ ముష్కరులను ఎదుర్కొంటూ తీవ్రంగా గాయపడి వీరమరణం చెందారు. ఆయన మృతి పట్ల అందరూ ఆవేదన వ్యక్తం చేస. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ సీఎం జగన్‌లు "ఎక్స్" వేదిక వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు. కార్తీక్ మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని చంద్రబాబు అన్నారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కార్తీక్ కు సంతాపం ప్రకటిస్తూ... ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని చెప్పారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జగన్ స్పందిస్తూ... కార్తీక్ చూపించిన ధైర్యసాహసాలకు, త్యాగానికి శాల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఈ కష్ట సమయంలో కార్తీక్ కుటుంబానికి అండగా నిలుద్దామని చెప్పారు. కార్తీక్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# 'పట్టు విడిచి' 'జట్టు'లో కలసి..

## - పట్టు శాఖ నుండి మావోయిజం వైపు చలపతి అడుగులు

## - ఎన్‌కౌంటర్‌లో కేంద్రకమిటి సభ్యుడు చలపతి మృతి

**తవణంపల్లె, జనవరి 21 ప్రభాతవార్త:** చత్తీస్‌ఘడ్‌లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కేంద్రకమిటి సభ్యుడు రామచంద్రారెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ యామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అలియాస్ సుధ, అలియాస్ చలపతి(62) మృతి చెందడంతో చిత్తూరు జిల్లా తవణంపల్లె మండలంలోని మత్యం పైపల్లె గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన చలపతి స్వగ్రామం మత్యం పైపల్లె గ్రామం కావడం గమనార్హం. ఇతని నేపథ్యం గురించి వివరాల్లోకి వెళితే... మత్యం పైపల్లె గ్రామానికి చెందిన సామాన్య రైతు కుటుంబానికి చెందిన రామచంద్రారెడ్డి లక్ష్మమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు. ఇందులో శివలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలు మొదటి, ద్వితీయ సంతానం కాగా చలపతిరెడ్డి మూడవ సంతానం. ఇతను 10వ తరగతి వరకు బంగారుపాళ్యంలో తాతగారి ఇంట్లోనే వుంటూ అక్కడి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం కొనసాగించారు. అనంతరం చిత్తూరులో ఇంటర్మీడియేట్‌లో సిరికల్చర్ ఒకేషనల్ కోర్సు చదివారు. అనంతరం అక్కడే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సిరికల్చర్ టెక్నాలజి పూర్తి చేసి విజయనగరం జిల్లాలో ఉద్యోగంలో చేరినట్లు గ్రామస్థుల ద్వారా తెలిసింది. ఉద్యోగంలో చేరిన తొలినాళ్ళలేనే మావోయిజం పైపు మొగ్గు చూపుతూ నక్సలైట్లతో పరిచయాలు పెంచుకున్నారు. దీనితో సిరికల్చర్ ఉద్యోగంను వదిలి నక్సల్ బరి వైపు మొగ్గు చూపుతూ పూర్తిస్థాయిలో మావోయిస్టు పార్టీలో చేరిపోయారు. అనంతరం దశల వారిగా కేంద్ర కమిటి సభ్యుడు స్థాయికి ఎదిగారు. దండకారణ్యం కేంద్రంగా ఈయన మావోయిస్టు కార్యకలాపాలను సాగించినట్లు తెలుస్తోంది. నక్సలైట్‌గా మారినప్పటి నుండి ఒక్కసారి కూడా స్వగ్రామానికి రాలేదని గ్రామస్థులు, బంధువులు తెలిపారు. ఇదిలా వుండగా 2003 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుపై అలిపిరి వద్ద జరిగిన బాంబ్ దాడి ఘటనలో చలపతి కీలక భూమిక పోషించారు. దీనితో అతనిపై ప్రభుత్వం కోటి రూపాయలు రివార్డు ప్రకటించింది. చలపతి గత కొన్నేళ్ళ క్రితం చత్తీస్‌ఘడ్ వద్ద జరిగిన పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారన్న వార్తలు వచ్చినప్పటికి అది వాస్తవం కాదని పోలీసులు తేల్చారు. ఈనేపథ్యంలో చత్తీస్‌ఘడ్-ఒరిస్సా సరిహద్దులో ప్రత్యేక పోలీసులు చేపట్టిన చర్చ్ ఆఫరేషన్‌లో పోలీసుల కాల్పుల్లో 20 మంది వరకు మావోయిస్టులు మృతి చెందినట్లు సమాచారం. ఇందులో మావోయిస్టు కేంద్ర కమిటి సభ్యుడు మత్యం పైపల్లెకు చెందిన చలపతిరెడ్డి మృతి చెందినట్లు పోలీసులు ప్రకటించడంతో మత్యం పైపల్లెతో పాటు తవణంపల్లె మండలం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఈనేపథ్యంలో చలపతికి చెందిన వివరాలు సేకరించడానికి మీడియా, పోలీసులు పైపల్లె గ్రామానికి పరుగులు పెట్టారు. అయితే చలపతికి చెందిన వివరాలు ఈతరం వారికి అంతగా తెలియకపోవడంతో చలపతి సమాకాలికులు మాత్రం ఆయన గురించి సమాచారం అందించారు. ప్రస్తుతం మృతుడు చలపతి పెద్దఅన్న శివలింగారెడ్డి మృతి చెందడంతో ఆయన కుమారుడు ఉదయ్‌కుమార్‌రెడ్డి కుటుంబం మాత్రం గ్రామంలో నివసిస్తోంది. రెండవ సోదరుడు చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం మదనపల్లెలోనే స్థిరపడ్డారు. ఘటన గురించి మండలం తీవ్రస్థాయితో చర్చించుకోవడం గమనార్హం.

# విద్యుత్ ఉద్యోగుల సమస్యలు మా సమస్యలుగా భావిస్తా

## - ఎపి ఎలక్ట్రిసిటీ బోర్డు వ్యాపార సంస్థ కాదు సర్వీస్ సంస్థ

### - విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ,.జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** ఉద్యోగులకు పీఆర్సీ వివిధ దశల్లో ఉందని దానిపై త్వరలోనే ముఖ్యమంత్రి సమక్షంలో ఒక మంచి నిర్ణయం తీసుకుంటామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంగళవారం వెన్యూ కన్వెన్షన్ హాల్లో విద్యుత్ ఉద్యోగులు (ఏపీఎస్ఈబీ) ఏర్పాటు చేసిన డైరీ 2025, క్యాలెండర్ ప్రారంభ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొన్నారు. ఏపీఎస్ఈబీ ఉద్యోగులు డైరీ 2025ని మంత్రి ఆవిష్కరించారు. క్యాలెండర్ ను ఏపీ జెన్ కో ఎండీ కేవీఎన్ చక్రధర్ బాబు ఆవిష్కరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ విద్యుత్ ఇంజనీర్లు సంస్థ మనుగడ కోసం రాత్రింభవళ్లు పనిచేస్తారని కొనియాడారు. ఇతర రాష్ట్రాల్లోని విద్యుత్ సంస్థలతో పోల్చుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు వ్యాపార సంస్థ కాదు సర్వీస్ సంస్థ అని అన్నారు. జిల్లాల్లో ఏఈలు, లైన్లమెన్ల సిబ్బంది కొరత ఉందని దాన్ని అధిగమించేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అయినా విద్యుత్ సిబ్బంది తమ ప్రాణాలను పణంగా పెట్టి సంస్థ కోసం పనిచేస్తున్నారన్నారు. వేరే రాష్ట్రాల విద్యుత్ బోర్డుల కన్నా మన రాష్ట్ర విద్యుత్ బోర్డు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తుందని, ఉద్యోగులు కూడా రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తున్నారన్నారు. విద్యుత్ సిబ్బంది 24 గంటలూ పనిచేసి రాష్ట్రానికి నాణ్యమైన విద్యుత్ ను ప్రజలకు అందిస్తున్నారన్నారు. రాత్రనక, పగలనక పనిచేస్తున్నారని, విజయవాడ వరదల్లో నేను వారి పనితనాన్ని ప్రత్యక్షంగా చూసానన్నారు. విజయవాడ వరదల్లో బాధితులకు అండగా ఉంటూనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు రూ. 10 కోట్ల ను ముందుగా విద్యుత్ ఉద్యోగులు విరాళంగా అందించారన్నారు. వివిధ శాఖల సిబ్బంది దాన్ని స్ఫూర్తిగా తీసుకుని వరద బాధితులకు విరాళాలు అందించారన్నారు. ప్రతి ఏడాది పవర్ సెక్టార్ లో 67 శాతం పెరుగుదల కనిపిస్తుందన్నారు. ఇటీవల రెన్యూవబుల్ ఎనర్జీ కి ఎక్కువ అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో రెన్యువబుల్ ఎనర్జీకి పెట్టుబడులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను చూసి వస్తున్నాయన్నారు. రాష్ట్రంలో 30 గిగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి తీసుకురావడానిక ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మన సంస్థ నుంచి కూడా 7 నుంచి 8 గిగా వాట్ల ఉత్పత్తి చేసేలా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యుత్ ఉద్యోగుల తెలియజేసిన సమస్యలను పరిశీలిస్తామన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేయాలని అంతేకాకుండా ప్రజలకు ఇంకా మెరుగైన విద్యుత్ సర్వీస్ లను అందించేందుకు మరింత కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.




- ఎంపిఎస్ఇబి ఉద్యోగుల డైరీని మంత్రి ఆవిష్కరించిన మంత్రి


# కల్లు, గీత కులవృత్తులకు 10 శాతం దుకాణాలు ప్రభుత్వం ఉత్తర్వులు

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని కల్లు, గీత కులవృత్తులకు 10 శాతం మద్యం దుకాణాలు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ మేరకు ఆబ్కారీ శాఖ జిల్లాలవారీగా 335 మద్యం దుకాణాలు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇందులో శెట్టిబలిజ, శ్రీశయన, ఈడిగ, గౌడ, యాత, గౌడ్, శెగిడి, గౌండ్ల, గామల్ల కులాల వారు ఉన్నారు. వీరితో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉండే సొండి కులస్థులకు 4 దుకాణాలను కేటాయిస్తారు. అదేవిధంగా ఏ జిల్లాలో ఏ ఉప కులానికి ఎన్ని షాపులు కేటాయించాలో కూడా నిర్ణయించారు. అందులో ముఖ్యాంశాలు ఇవే. మరోవైపు త్వరలోనే ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్ గీత కార్మిక కులాలకు రిజర్వ్ చేసిన మద్యం దుకాణాలకు ఆర్ఈటీ రూపంలో వసూలు చేసే లైసెన్స్ రుసుము అన్ రిజర్వ్‌డ్ దుకాణాల లైసెన్సు ఫీజులో సగం మాత్రమే ఉంటుంది. అన్ రిజర్వ్‌డ్ కేటగిరీలో ఉన్న దుకాణాలకు ఆయా ప్రాంతాల జనాభాను బట్టి రూ.50 లక్షల నుంచి రూ.85 లక్షల వరకూ లైసెన్సు రుసుము వసూలు చేస్తున్నారు. కానీ గీత కార్మికుల కోసం కేటాయించిన దుకాణాలకు మాత్రం అందులో సగం రూ.25 లక్షల నుంచి రూ.42.50 లక్షలు మాత్రమే ఉండనుంది.

# నేర రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్

## - మీడియా సమావేశంలో డిజిపి ద్వారకా తిరుమలరావు

**సత్యసాయి జిల్లా, జనవరి 21, ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాన్ని గంజాయి రహిత ఆంధ్ర ప్రదేశ్ గా మార్చడానికి శాయశక్తుల కృషి చేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) ద్వారకా తిరుమలరావు పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో డిజిపి మీడియాతో మాట్లాడారు. ఇటీవల జిల్లా పోలీసు అధికారులు విడుదల చేసిన శాంతిభద్రతలు.. నేర నివేదిక 2024 ప్రకారం జిల్లాలో అన్ని రకాల నేరాలు దాదాపు తగ్గాయన్నారు. ముఖ్యంగా సైబర్ నేరగాళ్ళ ఆట కట్టించడంతో పాటు ఆర్థిక నేరాల నియంత్రణలో జిల్లా పోలీసు అధికారుల కృషి ప్రశంసనీయమన్నారు. రోడ్డు ప్రమాదాల సంఖ్య కూడా చాలావరకు తగ్గిందన్నారు. సైబర్ నేరాలపై రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామన్నారు. ఫలితంగా బాధితులు సైబర్ నేరాలపై ఫిర్యాదు చేయడానికి ముందుకు వస్తుండడం అభినందనీయమన్నారు. ప్రతిరోజూ కోట్లాది రూపాయలు సైబర్ నేరగాళ్ల పాలు అవుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఆన్లైన్ బ్యాంకింగ్ కార్యకలాపాలు విస్తృతంగా పెరిగిన నేపథ్యంలో సైబర్ నేరాల సంఖ్య కూడా పెరుగుతుందన్నారు. ప్రధానంగా పాస్ పోర్టు, ఆధార్ నంబర్లు వంటి వాటి విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. ఓటిపి చెప్పమని ఫోన్ వస్తే.. అసలు స్పందించవద్దని డీజీపీ తెలిపారు. సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించేందుకు ప్రత్యేక వీడియోలు, ఆడియోల రూపంలోనూ, విద్యాసంస్థల్లో, ప్రత్యేక సదస్సులు, ర్యాలీల ద్వారా అవగాహన పెంపొందిస్తున్నామన్నారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు మానవ తప్పిదాల వల్ల, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ వాడకపోవడం వల్ల, రాంగ్ డైరెక్షన్, అధిక వేగం తదితర కారణాలవల్ల ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదకరమన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.



# మైనారిటీల ఈద్‌గాహ్ అభివృద్ధికి చర్యలు

## రంజాన్ కల్లా పనులు పూర్తి కావాలి - రూ.50లక్షలు మొదటి విడత నిధులకు సుముఖత

### ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి

**శ్రీకాళహస్తి,జనవరి 21 ప్రభాతవార్త** ఎన్నికల ముందు ప్రచారంలో తెలుగుదేశం అభ్యర్థిగా పోటీ చేయాలనుకుంటున్న జామియా మస్‌జిద్‌కు సంబంధించిన ఈద్‌గాహ్‌లో బక్రీద్ పండగ సందర్భంగా శుభాకాంక్షలు చెబుతూ ఈ ప్రాంతాన్ని స్వర్గ తుల్యం చేస్తామని(జన్నత్ బనాదూంగా) అంటూ భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆయన మంగళవారం విద్యాప్రకాశానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా ఈదుల గుంటలో ఉన్న ఈద్‌గాహ్ అభివృద్ధికి సంబంధించి క్షేత్ర స్థాయిలో అధికారులు తెలుగుదేశం నాయకులు, మత పెద్దలతో కలసి పర్యటించి ఏం అభివృద్ధి చేయాలనే అంశంపై పరిశీలించారు. ఇక్కడ రంజాన్, బక్రీద్ పండగలకు నమాజులు ఆచరించటానికి ఎండలు, వానలుతో ఇబ్బంది పడుతున్నారు. కాబట్టి ప్రశాంత వాతావరణంలో నమాజులు ఆచరించటానికి అనుకూల వాతావరణం కల్పించుటకు చేపట్టాల్సిన అభివృద్ధిని గురించి సమీక్షించారు. అయితే ఈద్‌గాహ్ పరిసరాలు ముళ్ళ పొదలు, పిచ్చిమొక్కలతో నిండి ఉందన్నారు. అంతేకాక ఈ ఆవరణలోనే షాదీమహల్ ఉంది. ఇక్కడ పరిశీలించిన ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి మత పెద్దలతో సమీక్షించారు. ప్రహరీ గోడ నిర్మించండి: షాదీమహల్ బాగు చేయండి: ఎంఎల్‌ఏ క్షేత్రస్థాయిలో పరిశీలనకు రాగా మసీదు కమిటి సభ్యులు ముతవల్లి అక్రం సాహెబ్, అంజద్, మసీదు మత గురువు రేహాన్ సాహెబ్‌లు అభ్యర్థిస్తూ ప్రహరీ గోడను నిర్మించి ఆక్రమణలకు గురి కాకుండా కాపాడాలన్నారు. అంతేకాక నమాజులు ఆచరించటానికి అనుకూల వాతావరణం చుట్టు ఆహ్లాదకరంగా పచ్చని చెట్లను పెంచాలని అందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అంతేకాక ఇక్కడ షాదీమహల్‌ను మీ తండ్రి గోపాలకృష్ణారెడ్డి శాసనసభ్యుడుగా ఉన్నపుడు నిర్మించారని కానీ ఇక్కడ కనీస సదుపాయాల్లేదని, మౌళిక సదుపాయాలతో పాటు ఆధునిక కాలంలో అన్ని సౌకర్యాలు కల్పించాలని షాదీమహల్‌కు వంటశాల లేదన్నారు. మత పెద్దల అభ్యర్థనను విన్న శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మొదటి విడతలో కొన్ని పనులు చేపట్టుటకు రూ.50లక్షలుకేటాయించగలమన్నారు. అంతేకాక ఈద్‌గాహ్ మొత్తం ఎంత స్థలంలో ఉందో సర్వే చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. అలాగే ప్రహరి గోడ వరకు పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. మున్సిపల్ అదికారులు తమ వద్ద ఉన్న జెసిబిలతో పరిశుభ్రం చేయాలన్నారు.

మొదటి విడతలో ఈద్‌గాహన్‌లో ఆహ్లాదకరవాతావరణంతో పాటు గోడను బాగు చేయగలమన్నారు. రెండవ దశలో షాదీమహల్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ముస్లింలకు అవసరమైన సదుపాయాలతో షాదీమహల్‌ను నిర్మిస్తామని భరోసా ఇచ్చారు.

వార్త

కొంతమందిని అదృష్టం వరిస్తుంది. చిత్రమేమిటంటే వారెప్పుడూ అదృష్టంపై ఆధారపడేవారు కాదు.

-ఫ్రాంక్లిన్

# శిక్ష సహేతుకమేనా?

దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన అత్యాచారం, హత్యకేసులో శిక్షలు విధిస్తూ తీర్పు వెలువడింది. నిందితుడిని దోషిగా ప్రకటించిజీవిత ఖైదు శిక్ష వేస్తూ న్యాయమూర్తి తీర్పుచెప్పారు. కానీ దానికి సంబంధించిన 172పేజీల తీర్పులోన్యాయమూర్తి వ్యక్తంచేసినఅభిప్రాయాలు ఇప్పుడు చర్చనీయాంశంగా ఉన్నాయి. న్యాయమూర్తిగా ఉన్నవారికి నిందితుడుదోషా? కాదా!! అన్న సంశయాలు తలెత్తగానే తన ముందున్న సాక్ష్యాధారాలు వాస్తవలోకంలోకి తీసుకుపోతాయి. సాక్ష్యాధారాలను బట్టి నేర నిర్ధారణ జరిగిపోయింది. దోషికి జీవితకాలం జైల్లో ఉండే విధంగా సియల్దలోని అదనపు జిల్లా జడ్జి తీర్పు ప్రకటించారు. అతనికి మరణశిక్షకాకుండా జీవిత ఖైదు ప్రకటించడం, మరణశిక్ష విధించడానికిన్యాయ సూత్రాలు అనుమతించడం లేదన్న వివరణ సభ్య సమాజం రుచించడం లేదు. అతను అత్యాచారం, హత్యలో దోషి అని నిర్ద్వంద్వంగా ప్రకటిస్తూనే మరణశిక్ష విధింపునకు అవసరమైన లక్షణాలులేవని ప్రకటించడం సామాన్య ప్రజానీకానికి అంతుబట్టడం లేదు. ముద్దాయికి మానవ సమాజంలో జీవిచే హక్కు లేదనే విషయాన్ని స్పష్టం చేస్తూ జీవితాంతం శిక్షజైలులో గడిపే విధించిన న్యాయ స్థానం ప్రస్తుతం తమముందున్న కేసు అత్యంత అరుదైనది కాదని సరిపుచ్చుకున్నారు. కోల్‌కత్తాలో ఈ ఉదంతం జరిగినప్పుడే నిందితుడిని పట్టుకుని ఉరితీయాలని, విద్యార్థులు, డాక్టర్లు తదితర సభ్య సమాజం గొంతెత్తి అరిచింది. బాధ్యులైన వారికి శిక్షలువేయాలన్న డిమాండ్‌తో నిరసనలు, ధర్నాలు చేసారు. చెప్పాలంటే మహిళా లోకం ఆక్రందించింది. తీరా ఆ వ్యక్తిదోషిగా తేలాక అందరూ కోరినట్లుగా, భావించినట్లుగా ఉరిశిక్షవేస్తే బాగుంటుందనుకున్నారు. కానీ న్యాయవ్యవస్థలో కీలకంగాఉండేవారు సామాజిక స్థితిగతులు కాలమాన పరిస్థితులు కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంటుందనే విషయంలో మరి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే బాగుండేది. దేశవ్యాప్తంగా ఎంతో సంచలనం సృష్టించిన ఈ కేసును కేవలం సాధారణ తీర్పుతో నీరుగార్చారని, నేర తీవ్రతను బట్టి కాక, న్యాయ నిబంధనలకు సరిపోవంటూ దోషికి మరణించే వరకూ జీవించే అవకాశం కల్పించడమే విస్మయపరిచింది. తీర్పులో క్షణికావేశంలో నేరంచేశాడని, బాధితురాలిపై అతనికి వ్యక్తిగత ద్వేషాలేమీ లేదని, నిందితుడికి నేర చరిత్ర లేదని తేల్చిపారేసారు. హత్యలు క్షణికావేశంలో జరగచ్చు. కానీ ఒంటరి మహిళపై అత్యచారానికి తెగబడడం కామోద్రేకమే. అదీగాక స్త్రీ నిర్భలత్వాన్ని ఆసరాగా చేసుకునే చులకన భావమే తప్పఏవిధంగానూ క్షణికావేశంగా అభివర్ణించలేం. ఆడవాళ్ల మీద జరిగే ఏ రకమైన అత్యాచారమైనా అదివారి బలహీనతను ఆసరాగా తీసుకునేదని ప్రతి ఒక్కరికీ తెలిసిందే. భాష్యాలు ఎన్నైనా, ఎన్ని రకాలుగానైనా చెప్పచ్చు. వారు నమ్మిన మేరకేశిక్షను విధించే వెసులుబాటు ఉండచ్చు. కాదనలేం. అందుకే కింది కోర్టు ఇచ్చేతీర్పును పై కోర్టు, అది ఇచ్చే తీర్పును ఆపై కోర్టు మార్చచ్చు. కొత్త కొత్త భావనలకు, భాష్యాలు వ్యక్తం చేయచ్చు. కానీ ప్రస్తుత తీర్పులో సమాజానికి ఎలాంటి సంకేతం ఇస్తున్నారో కూడా ఆలోచించాలి. క్షణికావేశంలో చేసిన హత్యాచారమని, ఇదేమీ అరుదైనది కాదనడంఅంటే సమాజంలో ఇలాంటివి సర్వసాధారణమైనవేనన్న అభిప్రాయం స్ఫురిస్తోంది. అత్యాచారమంటే అదొక మానసిక క్రూరత్వం. ఇక్కడ సందేహాలబ్ధికి ఆస్కారమే లేదు. సమాజ క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నేరాల విజృంభణకు, ఆస్కారమేలేని విధంగా శిక్షలు హెచ్చరికగా ఉంచాల్సిన బాధ్యత న్యాయ పాలికలపై ఉంది. గతంలో నేర చరిత్ర లేదంటే ప్రథమ తప్పు అనుకోవాలా? ప్రథమ తప్పుకు చట్టంలో ఏదైనా వెసులుబాటు ఉంటుందా? వేటికీ పొంతన లేకపోవడం విస్మయమే! మహిళా సమాజం ఏమనుకుంటుందో అర్థం చేసుకోలేని నేరస్తుడు నేరానికి పాల్పడినా, సభ్య సమాజం ఏమనుకుంటుందని ఆలోచించకుండా ఇచ్చే శిక్షలుసమాజ సంస్కరణలకు పనికి రావని తెలినా ఆమోదించాల్సిందే. పవిత్ర భారతదేశంలో స్త్రీని నిస్సహాయంగా చూసే దృష్టి నుంచి మృగాళ్ల దృష్టిని మరల్చాలంటే కఠినశిక్షలనే సభ్య సమాజం కోరుకుంటుంది. పని ప్రదేశాల్లో తమకు భద్రత కొరవడిందని బాధపడే మహిళా లోకానికి పని ప్రదేశాల్లో కమిటీలు వేసిచేతులు దులుపుకోవడం కాదు. ఊరట కలి గించాలి కూడా! ఈ కేసు విషయంలో ఆదినుంచి దర్యాప్తు లు ప్రభుత్వాల చేతులు మారిపోయి విశృంఖల రాజకీయ వాతావరణాన్ని సృష్టించాయి. నేరంజరగడమనేది సామాజిక అంశమైనా ఎందుకనో వేర్వేరుపార్టీలు పాలనాపరంగా జోక్యం చేసుకోవడంతో వివాదాస్పద పరిస్థితులు తలెత్తాయి. అవన్నీ అనివార్యంగా చోటు చేసుకున్నవే. ఆ రాష్ట్రంలోనే గత యేడాది 'పోక్సో' కేసుల్లో మరణశిక్ష పడిన దాఖలాలుండగా ప్రస్తుత కేసును అంత తీవ్రంగా ఎందుకు పరిగణించలేకపోయారనే మీమాంసపై చర్చ నడుస్తోంది. ఈతీర్పు పట్ల పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తీర్పుపై అప్పీల్‌కు సన్నహాలు చేస్తున్నారు. కానీ ఈ కేసులో నిందితుడు దోషియని స్పష్టంగా తేలాక ఈ పాటి కనికరం సబబుగానూ, సహేతుకంగానూ లేదేమో! బాధితు రాలి మరణానికి 10 లక్షలు, అత్యాచారానికి ఏడు లక్షలు లెక్కగట్టి బాధితురాలి తల్లి తండ్రులకు పరిహారం చెల్లిం చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ కోర్టు తీర్పులో ఉండగా, బాధితురాలి కుటుంబం నిరాకరించింది. ఇలాంటి వారు కోరుకున్నది దోషికి మరణశిక్ష తప్ప జీవితాంతపు కారాగారవాసం కాదు. అందుకే కోర్టు తీర్పుపై వారిలో తీవ్ర అసంతృప్తి ఉండడం మాత్రం సహేతుకమే.



ఇతరుల నుంచి నీవు ఏమి ఆశిస్తావో దానినే ఇతరులకు చేయడం నిజమైన మానవ ధర్మం.

సోక్రటీస్



ఏదైనా మంచి సాధించాలనుకున్నప్పుడు శ్రమించే భావం, విమర్శలను భరించే సహనం ఉండాలి.

షేక్ స్పియర్

# చేనేత శంఖారావంవైపు అడుగులు

**రాజకీయాలకు అతీతంగా కలిసి పని చేయాలని తీర్మానించారు. రాష్ట్రంలోని చేనేత కులాలతో పాటు, చేనేత సంఘాలనుకూడా కలుపుకు పోవాలని నిర్ణ యించారు. రాష్ట్రంలో 45 శాసనసభ నియోజకవర్గాల్లో గెలుపుపై ప్రభావం చూపగల స్థాయిలో చేనేత కులాలు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. అంటే, అంతమంది ఎమ్మెల్యేలను నిర్ణయించగల స్థితిలో వారుఉన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమేకాకుండా, నిరంతరం చేనేత వర్గాలు రాజకీయంగా ఎదగడానికి కృషిచేయాలని భావిస్తున్నారు. చేనేతకులాలలో ఐక్యత, బలప్రదర్శన కోసం రాష్ట్రస్థాయిలో భారీఎత్తున 'చేనేత శంఖారావం సభ' నిర్వహించాలని నిర్ణయించారు.**

శిరందాసు నాగార్జున

చేనేత వర్గానికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉన్నప్పటికీ, రాజకీయంగా తగిన ప్రాధాన్యత లేదు. రాష్ట్రంలో వ్యవసాయం తరువాత అత్యధిక మంది చేనేత, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రాజకీయంగా బలపడటం కోసం, శాసనసభా స్థానాల్లో తమ వాటాకోసం రాష్ట్రంలోని చేనేత కులాలు ఏకమవుతున్నాయి. దేశంలో తరతరాలుగా చేనేత వృత్తిపైనే జీవించే కులాలు అనేకం ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి పద్మశాలి, దేవాంగ, జాంద్ర, పట్టుసాలి, తొగట వీరక్షత్రియ, స్వకులశాలి, కుర్నిసెట్టి (కుర్ణి)(నెస్సి), సేనాపతులు, కైకాల, కర్ణ భక్తులు, కరికాల భక్తులు, సాధనాసూరులు, బావసార క్షత్రియ, ఖత్రి, నీలి, నీలకంఠి, కోస్టి, ముదలియార్‌మొత్తం 18 చేనేత కులాలు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయి. ఇవి అత్యంత వెనుకబడిన కులాల(ఎంబీసీ) జాబితాలో ఉన్నాయి. జాతీయ స్థాయిలో చేనేత పరిశ్రమ ప్రాధాన్యతను గుర్తించి ప్రతి ఏడాది ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం (నేషనల్ హ్యాండ్‌లూమ్‌డే) నిర్వహించాలని 2015లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇంతటి ప్రాశస్త్యం కలిగిన ఈ రంగానికి చెందిన కులాల నుంచి రాష్ట్ర శాసనసభలో ఒక్కరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత శాసనసభలో ఆ ఒక్కరు కూడా లేరు. చేనేత కులాల మధ్య ఐక్యత లేకపోవడం, నాయకత్వం లోపమే దీనికి ప్రధాన కారణం. ఇతర కులాలు, రంగాల నుంచి శాసనసభ్యులుగా ఎన్నికవుతున్నారు. మంత్రులు అవుతున్నారు. ఆయా రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అయితే, చేనేత రంగం విషయానికి వచ్చేసరికి రాష్ట్ర జనాభాలో దాదాపు 13శాతం మంది ఉన్నా, రాజకీయ పార్టీలు వారికి ప్రాధాన్యత ఇవ్వడంలేదు. రాష్ట్రంలోని 175 మంది శాసనసభ్యుల్లో చేనేత కులాల నుంచి ఒక్కరంటే ఒక్కరే ఉన్నారు. ఈ రంగానికి చెందిన వారికి మంత్రి పదవి కూడా ఇవ్వలేదు. ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 1,77,447 మంది చేనేత కార్మికులు ఉన్నారు. ప్రస్తుతం మూడు లక్షల మంది ప్రత్యక్షంగా, 8లక్షల మంది పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. దీర్ఘకాలంగా చేనేత కులాలకు చెందిన వారికి మంత్రిపదవి ఇవ్వకపోవడం వల్ల వారి సమస్యలను ఇతర కులాలు, వృత్తులకు చెందిన మంత్రులకు చెప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వారికి ఈ రంగం పట్ల తగినంత అవగాహన లేకపోవడం వల్ల వీరి సమస్యల పరిష్కారంపట్ల వారు ఆసక్తి చూపించే అవకాశాలు తక్కువ. చేనేత వృత్తికి సంబంధించిన నూలు, సిల్క్, రంగులు, రసాయనాలు ముడిసరుకులు వంటి వాటి ధరలు, చేనేత ఉత్పత్తులు, అమ్మకాలు, ఎగుమతులు, పన్నులు సబ్సిడీలు, ఇతర సౌకర్యాలు వంటి సమస్యలు సమగ్రంగా తెలుసుకోవడానికి వారికి సమయం ఉండదు. ఈ కారణంగా కూడా చేనేత సమస్యలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. ఆ సమస్యల పరిష్కారం దిశగా కూడా అడుగులు పడటం లేదు. అవగాహనా లోపం వల్ల నిజమైన చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు అందడంలేదు. చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24వేలు ఇచ్చే పథకం ఇంట్లో చేనేత మగ్గం ఉన్నవారికే వర్తిస్తుంది. మగ్గం పట్టే ఇల్లు అద్దెకు తీసుకునే స్తోమతలేని కార్మికులు బయట షెడ్లలో నేత



నేస్తారు. జీవితాంతం షెడ్లలోనే నేతనేసే కార్మికులు వేలల్లో ఉన్నారు. వాస్తవానికి ఈ పథకం వారికి వర్తించాలి. ప్రభుత్వానికి, మంత్రులకు, అధికారులకు చేనేత కార్మికునిబతుకు చిత్రం తెలియకపోవడం ఇలా జరుగుతోంది. రాష్ట్రంలోని చేనేత కార్మికుల స్థితిగతులను, వృత్తిపరంగా వారు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వానికి అర్థమయ్యేరీతిలో వివరించవలసి ఉంది. అందుకు చేనేత వర్గాలనుంచి, చేనేతరంగంపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తులు నేతలుగా ఎదగవలసి ఉంది. గతంలో మాచాని సోమప్ప, ప్రగడ కోటయ్య, పుచ్చల సత్యనారాయణ, కుండా రామయ్య, అగిశం వీరప్ప, దామర్ల రమాకాంతరావు, గోలి వీరాంజనేయులు వంటివారు మరణించిన తరువాత ఈ రంగం నుంచి రాజకీయంగా నాయకత్వ లోపం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. వారు చేనేత కార్మికుల మధ్యే తిరిగేవారు. వారికి చేనేత సమస్యలపై పూర్తి అవగాహన ఉండేది. అందువల్ల వారి హయాంలో ఈ రంగానికి ఎంతో మేలు జరిగింది. ఆ తరువాత ఈ కులాల వారు రాజకీయంగా బలహీనమవడం వల్ల చేనేత రంగానికి తీవ్ర నష్టం జరుగుతూ వస్తోంది. ఈ కులాల వారికి, కార్మికులకు న్యాయం జరగడంలేదు. చేనేత వర్గాల వారు దాదాపు 65లక్షల మంది, అంటే రాష్ట్ర జనాభాలో 12 శాతం మంది ఉన్నా ఒక్క మంత్రి పదవి కూడా లేదు. చేనేత మంత్రిత్వశాఖ ఈ వృత్తి గురించి తెలియని, మరో కులం వారు నిర్వహించడం వల్ల వారికి చేనేత సమస్యలపై అవగాహన ఉండదు. నేరుగా చేనేత రంగంతో సంబంధం ఉన్న, చేనేత వృత్తి, ఆ రంగంలోని సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నవారు శాసనసభలో, మంత్రి మండలిలో ఉండవలసిన అవసరం ఉంది. ఆ దిశగా, రాజకీయ లక్ష్యంతో ఉద్యమించాలని చేనేత కులాల వారు నిర్ణయించుకున్నారు. అందరూ ఐక్యంగా ఉండి శాసనసభ్యులను గెలిపించుకోకపోతే పరిస్థితి ఇంకా దిగజారుతుందని గ్రహించారు. ఈ నేపథ్యంలో చేనేత కుల సంఘాల పునరేకీకరణ అవసరాన్ని గుర్తించారు. గతంలో క్రియాశీలకంగా ఉన్న కొన్ని సంఘాలు వివిధ కారణాల వల్ల ప్రస్తుతం యాక్టివ్‌గా లేవు. అందువల్ల కూడా ఈ రంగానికి నష్టం జరిగింది. దాదాపు 8 ఏళ్ల క్రితం ఏర్పడిన ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళుతోంది. ఫెడరేషన్‌ని బలోపేతం చేయడంతోపాటు చేనేత వర్గాలు రాజకీయంగా ఎదగడానికి ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అన్ని చేనేత కులాలను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. చేనేత రంగానికి ప్రసిద్ధి చెందిన గుంటూరు జిల్లా మంగళగిరిలో ఇటీవల ఫెడరేషన్ ఈ18 కులాలలోని ముఖ్యులతో సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశంలో చేనేతవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నేతలు, ఆయా కులాల పెద్దలు పాల్గొన్నారు. అందరూ కలసికట్టుగా రాజకీయంగా తమకు రావలసిన వాటాను రాబట్టుకోవాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితే, ఇందుకు చేనేత కులాల ఐక్యతతోపాటు యువతను ప్రోత్సహించవలసిన అవసరం ఉందని, చాలా శ్రమించవలసి ఉందని గుర్తించారు. రాజకీయాలకు అతీతంగా కలిసి పని చేయాలని తీర్మానించారు. రాష్ట్రంలోని చేనేత కులాలతో పాటు, చేనేత సంఘాలనుకూడా కలుపుకు పోవాలని నిర్ణయించారు. రాష్ట్రంలో45 శాసనసభ నియోజకవర్గాల్లో గెలుపుపై ప్రభావం చూపగల స్థాయిలో చేనేత కులాలు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. అంటే, అంతమంది ఎమ్మెల్యేలను నిర్ణయించగల స్థితిలో వారుఉన్నారు. ఎన్నికల సమయంలో మాత్రమేకాకుండా, నిరంతరం చేనేత వర్గాలు రాజకీయంగా ఎదగడానికి కృషిచేయాలని భావిస్తున్నారు. చేనేతకులాలలో ఐక్యత, బలప్రదర్శన కోసం రాష్ట్రస్థాయిలో భారీఎత్తున 'చేనేత శంఖారావం సభ' నిర్వహించాలని నిర్ణయించారు. ●

# ట్రంప్ 2.0 అధిగమించాల్సిన సవాళ్లు!

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

డొనాల్డ్ ట్రంప్ ఈజ్ బ్యాక్ అగేన్. అమెరికా 47వ అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ రెండవ సారి శ్వేతసౌధంలోకి అడుగిడి పదవీ బాధ్యతలు స్వీకరించిన వేళ పలు సవాళ్లు ఆయన పాలనకు ప్రధాన అంశాలుగా నిలువనున్నాయి. అమెరికాకు అనుకూలంగా తమ అంతర్గత సమస్యలకు పరిష్కారాలను చూపుతూనే విదేశీ సవాళ్లకు పరిష్కారాలు చూపుతారని ప్రపంచ ప్రజలు టెంపరి ట్రంప్‌ను విశ్వసిస్తున్నారు. రిపబ్లికన్ అధ్యక్షుడిగా రెండు సార్లు గెలిచిన డొనాల్డ్ ట్రంప్ 2001-09 మధ్య డెమెక్రాటిక్ పార్టీలో, 2011-12 మధ్య స్వతంత్ర అభ్యర్థిగా రాజకీయాల్లో పని చేశారు. తొలి దశలో అధ్యక్షుడిగా పలు కుంభకోణాలు, పక్షపాత ధోరిణిలు, విచారణలు, అక్రమ లైంగిక సంబంధాలు లాంటివి ఎదుర్కొని అత్యంత వివాదస్పద అధ్యక్షుడిగా 'అన్‌ప్రెసిడెంటెడ్ (తనదైన కొత్తదనం)' అని పిలువబడ్డారు. 20 జనవరి 2025 రోజున అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన డొనాల్డ్ ట్రంప్ అమెరికా ఫస్ట్, అమెరికా ది గ్రేట్ అగైన్, ఇక స్వర్ణయుగమే, మూడవ ప్రపంచ యుద్ధం వద్దు, అక్రమ వలసలపై ఉక్కుపాదం, ఉగ్రవాద సంస్థల మెడపై కత్తులు అంటూ చేసిన ప్రసంగం రానున్న రోజుల్లో నిజం కావాలి. ట్రంప్ 2.0 పాలనకు గీటురాయిగా నిలువనున్న ప్రధాన అంశాలను ప్రస్తావించే ప్రయత్నం చేద్దాం. ట్రంప్ పదవీ బాధ్యతలు తీసుకోవడానికి కొన్ని గంటల ముందే ఇజ్రాయిల్, హమాస్‌ల మధ్య గత 15నెలలుగా జరుగుతున్న యుద్ధానికి సంబంధించిన కాల్పుల విరమణ, యుద్ధ ముగింపుకు అంగీకారం కుదరడం, తొలి దశ ఒప్పందం అమలులోకి రావడం జరుగుతున్నది. గత 1059 రోజులుగా జరుగుతున్న ఉక్రెయిన్‌పై రష్యా దండయాత్ర లక్షల మందిని పొట్టన పెట్టుకొని గాయాల పాలు చేయడం, కనీసం పది మిలియన్ల ఉక్రెనియన్లు నిరాశ్రయులుగా మారి ఆకలిచావుల అంచున ఉన్నారు. నేడు మాస్కో, కీవ్ నగరాల మధ్య చర్చలుప్రారంభమై, రెండు దేశాల మధ్య కనీసం సుహృద్భావ వాతా వరణంలో ఓ అంగీకారానికి రావడానికి ట్రంప్ చొరవ చూపాల్సి ఉంది. కాల్పులు/యుద్ధ విరమణ చర్చలను ఉక్రెయిన్ అంగీకరిస్తున్నప్పటికీ రష్యా మాత్రం ససేమిరా అంటున్నది. ఉక్రెయిన్‌కు బాసటగా నిలుస్తూనే రష్యాను ఒప్పించడం కొంత కష్టంగానే తోస్తున్నది. సమీప దేశాల నుంచిఅక్రమ వలసలను నిరోధించడానికి సరిహద్దు చుట్టు ఇనుప గోపురశైలిలో కంచెలు నిర్మిస్తామని ట్రంప్ ఇప్పటికే




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్

తెలియజేయడం విన్నాం. మెక్సికో, కెనడాల నుంచి అక్రమ వలసలను, మాదకద్రవ్యాల అక్రమరాకను కట్టడి చేయడానికి కఠినచర్యలు తీసుకోవడం, బహిష్కరణ వేటు వేయడం, అనధికార వలసదారులకు కల్లెంవేయడం, కఠిన శిక్షలువిధించడం, వీరిని ఆయా దేశాలకు తిరిగి అప్పగించడం జరుగుతుందనితెలిపారు. కెనడాను అమెరికాలో ఒకరాష్ట్రంగావిలీనం చేసుకుంటామని, ఆ దేశ ప్రధాని జస్టిన్ ట్రూడోను ఆ రాష్ట్ర గవర్నర్‌గా నియమిస్తామని ఎగతాళికూడా చేయడంచూసాం. విదేశాల అక్రమమానవ వలసలను కచ్చితంగా నివారించడానికి చర్యలు తీసుకోనున్నారు. మేడిన్ ఇన్ అమెరికా నినాదాన్ని కార్యరూపం దాల్చడానికి విదేశీ వస్తు వులపై, ముఖ్యంగా చైనా వస్తువుల వరదలపై 10 60 శాతంవరకు పన్నులు విధిస్తామని తెలియజేశారు. అమెరికా ఫస్ట్" అనే నినాదంతో స్వదేశీ వస్తువుల ఉత్పత్తి, వాణిజ్యానికి ఊపును తీసుకురావాలని చూస్తున్నారు. డొనాల్డ్ ట్రంప్ ఓటమి సమయంలో 06 జనవరి 2021 రోజున క్యాపిటల్ భవనంపై దాడి చేసిన దాదాపు 1,000 మంది ట్రంప్ అభిమానులు లేదా అనుచరులపై పెట్టిన కేసులను తొలగించి, వారిని దేశ భక్తులుగా విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ ఘటనలో తీవ్రనేరాలు చేసినవారికి మాత్రం శిక్షలు పడతాయని కూడా తెలిపారు. ప్రపంచమే అగ్నిగుండం అయిపోతున్నది. భూతాపం భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నది. పారిస్ ఒప్పందానికి లోబడి కార్బన్ ఉద్గారాల వాడకాన్ని తగ్గించి విద్యుత్తు వాహనాలకు పట్టంకట్టాల్సి ఉంది. అధిక కార్బన్ ఉద్గారాలకు కారణమైన అమెరికా లాంటి అభివృద్ధిచెందిన దేశాలు వాతావరణ ప్రతికూల మార్పులకు చెక్‌పెట్టడానికి నిర్దిష్ట ప్రణాళికలను అమలు చేయాల్సి ఉన్నది. అబార్షన్ సమస్యను పరిష్కరించేందుకు కృషిచేయడం, అమెరికా అభివృద్ధికి దోహదపడే రంగాలకు పన్నుల్లో రాయితీలులేదా తగ్గించడం, ఎల్‌జిబిటిక్యూ లేదా ట్రాన్స్ జెండర్ వర్గాలకు చట్టపరమైన రక్షణలు కల్పించడం, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం, విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేయడం, సామాజిక భద్రతకు పెద్దపీట వేయటం, ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యంఇవ్వడం, గృహనిర్మాణరంగానికి ఊపిరులూదడం, సెమీకండక్టర్ చిప్‌ల తయారీకి యూఎస్ చైనా తైవాన్‌ల సహకారం పెంచుకోవడం, ఏఐక్వాంటమ్ సైన్స్ రంగాలకుప్రాధాన్యం ఇవ్వడం, ఎగిరే కార్లను ప్రవేశపెట్టడం లాంటి ఎజెండాతో ట్రంప్ పాలన ప్రారంభం కానుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ●

# మరుగున పడుతున్న మాతృభాష?

సి.హెచ్. పద్మ

మనిషికి చావుపుట్టుకలు సహజం – ఇది కర్మ సిద్ధాంతం. అలాగే, భాషకూ చావుపుట్టుకలు ఉంటాయా? ఇది కచ్చితంగా ఖర్మ సిద్ధాంతమే. ఇది ప్రతి తెలుగు భాషాభిమానినీ వేధించే విషయం. ఒకవేళ భాషకు కాలం చెల్లిపోవటం నిజం అయితే, అది కొన్ని భాషలకేనా లేక అన్ని భాషలకూ ఈ గతి సంభవిస్తుందా? ఈ విషయంపై లోతైన చర్చ అవసరం. ఇక మన మాతృభాషను గురించి చాలా మంది భాషావేత్తలు ప్రస్తుత సామాజికాంశాలను, జరుగుతున్న పరిణామాలను ఎన్నో కోణాల నుండి పరిశీలించి, తెలుగుభాష కొంతకాలం తరువాత మృతభాషగా పరిణమించబోతుందని హెచ్చరిస్తున్నారు. అసలు భాష మరణించటం అంటే ఏమిటి అనే దానికి సమాధానంగా ఆ భాషను మాట్లాడేవారు కానీ, నేర్చుకొనేవారు కానీ లేకపోవటంగా మనం భావించవచ్చు. భాషా వినియోగ శూన్యతకు కారణాలు ఆ భాషను మాట్లాడే ప్రాంతంలోని సామాజిక అంశాలు ప్రపంచస్థాయి గుర్తింపును సంతరించుకోలేకపోవటం, భాషను సాధికారికంగా ఉపయోగించలేకపోవటం, మన భాషలో శాస్త్ర, సాంకేతిక విషయ బోధనలు లేకపోవటం వంటి ఎన్నో విషయాలను చెపుకోవచ్చు. తెలుగు అంతరించిపోతుందేమో అని మనం ఎంతో ఆందోళన చెందుతున్నాం. కానీ ఏది అసలైన తెలుగు అని మనం భావిస్తున్నాం? ప్రస్తుతం మనం మాట్లాడేదా? మన పూర్వుల వాడకంలో ఉన్న తెలుగా? ప్రస్తుతం వినియోగంలో ఉన్నదే తెలుగు అనుకొంటే, ఇప్పుడు భాషలో సహజత్వం, తెలుగుతనం తగ్గుముఖం పట్టాయని ఆందోళన చెందుతున్నాం. అసలు భాషాస్వరూపమే తన రూపురేఖలు మార్చుకొంటూపోతుందని భావిస్తున్నాం. తెలుగుభాషకు దూరం అయినవారిగా, తెలుగుతనం తెలియని తెలుగు వారిగా నిలిచిపోవలసివస్తుందేమో. ఇదంతా సహజమే అయితే, నన్నయ వంటి కవిశ్రేష్ఠుడు 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని చెప్పటం – ఇటువంటి ఎన్నో అంశాలను ఎంతో ముందుచూపుతో గ్రహించటం వలనేనా! జరుగుతున్న విషయాలను గమనిస్తే, మన భాషకు గ్రహపట్టినట్టుగా భావించటం ఎంతో సమంజసం. మన మాతృభాష మరుగునపడుతూ ఉందనీ, కొంతకాలానికి పూర్తిగా తొలిగిపోతుందనీ మథనపడుతున్న మనం భాష పునరుద్ధరణకు పూనుకోవటం తప్పనిసరి అని భావించాలి. కొన్ని దేశాలు, వాటి సొంతభాషలోనే చిన్న చదువులనుండి, ఉన్నత చదువుల వరకూ చదువుకొనే అవకాశం కలిగించటమే కాకుండా, ఆయాదేశాలలో చదువుకోసమో, ఉద్యోగాల



కోసమో వచ్చేవారికి అక్కడి భాష వచ్చితీరాలనే తీరుతో వ్యవహరించటం వలన ఇటువంటి దేశాలకు వెళ్ళాలనుకొనే వారు తప్పనిసరిగా ఆయా దేశభాషలను నేర్చుకోవలసి రావటం వల్ల, ఆ దేశాల భాషావ్యాప్తి విస్తృతంగా జరుగుతూ వస్తుంది. అలాగే, తెలుగు ప్రాంతంలో విద్యను అభ్యసించటం కోసంగానీ, ఉద్యోగ బాధ్యతలు నిర్వహించటానికి గానీ వచ్చే ఇతర ప్రాంతాలవారికీ, ఇతర దేశాలకూ తెలుగు భాష కచ్చితంగా వచ్చితీరాలని నియమం మనకు ఉన్నట్లయితే, మన తెలుగు ప్రాంతానికి పై కారణాల కోసం వచ్చే విదేశీయులు సైతం మన తెలుగుభాషను నేర్చుకొని తీరాల్సి వస్తుంది. ఇది అమలులోకి వస్తే, కచ్చితంగా మనభాష కూడా విస్తృత వ్యాప్తిని, ప్రపంచస్థాయిలో ఆధిక్యతనూ తెచ్చుకొంటుంది. ఆంగ్లభాష రాకుండా మనం విదేశాలకు వెళ్ళి చదువుకోవటం కానీ, ఉద్యోగం కానీ చేయలేం. ఆంగ్లం అంత తప్పనిసరి అయింది నేడు. మరి మన తెలుగు ప్రాంతంలో అవే కారణాలతో వచ్చేవారికి మాత్రం తెలుగు భాష రాకపోయినా, అవకాశాలు అనేకం. అంతదాకా ఎందుకు తెలుగు మాట్లాడటం, రాయటం కూడా రాని అచ్చమైన తెలుగు వీరులు కూడా పరాయిభాషల ఆసరాతో గౌరవాలను పొందుతూ ఉండటం అనేది మనం గమనిస్తున్న నిత్య దౌర్భాగ్యం. ఇటువంటి ఎన్నో అంశాలు మన తెలుగును మరుగున పడేస్తున్నామనడంలో సందేహంలేదు. కర్మ సిద్ధాంతవాదులమైన మనం తెలుగు ఇక్కడ మరణించినా ఇంకోచోట ఇంకో పేరుతో మనుగడలో ఉంటుందన్న భావంతో సర్దుకుపోతున్నామనటం అతిశయోక్తికాదు. తెలుగు ప్రాంతంలో తెలుగుభాష అంతరించిపోతే, ఏ భాష మనుగడలోఉంటుంది? పూర్వం తెలుగుభాషలో చాలా వరకు శబ్దజాలం సంస్కృత, ప్రాకృత భాషలోని పదజాలంతో విడదీయరానంతగా కలిసిపోయి, మనం మాట్లాడే తెలుగులో అవి కూడా తెలుగు పదాలేనేమో అనుకొనే విధంగా అల్లుకొని పోయాయి. అలాగే, ప్రస్తుతం వాడకంలో ఉన్న తెలుగులో హిందీ, ఉర్దూ, అరబిక్, రష్యన్, ఆంగ్లం వంటి భాషల్లోని పదజాలం విస్తృతంగా చొచ్చుకొని వచ్చింది. ఈ పరభాషా పదజాల ప్రవేశాన్ని మనం ఆపగలమా? సముజాయించు, ఫిరాయించు, రోడ్డు, కారు వగైరా వగైరా పదాలు సహజమైన తెలుగు పదాల్లాగానే వాడబడుతున్నాయి. ఇలాంటి పదజాలాలు చిక్కని తెలుగును విలీనం చేస్తున్నాయి. ఇంతకుముందు చెప్పుకొన్నట్టి తెలుగు ప్రాంతంలో మనుగడకు ఎవరికైనా మినహాయింపు లేకుండా తెలుగు తప్పనిసరి అనే నియమం అమలుల్లోకి రాగలిగితేనే తెలుగుతనం పరిపుష్టం అయి చాలాకాలం మనుగడనుసాగిస్తుంది. ఆదిమకాలంలోని రకరకాల చప్పుళ్ళు, అరుపులు ఒక భాషగా రూపాన్ని సంతరించుకొని, ఇన్ని భాషలుగా విడిపోయి, కొంతకాలం ఆయా భాషలు తమ స్వయం ప్రతిపత్తిని స్థిరం చేసుకొని, మరల అన్ని భాషలు ఒకే భాషగా సమ్మిళితమై పూర్వపుస్థితికి జారిపోతామేమోననే సందేహం కలగక మానదు. ప్రస్తుతం చక్కని చిక్కని తెలుగుభాషావిలీనానికి వెనుక గల కారణాలను గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. ●

# ప్రజావాక్కు



## హాస్యాన్ని అపహాస్యం చేయవద్దు

మన తెలుగు సినిమాలు రోజు రోజుకు మరీ దారుణంగా తయారవుతున్నాయి. కథలో దమ్ము లేకపోయినా, బూతు సంభాషణలను నమ్ముకుని సినిమాలు తీయడం అలవాటుగా మారింది. ప్రేక్షకులను థియేటర్‌కి రప్పించడానికి బూతు డైలాగులను ఎరగావాడుతున్నారు. చివరికి పిల్లల చేతకూడా బూతు సంభాషణలు పలికిస్తున్నారు. ఈ చెత్త మాటలు రాసే రచయితలు కాస్త సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని రాస్తే బాగుంటుంది. ఈఅశ్లీల, బూతు డైలాగులు సమాజంలో ఊతపదాలుగా మారడం మన దౌర్భాగ్యం. హాస్యమంటే బూతుమాటలని దర్శక, నిర్మాతల నమ్మకం అనుకుంటా. అదేహాస్యమని భావించడం ప్రేక్షకుల దౌర్భాగ్యం. దర్శకనిర్మాతలు కేవలండబ్బునే కాకుండా సమాజాన్ని దృష్టిలో పెట్టుకుని సినిమాలు నిర్మిస్తే, పదికాలాల పాటు గుర్తుండిపోతారు. కామెడీఅంటే హాయిగా కుటుంబ సమేతంగా నవ్వుకోవాలి. హాస్యమంటే వెకిలిచేష్టలు, రెండర్థాలు, అవహేళన చేయడం కాదని, తెలుసుకోవాలి.

-కాయల నాగేంద్ర, హైదరాబాద్

## యుజిసి నిబంధనలు పాటించాలి

ఇటీవల రాజస్థాన్‌లో యుజిసి నిబంధనలు పాటించనందుకు ఆ కోర్సులను నిషేధించారు. గానీ అసలు సరైన అనుమతే లేకుండా డిగ్రీనుండిఎన్నో కోర్సులను దూర విద్య పేరుతోకోర్సులు ఆఫర్‌చేస్తూ చివరికి ధ్రువపత్రాలు నకిలీ అనితెలిసి ఎంతో డబ్బు నష్టపోతున్నారు. మధ్యప్రదేశ్‌లో ఇలాంటివి కొన్ని ఉన్నట్లు భోగట్టా. కావున ఇటువంటి వాటికి ప్రజాప్రకటన ఇస్తే మంచిది. అభ్యర్థులు యుజిసి అనుమతి ఉన్న వాటినే ఎంచుకొని భవిష్యత్తులో జాగ్రత్తగా చూసి కోర్సులు చేయాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

## దావోస్‌లో పర్యటిస్తున్న తెలుగు సిఎంలు

రాష్ట్రాల ముఖ్యమంత్రులు, గురుశిష్యులు అయిన నారా చంద్రబాబు నాయుడు, శ్రీ రేవంత్ రెడ్డి, తమ శక్తివంచన లేకుండా కృషిచేస్తూ, తమ రాష్ట్రాల అభివృద్ధి కొరకు శ్రమిస్తున్నారు. ఎటువంటి వివాదాలకు తావులేకుండాతెలుగు ప్రజల కొరకు వారిభవిష్యత్తు కోసంపాటుపడుతున్నతీరు హర్షణీయం. ప్రజల జీవితాలలో వెలుగులు నింపడమే వారిరువురి అభిమతంగా ఉండడం ఆనందదాయకం.

-నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

## ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాలు

రాష్ట్రవ్యాప్తంగా గత ప్రభుత్వం ప్రతీ గ్రామంలో పల్లె ప్రకృతి వనాలుఏర్పాటుచేసి వివిధరకాల మొక్కలనునాటడం జరిగింది. అన్నిరకాల మొక్కలు, పండ్ల మొక్కలు నాటి వాని రక్షణ గ్రామ పంచాయతీలకు అప్పగించారు. ప్రస్తుతం అనేక గ్రామాలలో పల్లె ప్రకృతి వనాలు నీరు పోసేవారు లేక ఎండిపోయి మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. గతంలో గ్రామంలో వున్న యువత, వృద్ధులు స్వచ్ఛమైన గాలి కోసం పల్లె ప్రకృతి వనాలకు వెళ్ళేవారు. అంతట ఎండి కళా విహీనంగా మారాయి. అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలకు పూర్వ వైభవం తేవాలి. ప్రతీ రోజూ వానికి నీరు పోసి ఏపుగా మొక్కలు ఎదిగేలా చర్యలు తీసుకోవాలి.

-కామిడి సతీష్ రెడ్డి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

## విభజన హామీల మాటేమిటి?

రాష్ట్రపర్యటనలో కేంద్రహోంమంత్రి అమిత్‌షా, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి కేంద్రం రాష్ట్రానికి ఎంతో సహాయం చేస్తున్నదని ముక్త కంఠంతో చెప్పారు! కానీ చాలా అంశాల్లో స్పష్టత లేదు! ఉదాహరణకు రాజధాని నిర్మాణానికి ప్రపంచ బ్యాంక్ ఇస్తున్న రుణభారం రాష్ట్రం మీదే పడుతుంది? అలాగే గతంలో పవన్ కళ్యాణ్ విభజన చట్టంప్రకారం కేంద్రంనుంచి రావాల్సిన నిధులుపై నియమించిన నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం రాష్ట్రానికి 74వేలకోట్ల రూపాయలు రావాల్సి ఉంది. ఆ నిధులు ఇంతవరకు జమఅయిన సమాచారం లేదు? సదరు నిపుణులు కానీ పవన్ కళ్యాణ్ కానీ దీనిపై ప్రజలకు వాస్తవాలు చెప్పాలి!

-గరిమెళ్ల రామకృష్ణ, ఏలూరు, ఏలూరు జిల్లా

## కొత్త కోర్సులు ఇంటర్‌లో అవసరం

తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ కోర్సులలో నూతన సంస్కరణలో భాగంగా 2025-2026 విద్యా సంవత్సరం నుండితెలంగాణరాష్ట్రఇంటర్మీడియట్ స్థాయిలో గురుకులాలలో కూడా సామాజిక శాస్త్రాలను ప్రారంభించాలి. సైన్స్ మ్యాస్ సబ్జెక్టులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ సామాజిక శాస్త్రాలైన ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, కామర్స్ వంటి కోర్సులను కూడా తెలంగాణ రాష్ట్రంలోని ఇంటర్మీడియట్ స్థాయిలో ప్రవేశపెట్టాలి. యూనివర్సిటీ గ్రాంట్ కమిషన్ యుజిసి ఉన్నత విద్యాస్థాయిలో డిగ్రీకోర్సులలోకూడా ఈ విద్యా సంవత్సరంనుండి నూతన కోర్సులను ప్రవేశపెట్టడానికి ఆదేశాలు జారీ చేస్తుంది.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ, వరంగల్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

చెత్త నుంచి సంపద సృష్టిస్తున్న

## రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌దే

- చంద్రబాబునాయుడు ఆలోచనకు రూపమే జిందాల్ వేస్ట్‌టూ ఎనర్జీ ప్లాంట్
- స్వఛ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మరిన్ని ప్లాంట్లు రావాలి
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**బల్లికురవ, జనవరి 21, ప్రభాతవార్త**



చెత్త నుండి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్న రెండో రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచనలకు అనుగుణంగా జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. గుంటూరులోని జిందాల్ వేస్టన టూ ఎనర్జీ ప్లాంట్‌ను మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం సందర్శించారు. చెత్తను ప్రాసెసింగ్ చేసి, విద్యుత్ ఉత్పత్తి చేసే ప్రక్రియను అక్కడి అధికారులు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ గుంటూరు జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌లో విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాల్లోని మూడు కార్పొరేషన్లు, ఐదు మున్సిపాలిటీల నుంచి చెత్తను సేకరించి శుభ్రం చేయడంత పాటు గంటకు 15 మెగావాట్ల మేర విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. పర్యావరణ హితం కోసం ఇలాంటి ప్లాంట్లు మరిన్ని స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రానికి రావాలన్నారు. నాడు చంద్రబాబు దూరదృష్టితోనే ఏపీకి జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్ వచ్చిందని మంత్రి గొట్టిపాటి గుర్తు చేశారు. దేశం వ్యాప్తంగా చూస్తే దేశ రాజధాని ఢిల్లీ తరువాత ఇలాంటి ప్లాంట్లు కేవలం ఏపీలోనే ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వంలో చెత్త సేకరణ సరిగ్గా జరగలేదని మంత్రి ఆరోపించారు. అంతే కాకుండా నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చెత్త మీద కూడా పన్ను వేశారని గుర్తు చేశారు. సంపద సృష్టించాలంటే పన్నుల రూపంలో వసూళ్లు చేయడం మాత్రమే కాకుండా విద్యుత్ ఉత్పత్తి చేసి కూడా సృష్టించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిందాల్ ప్రాజెక్టు ప్రెసిడెంట్ ఎంవీ చారీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

## లైన్‌మెన్ నిర్లక్ష్యం.. యువకుడి నిండు ప్రాణం బలి

- విద్యుత్ స్తంభంపై పనిచేస్తుండగా విద్యుదాఘాతం
- ఎల్‌సీ తీసుకోకపోవడంతో లైన్‌మెన్‌పై కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహం - పోలీసు స్టేషన్‌లోఫిర్యాదు

**కనిగిరి, జనవరి 21, ప్రభాతవార్త**



విద్యుత్ శాఖ లైన్‌మెన్ నిర్లక్ష్యం.. ఓ యువకుడి నిండు ప్రాణాన్ని బలిగొన్న సంఘటన మంగళవారం కనిగిరి మండలంలోని వంగపాడులో జరిగింది. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు గురవాజీపేట విద్యుత్ శాఖ లైన్‌మెన్ మహేశ్వరరెడ్డి వంగపాడు ఎర్రంవారిపల్లి మధ్యలో విద్యుత్ మరమ్మత్తులు చేయించేందుకు గురవాజి పేట ఎస్సీ కాలనీకి చెందిన కుమ్మరికుంట చిట్టిబాబు కుమారుడు దేవ(21)ను వెళ్లాడు. దేవ విద్యుత్ స్తంభం ఎక్కి మరమ్మత్తులు చేసే క్రమంలో విద్యుత్ ఘాతానికి గురై కింద పడటం జరిగింది. విద్యుదాఘాతంతో గాయాల పాలై స్పృహ కోల్పోయిన యువకుడిని స్థానికులు కనిగిరిలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించగా వైద్యులు యువకుడు మృతి చెందాడని నిర్ధారణ చేయడం జరిగింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు ప్రైవేటు వైద్యశాల వద్దకు చేరుకొని బోరున విలపించారు. విద్యుత్ లైన్‌మెన్ ఎల్‌సీ తీసుకోకుండా నిర్లక్ష్యంగా స్తంభాన్ని ఎక్కించడం వల్లే నిండు ప్రాణాలు పోయాయని విలపించారు. విద్యుత్ శాఖ లైన్‌మెన్ నిర్లక్ష్య వైఖరి పై ఆగ్రహించిన కుటుంబ సభ్యులు, స్థానికులు పోలీసు స్టేషన్‌కు చేరుకొని తమకు న్యాయం చేయాలని మృతుడి తండ్రి కుమరికుంట చిట్టిబాబు ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఫిర్యాదు మేరకు ఇన్‌ఛార్జీ ఎస్సై మాధవరావు ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు విచారణ చేపట్టారు. కనిగిరి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.చేతికి అందివచ్చిన కుమారుడు మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. పెద్దఎత్తున గ్రామానికి చెందిన స్థానికులు మృతుని కుటుంబ సభ్యులతో కలిసి న్యాయం కోసం పోలీసు స్టేషన్ వద్దకు చేరుకోవడం జరిగింది. ప్రమాదానికి గల వాస్తవ కారణాలు పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది.

## క్విస్ కళాశాలలో మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

**ఒంగోలుటౌన్, ప్రభాతవార్త**




క్విస్ ఫార్మసీ కళాశాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగం పై మరియు మహిళా సంరక్షణ పై అవగాహన కార్యక్రమము. ఈ కార్యక్రమము జిల్లా యువజన సంక్షేమశాఖ, ఫార్మసీ ఎన్ ఎస్ ఎస్ ఆధ్వర్యములో నిర్వహస్థానిక వెంగముక్కపాలెం నందు గల క్విస్ కాలేజ్ అఫ్ ఫార్మసీ నందు మాదకద్రవ్యాల దుర్వినియోగంపె, మహిళ సంరక్షణపై సైబర్ క్రైమ్‌పై అవగాహన కార్యక్రమాన్ని ఫార్మసీ విద్యార్థిని విద్యార్థులకు ఘనముగా నిర్వహించారు అని కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ సూర్య కళ్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ డాక్టర్ గాయత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మహిళా పోలీసు స్టేషన్ ఒంగోలు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ చంద్రలీల మాట్లాడుతూ డ్రగ్స్ కు అలవాటు అవుతున్న వారిలో చాలామంది విద్యార్థులే ఉంటున్నారని ఇది వారి భవిష్యత్తును చాలా దెబ్బతీస్తుంది అన్నారు. అంతేకాకుండా మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వారు తమకు పట్టుపడితే శిక్ష కఠినంగా ఉంటుందని కాబట్టి విద్యార్థులు మాదక ద్రవ్యాల పట్ల అప్రమత్తతో ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఉమెన్ సబ్ ఇన్ స్పెక్టర్ గౌతమి మాట్లాడుతూ మాదకద్రవ్యాల నియంత్రణకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని ఎవరైనా డ్రగ్స్ వాడుతున్నట్టు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వొచ్చని అలాంటి వారిపై ఎక్సైజ్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులతో మాదక దవ్యాల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ప్రతిజ్ఞ చేయించారు. అలానే మహిళల రక్షణపై, వారి చట్టాల పై కూడా అవగాహన కల్పించారు కార్యక్రమంలో కళాశాలల ప్రిన్సిపాల్ డా.కిషోర్ బాబు, యువజన సంక్షేమశాఖ, స్టెప్ అసిస్టెంట్ మేనేజర్ రాజా,పావని మరియు ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ధనమూర్తి, కళాశాల అధ్యాపక అధ్యాపకేతర, ఏన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## రీ సర్వేపై క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలి

- జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**ఒంగోలు,ప్రభాతవార్త**



రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీల పరిష్కారము, రీ సర్వేపై క్షేత్రస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఆయా అంశాలపై మంగళవారం ప్రకాశం భవనము నుంచి డివిజన్, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ సదస్సులను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిందని కలెక్టర్ అన్నారు. ఈ సదస్సులలో వచ్చిన అర్జీల పరిష్కారం పై ముఖ్యంగా రెవిన్యూ సంబంధిత సమస్యల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె పునరుద్ఘాటించారు. మ్యూటేషన్ల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రస్తుతం రీసర్వే ప్రక్రియను కూడా మండలంలోని ఒక్క గ్రామానికే చేస్తున్నందున లోప రహితముగా నిర్వహించాలని అన్నారు. సర్వే అంశాలపై రెవెన్యూ సిబ్బందికి స్పష్టమైన అవగాహన కోసమే జిల్లాస్థాయిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని ఆమె గుర్తు చేశారు. మీకోసం అర్జీల పరిష్కారంలోనూ నిర్లక్ష్యం ఉండరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఆర్. గోపాలకృష్ణ, డీ.ఆర్.ఓ బి చిన్న ఓబులేసు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా నూతన అధ్యక్షులుగా సెగ్గం శ్రీనివాసరావు

**ఒంగోలు, ప్రభాతవార్త**



బిజెపి జిల్లా నూతనఅధ్యక్షులుగా పార్టీ సీనియర్‌నాయకులు సెగ్గం శ్రీనివాసరావు ఎంపికైయ్యారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు. తనకు బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురంధేశ్వరి, రాష్ట్ర, జిల్లా నాయకులు సెగ్గం శ్రీనివాసరావు ధన్యవాదాలు తెలిపారు.

# ప్రకాశం



తెలుగు జాతీయ దినపత్రిక వార్త

## పద్యనాటక దిగ్గజం చీమకుర్తి నాగేశ్వరరావు కుటుంబానికి ఆర్థికసాయం

**ఒంగోలుటౌన్,ప్రభాతవార్త**




ఎన్టీఆర్ కళాపరిషత్ ఒంగోలు 25వ వసంతోత్సవం సందర్భం నాలుగో రోజు జరిగిన కార్యక్రమాలలో ముఖ్య అతిథిగా హాజరైన ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్, కళారత్న గుమ్మడి గోపాలకృష్ణ, ఎన్టీఆర్ కళాపరిషత్ అధ్యక్షులు ఈదర హరిబాబు, ప్రజానాట్యమండలి సీనియర్, రంగస్థల ప్రముఖులు నల్లూరి వెంకటేశ్వర్లు (అన్న), పరిషత్ ప్రముఖులు అన్నమనేని ప్రసాద్‌లు పాల్గొన్నారు. ప్రముఖుల సమక్షంలో జీజీకే (గుమ్మడి గోపాలకృష్ణ) ఫౌండేషన్ తరపున పద్యనాటక దిగ్గజం స్వర్గీయ చీమకుర్తి నాగేశ్వరరావు కుటుంబానికి రూ. 25 వేల ఆర్థికసహాయం అందించారు. జీజీకే ఫౌండేషన్ సలహాదారు డాక్టర్ కృష్ణయ్య సహృదయతతో చీమకుర్తి గారి సతీమణి చీమకుర్తి వెంకాయమ్మ చేతికి గుమ్మడి రూ. 25వేల నగదును అందించారు.

# పన్ను వసూళ్లలో డీలా.. పేరుకుపోతున్న బకాయిలు

- ప్రభుత్వ భవనాల బకాయిలు సుమారు రూ.40కోట్లు
- నిధుల్లేక నీరసించిన ఒంగోలు నగరపాలక సంస్థ

**ఒంగోలు, ప్రభాతవార్త**



నగరాభివృద్ధి సజావుగా సాగాలంటే పన్ను వసూళ్లు కీలకం. ఆస్తి, నీటి పన్నులతో పాటు ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా వచ్చే ఫీజులను వసూళ్లు చేయాలి. అయితే ఒంగోలు నగర పాలక సంస్థలో పన్ను వసూళ్లు నత్తనడకన సాగుతున్నాయి. లక్ష్యాన్ని సాధించలేకపోవడంతో అభివృద్ధికి ఆటంకం కలుగుతుంది. క్షేత్ర స్థాయి సిబ్బంది చొరువ చూపడం లేదనే విమర్శలు లేకపోలేదు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మరో 69 రోజుల్లో ముగియనున్నది. ఈ క్రమంలో జనవరి 3వ వారం దాదుతున్న వసూళ్ల పక్రియ 50శాతానికి చేరుకోలేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం మాదిరిగా ప్రస్తుతం సంక్షేమ పథకాలు అందకపోవడం నానాటికి ధరలు పెరుగుతుండటం ఆశించిన స్థాయిలో పంటల దిగుబడి లేకపోవడం మార్కెట్ డీలా పడి వ్యాపారాలు అంతంతమాత్రంగానే సాగుతుండటం దీనికి ఒక కారణం అవుతుంది. పన్నుల వసూళ్ల నిమిత్తం కార్పొరేషన్ సిబ్బంది వెళ్లినప్పుడు చెల్లించేందుకు సమయాన్ని ప్రజలు కోరుతున్నారని తెలుస్తోంది. ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గడువు మార్చి నెలాఖరు వరకు ఉందని అప్పట్లోకి చెల్లిస్తామని బకాయిదారులు కోరుతున్నారని సమాచారం. సామాన్యుల నుంచి పన్నులను ముక్కు పిండి వసూళ్లు చేస్తే కార్పొరేషన్ అధికారులు ప్రభుత్వ శాఖలపై మాత్రం ఎనలేని ప్రేమ కురిపిస్తున్నారు. నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారే తప్ప చిత్తశుద్ధితో వసూళ్లు చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ భవనాలకు సంబంధించి నోటీసులు అందచేయడం తప్ప వసూళ్లు చేసే మార్గం కానరావడం లేదు. ప్రభుత్వ సంస్థల నుంచి మున్సిపాలిటీకి రావాల్సిన బకాయిలు సుమారు రూ.40కోట్ల వరకు ఉన్నాయి. నివాస గృహాల ఇంటి పన్నును మాత్రం ముక్కు పిండి మరి వసూళ్లు చేస్తున్న నగర పాలక సంస్థ ప్రభుత్వ కార్యాలయాల నుంచి రావాల్సిన వాటిపై ఉదాసీనంగా వ్యవహారిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొన్నేళ్లుగా పన్నులు చెల్లించకపోవడంతో అపరాధ రుసుం తోడై బకాయిల భారం మరింత పెరిగింది. వాస్తవానికి 2002 నుంచి ఇప్పటి వరకు పన్నులు రూ.15కోట్లు వసూళ్లు చేయాల్సి ఉండగా వడ్డీ కలిపి రూ.25 కోట్లు పెరిగింది. దీంతో ఆయా శాఖల నుండి రూ.40కోట్ల వరకు రావాల్సి ఉంది. అందులో ప్రధానంగా పోలీసు శాఖ ప్రకాశం భవనం, కోర్టు, డీఆర్‌డీఏ, ఆర్‌అండ్‌బి, ఎన్నెస్పీ, పంచాయతీ రాజ్, బీసీ కార్పొరేషన్, జిల్లా పరిషత్, డ్వామా, రిమ్స్ భవనాలు ఉన్నాయి. ఒంగోలు కార్పొరేషన్‌కు పన్ను బకాయిలు గుదిబండలా మారాయి. ఏటికేటుకి అవి కొండలా పెరిగిపోతున్నాయి. నగర పాలక సంస్థ అభివృద్ధి చెందాలంటే ఆర్థిక వనరులే. పన్నులు బకాయిలు కోట్లలో పెరిగిపోవడంతో ఖజానా వెలవెలబోతుంది. యంత్రాంగం అలసత్వం పన్ను దారుల్లో నిర్లక్ష్యం ఇందుకు ప్రధాన కారణం. ప్రధానంగా ప్రభుత్వ ఆస్తుల పన్ను బకాయిలు పెద్ద తలనొప్పిగా మారింది. తాజాగా పన్ను వసూళ్లకు గడువు ముంచుకొస్తుండటంతో ఇప్పుడు వసూళ్లకు అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ప్రధానంగా ఆయా డివిజన్ల వారీగా కేటాయించిన ఆర్ఐలు, సచివాలయ సెక్రటరీలకు బకాయిల వసూళ్లు అన్నది కత్తిమీద సాములా మారింది.

## పీఎం అవార్డ్స్‌కొరకు వెబ్‌సైట్‌లో నమోదుచేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**ఒంగోలు,ప్రభాతవార్త**



పీఎం అవార్డ్స్ కోసం తగిన ప్రతిపాదనలతో వివరాలను వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలపై మంగళవారం ప్రకాశం భవనంలో సంబంధిత అధికారులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 2022 ఏప్రిల్ నెల నుంచి 2024 డిసెంబరు నెలాఖరు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు సంబంధించిన వివరాలతో సమగ్ర నివేదికలను రూపొందించాలని అధికారులకు ఆమె దిశా నిర్దేశం చేశారు. పీఎం అవార్డుల కోసం మొత్తం మూడు కేటగిరీలలో 14 అంశాలకు సంబంధించిన వివరాలను సంబంధిత సైట్‌లో నమోదు చేయాల్సి ఉన్నది. హర్ ఘర్ జల్ యోజన, ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన, పిఎం విశ్వకర్మ, ప్రధానమంత్రి ఆవాస్ యోజన, పిఎం స్వానిధి, సక్షం అంగన్వాడి మరియు పోషన్ అభియాన్, ప్రధానమంత్రి మాతృ వందన యోజన, పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన, మిషన్ ఇంద్రధనస్సు, రైతులు, మత్స్యకారులు, పశుపోషకులకు కిసాన్ క్రెడిట్ కార్డుల పథకం అమలు చేస్తున్న వివరాలను కేంద్ర ప్రభుత్వానికి సవివరంగా తెలియ చేయాలని ఆమె ఆదేశించారు. అదేవిధంగా యాస్పిరేషనల్ బ్లాక్ అభివృద్ధి కింద ఎర్రగొండపాలెం ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను, వినూత్న కార్యక్రమాల కింద జిల్లాలో అమలు చేస్తున్న బంగారు బాల్యం, మార్గదర్శిని కార్యక్రమాలను కూడా సమగ్రంగా నివేదించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సిపిఓ వెంకటేశ్వర్లు, డి.ఎం.హెచ్.ఓ. టి. వెంకటేశ్వర్లు, డి సి హెచ్ ఎస్ సూరిబాబు, ఎన్టీఆర్ వైద్య సేవ జిల్లా కోఆర్డినేటర్ హేమంత్, జిల్లా మత్స్య శాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా పశుసంవర్ధక అధికారి బేబీరాణి, జిల్లా విద్యాధికారి కిరణ్ కుమార్, ఐ.సి.డి.ఎస్. పిడి హేనాసుజన్, ఏపిసిపిడిసిఎల్ ఎస్.ఈ. కట్టా వెంకటేశ్వర్లు, విపత్తుల నిర్వహణ విభాగ డిపిఎం మాధురి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## గానగంధర్వుడు చీమకుర్తి నాగేశ్వరరావు

**చీమకుర్తి, జనవరి 21, ప్రభాతవార్త**



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సత్యహరిచంద్ర పాత్రధారిగా ఎంతో ప్రజా ఆదరణ పొంది ఎన్నో అవార్డులు అందుకున్న గాన గంధర్వుడు చీమకుర్తి నాగేశ్వరావు చిరస్మరణీయులని లైన్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు ప్రముఖ వైద్యులు డాక్టర్ బి జవహర్ అన్నారు. చీమకుర్తి నాగేశ్వర రావు వర్ధంతి సందర్భంగా స్థానిక చీమకుర్తి లోని పోలీస్ స్టేషన్ ఎదురు గల వారి విగ్రహంకి మంగళవారం పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ముఖ్యఅతిథి బి. జవహర్ మాట్లాడుతూ చీమకుర్తినే తన ఇంటి పేరుగా మార్చుకొని తొట్టెంపూడి నాగేశ్వరరావు సత్యహరిచంద్ర నాటకానికి, చీమకుర్తికి ఎనలేని గుర్తింపు తీసుకొచ్చారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చలువాది బదిరి నారాయణ, వై ఎస్ భారతి సేవా సమితి అధ్యక్షురాలు పాటిబండ్ల రాజా సులోచన, చీమకుర్తి జడ్‌పిటిసి సభ్యులు వేమా శ్రీనివాసరావు, కౌన్సిలర్ పాటిబండ్ల గంగయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బండ్ల డేవిడ్ మాస్టర్, అనాధ ఆశ్రమం వ్యవస్థాకులు ఖాదర్ బాషా,ప్రజా కవి పిన్నిక శ్రీనివాసరావు,రెడ్ డ్రాప్ ఫౌండేషన్ వ్యవస్థపకులు ఇస్తర్ల శంకర్ బహుజన, యమ్ ఆర్ పి ఎస్ నాయకులు చింతలపాలెం యలమంద బాబు, హారనాధ్ బాబు, నాగేశ్వరావు గారి కుటుంబం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఖాతాదారుల గోడు పట్టించుకోలేని పోస్టల్ అధికారులు

- పోస్టల్ ఏటీఎం కార్డుల గడువుతీరిన నూతన కార్డులు మంజూరు చేయని అధికారులు
- నగదు డ్రాకు వెళ్లి ఇబ్బంది పడుతున్న పెన్షనర్లు

**మార్కాపురం, జనవరి 21, ప్రభాతవార్త**







గడువు తీరిన పోస్టల్ ఏటీఎం కార్డుల స్థానంలో కొత్త కార్డులను మంజూరు చేసే విషయంలో పోస్టల్ శాఖ చేస్తున్న నిర్లక్ష్యం కారణంగా పోస్టల్ ఖాతాదారులు, పెన్షనర్లు ఇబ్బందులకు గురి అవుతున్నారు. మార్కాపురం పోస్టల్ డివిజన్ పరిధిలోని 29 పోస్టాఫీసులకు ఈ పోస్టాఫీసు ప్రధానమైనది, డివిజన్ పోస్టాఫీసుగా పిలువబడే ఈ పోస్టాఫీసులో పూర్తి స్థాయి సిబ్బంది లేకపోవడం, పోస్టల్ ఖాతాదారులకు సరైన సేవలు అందించకపోవడం కారణంగా ఈ పోస్టాఫీసుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ డివిజన్ పోస్టాఫీసులో ఖాతాదారుల అవసరార్థం సుమారు 800 మందికి ఏటీఎం కార్డులు మంజూరు చేసి ఉన్నారు. ఈ కార్డులు 2024 అక్టోబర్ నెలలో కార్డుల గడువు తీరడంతో అవి ఉపయోగంలోకి రావడం లేదు. గడువు తీరిన ఈ కార్డుల స్థానంలో పోస్టల్ శాఖ కొత్త ఏటీఎం కార్డులను ఖాతాదారులకు అందించాల్సి ఉండగా సప్లై లేదంటే నాలుగు నెలల నుండి దాటవేస్తుండడంతో పెన్షన్లు డ్రా చేసుకునే వృద్ధులు, లావాదేవీలు నడుపుకునే ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన పోస్టాఫీసు అయిన ఈ కార్యాలయంలో పోస్టల్ ఎస్పీ, అడిషనల్ ఎస్పీ, పోస్టుమాస్టర్‌లు ప్రధాన బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొత్త ఏటీఎం కార్డుల మంజూరు కోసం మీరు ఎన్ని సార్లు పై అధికారులకు విన్నవించుకున్న ఎలాంటి సమాధానం రావడం లేదని వారంటున్నారు. కార్యాలయ ఆవరణ పరిదిలో పోస్టల్ ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కేంద్రం కూడా సుమారు రెండు సంవత్సరాల కాలం నుండి పని చేయడం లేదు, కార్యాలయంలో 22 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం 11మంది మాత్రమే, సరైన సేవలు ప్రజలకు అందడం లేదు, మార్కాపురంతో పాటు పొదిలి, గిద్దలూరు, కంభం, రాచర్ల, తురిమెళ్ళ పెద్ద దోర్నాల, యర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు ఇలాంటి 29 ప్రధాన పోస్టాఫీసులు మరికొన్ని గ్రామీణ పోస్టాఫీసులు ఈ కార్యాలయం పరిధిలో ఉన్నాయి. వీటి అన్నింటిలో ఎక్కడ కూడా ఏటీఎం కార్డులు లేకపోవడంతో పోస్టల్ సేవల పట్ల ఖాతాదారులు పెదవీరుస్తున్నారు. ప్రభుత్వ బ్యాంకులతో పాటు ప్రైవేటు బ్యాంకులు పోటీగా నడుస్తున్న ఈ రోజులలో కేంద్ర కార్యాలయం అయినటువంటి పోస్టల్ కార్యాలయం ఇంత నిర్లక్ష్యంగా ఉండడం పట్ల ప్రజలు పలు రకాలుగా విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పోస్టల్ సేవలను విస్తృతం చేసి ఖాతాదారులకు మరిన్ని నాణ్యతతో కూడిన సేవలను అందించాలని గడువు తీరిన ఏటీఎం కార్డుల స్థానంలో కొత్త కార్డులను తక్షణమే మంజూరు చేయాలని కోరుతున్నారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు

**నాగులుప్పలపాడు, జనవరి 21, ప్రభాతవార్త**



పరిమితికి మించి ప్రయాణికులను, కూలీలను ఆటోల్లో, ట్రాక్టర్లలో ఎక్కించుకోవద్దని ఎస్సై బి.శ్రీకాంత్ వాహనదారులకు సూచించారు. మంగళవారం ఆటో డ్రైవర్లు, ట్రాక్టర్ వాహనదారులకు ఎస్సై శ్రీకాంత్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వ్యవసాయ కూలి పనులకు ఆటోలలో, ట్రాక్టర్‌ల ద్వారా కూలీలను పరిమితికి మించి ప్రయాణం చేస్తూ ప్రమాదాలకు గురి అయితే వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని చెప్పారు. ప్రమాదాల నివారణకు సహకరించాలని సూచించారు.

వరదలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో

# విద్యుత్ శాఖ ఇంజనీర్ల సేవలు భేష్

- చంద్రబాబు సంస్కరణలతోనే విద్యుత్ రంగంలో పెట్టుబడులు
- విద్యుత్ ఉద్యోగుల పీఆర్సీ సమస్య పరిష్కారానికి చర్యలు
- 8 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తే లక్ష్యం
- రాజకీయ మనుగడ కోసమే కొందరు అసత్య ప్రచారాలు
- ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్స్ డైరీ ఆవిష్కరణలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

**బల్లికురవ, జనవరి 21, ప్రభాతవార్త**




విజయవాడ వరదలతో పాటు అనేక ప్రకృతి వైపరీత్యాల సమయంలో విద్యుత్ రంగ ఉద్యోగులు తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలు అందించారని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కొనియాడారు. ఏపీ ఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. విజయవాడలోని సుజనా కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరించిన అనంతరం మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సంస్కరణలోనే విద్యుత్ రంగంలో ఉద్యోగాల కల్పనతో పాటు పెట్టుబడులు వస్తున్నాయని వివరించారు. అనేక ప్రైవేటు విద్యుత్ రంగ సంస్థలకు ధీటుగా ఏపీ విద్యుత్ రంగ ఉద్యోగులు ఎంతో కష్టపడి విధులు నిర్వహిస్తున్నారని అభినందించారు. విద్యుత్‌రంగం అంటే వ్యాపార రంగం కాదు, సేవా రంగమని తెలిపారు. ఈ శాఖకు మంత్రిగా ఉన్నందుకు తనకు ఎంతో గర్వపడుతున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఏటా విద్యుత్ వినియోగం పెరిగిపోతుందని, దీంతో కొన్ని ప్రాంతాల్లో ఉద్యోగులపై పని ఒత్తిడి కూడా ఎక్కువ అవుతుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అయినా లైన్‌మెన్ నుంచి ఏఈ, ఆపై అధికారుల వరకు 24గంటలు పని చేస్తూ రాష్ట్ర ప్రజలకు సేవలందిస్తూ తమ చిత్తశుద్ధిని చాటుతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇంత కష్టపడుతున్నా.. రాజకీయ అస్థిత్వం కోసం కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మంత్రి గొట్టిపాటి మండిపడ్డారు. వ్యవసాయ మోటార్లకు స్మార్ట్ మీటర్లు ఉండవు అని ఇప్పటికే అసెంబ్లీలో ప్రకటించిన ప్రజలను తప్పుదోవ పట్టించేలా విష ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ అవసరాల కోసం తప్పుడు ప్రచారాలు చేయడం మంచిది కాదని మంత్రి గొట్టిపాటి హితవు పలికారు.

**ఔదర్యంలోనూ మేటి..:**

మిగిలిన అన్ని రంగాలకు భిన్నంగా విద్యుత్ రంగ ఉద్యోగులు ఒడుదొడుకులు, ఒత్తిడిలు మధ్య తమ అత్యవసర విధులను నిర్వహిస్తున్నారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విజయవాడ బుడమేరు వరదలు వచ్చినప్పుడు అందరికంటే ముందుగా ఒక రోజు వేతనాన్ని వరద బాధితులకు విరాళంగా ప్రకటించి విద్యుత్ ఉద్యోగులు తమ ఔదర్యాన్ని చాటుకున్నారని గుర్తు చేశారు. ఉద్యోగులు నిర్వహించే ఇటువంటి కార్యక్రమాలు చూస్తుంటే నాపై మరింత బాధ్యత పెరిగినట్లు భావిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెన్కో ఎంఈడీ కేవీఎన్ చక్రధర్ బాబు, ఏపీ ట్రాన్స్‌కో ఎండీ కీర్తి చేకూరి, ఏపీఎస్ఈబీ నాయకులు శామ్యూల్, నాగ ప్రసాద్, రామారావు, గోపాలకృష్ణ, శైలేంద్ర, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి - ఎ.ఒ. వెంకటకృష్ణ



**అద్దంకి , జనవరి 21 , ప్రభాతవార్త**
మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. మండలంలోని వెంకటాపురం మరియు విప్పర్లవారి పాలెం గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాధికారి మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెర పురుగు గమనించడం జరిగింది. దాని నివారణ కొరకు ఎమమెక్టిన్ బెంజోఎట్ 100గ్రా ఎకరాకు పిచికారి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానశాఖ అధికారి ఎస్.దీప్తి సర్పంచ్ పాకనాటిఅంజిరెడ్డి,గ్రామ వ్యవసాయసహాయకులు సీత తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ ఆధ్వర్యంలో 138వ రక్తదాన కార్యక్రమం



**అద్దంకి , జనవరి 21 , ప్రభాతవార్త**
రక్త హీనత సమస్యతో బాధ పడుతున్న అద్దంకి, నర్రావారిపాలెం నివాసి పూసపాటి శివపార్వతి (42) వైద్యులు అత్యవసరంగా ఒ పాజిటివ్ రక్తం అవసరం కాగ, రోటరీ క్లబ్ ఆఫ్‌సింగరకొండ అద్దంకి వారి ఆధ్వర్యంలో రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు అద్దంకి వాస్తవ్యులు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఎన్. వెంకటేశ్వర్లు (42)ని ప్రోత్సహించిరక్తదానం చేయించారు. చుండూరి మురళీ సుధాకరరావుప్రోత్సహించిన 438వ రక్తదానం. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, రక్తదాత వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

### మేదరమెట్ల పిహెచ్‌సిను పరిశీలించిన జిల్లా మలేరియా అధికారి ఎం. గోపిచంద్



**కొరిశపాడు , జనవరి 21 , ప్రభాతవార్త**
మండలంలోని మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా అధికారి ఎం. గోపిచంద్ తన సిబ్బందితో మంగళవారం పరిశీలించారు. ముందుగా పిహెచ్‌సికి వచ్చిన టెక్నిషియన్ ఆరోగ్య కార్యకర్తల రికార్డులను పరిశీలించి మరింత మెరుగుగా ఉండేటందుకు వారికి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో పర్యటించి కాలవలలో మురుగు నీరు నిల్వకుండా ఎప్పటికప్పుడు చెత్తచెదారాలను తొలగించి, నీటి ప్రవాహం సాఫిగా ఉండేలా చూడాలని సిబ్బందని అదేశించారు. ఆలాగే మురుగు నీటి కుంటలలో నీరు చేరితే దోమలు వృద్ధి చెందుతాయని, అలా నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ సిబ్బందిని అదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్.యు.ఒ కర్నాటి అర్జునరావు, హెచ్‌ఈఒలు పి.బ్రహ్మానందం, జానీ పిహెచ్‌సి సిబ్బంది సుశీల కిరణ్, కుమారి, ఎఎన్‌ఎంలు ఆశా సిబ్బంది పాల్గొన్నారు.

### సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ



**అద్దంకి రూరల్ జనవరి 21, ప్రభాతవార్త**
సమాజంలో ప్రతి ఒక్కరూ పారిశుద్యం తమ వ్యక్తిగత భాద్యతగా భావించి పాటించినట్లైతే వ్యాధులు ప్రబలకుండా అరికట్టవచ్చునని బాపట్ల జిల్లా మలేరియా అధికారి గోపీనాద్ అన్నారు. సంతమాగులూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గోపీనాద్ ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్య శాలలో రికార్డుల నిర్వహణను పరిశీలించిన గోపీనాద్ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వైద్యశాలలో సూపర్ వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు , పారా మెడికల్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు.

### బీ సీ వసతిగృహం పరిశీలన

సంతమాగులూరు ప్రాథమిక వైద్యశాల తనిఖీ నిమిత్తం వచ్చిన బాపట్ల జిల్లా మలేరియా అధికారి గోపీనాద్ స్థానిక బీసీ విద్యార్థుల వసతి గృహన్ని పరిశీలించారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుద్యాన్ని ప్రభుత్వ శాఖలతో పాటు సామాజంలో ప్రతి ఒక్కరూ తమ భాద్యతగా బావించి నివాస పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లైతే వ్యాదులు దరిచేరకుండా అరికట్టవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో గోపీనాద్ వెంట స్థానిక వైద్యాధికారులు డాక్టర్ నిర్మల్ కుమార్, సాహిత్య,సూపర్ వైజర్ గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కోటప్పకొండ చాత్తాద శ్రీవైష్ణవ అన్నదాన సత్ర

### అధ్యక్ష,కార్యదర్శులుగా అనిల్,పరమేశ్వరరావు




**అద్దంకి రూరల్ జనవరి 21 ప్రభాతవార్త**
ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కోటప్పకొండ లోని చాత్తాద శ్రీవైష్ణవ అన్నదాన సత్ర అధ్యక్షులుగా బెల్లంకొండ అనిల్, కార్యదర్శిగా సంతమాగులూరు మండలం పుట్టవారిపాలెం గ్రామానికి చెందిన శ్రీపెంబులూరి రామ పరమేశ్వరరావు లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.దక్షిణ భారత దేశంలో అత్యంత వైభవంగా విద్యుత్ ప్రభలతో తిరునాళ్ళ ఉత్సవం జరిపే కోటప్పకొండ తిరునాళ్ళ మహాశివరాత్రి ఫిబ్రవరి 26న జరుగుతున్న నేపథ్యంలో కోటప్పకొండ పుణ్య క్షేత్రంలోని అన్ని సామాజిక వర్గాల అన్నదాన సత్రాల నిర్వహణ కమిటీల ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఈనేపధ్యంలో చాత్తాద శ్రీవైష్ణవ అన్నదాన సత్ర నిర్వహణ కమిటి సర్వసభ్య సమావేశంలో గత కమిటి రాజీనామా చేయడంతో నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటికి ఆలయ పరిధిలోని అన్ని గ్రామాల చాత్తాద శ్రీవైష్ణవ సామాజిక వర్గ పెద్దలు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటి అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కమిటి సభ్యులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునే విధంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు. నూతన కమిటిని సంతమాగులూరు సర్పంచుల సంఘ అధ్యక్షులు పుట్టవారిపాలెం సర్పంచ్ నన్నెబోయిన గురుబ్రహ్మం , మాజీ ఎంపీపీ నన్నెబోయిన ఏడుకొండలు, ఉపసర్పంచ్ షేక్ మాబుస్బైదా తదితరులు అభినందనలు తెలిపారు.

## పశువైద్యుల సూచనలు పశుపోషకులు పాటించాలి

- రోగాల భారిన పశువులను రక్షించాలి
- పెద్దదోర్నాల మండల పశువైద్యాధికారి జే.అరుణ్ కుమార్



**పెద్దదోర్నాల, జనవరి 21, ప్రభాతవార్త**
పశువులు రోగాల భారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలి పశువైద్యుల సూచనలు పాటించి పశువులకు వ్యాధులు సంక్రమించినప్పుడు సకాలంలో పశుపోషకులు స్పందించి వాటిని పశు వైద్యశాలకు తరలించి వైద్య సేవలు పొందుటకు తమ వంతు సహకరించాలని పెద్దదోర్నాల మండల పశువైద్యాధికారి డాక్టర్ జే.అరుణ కుమార్ కోరారు. పెద్దదోర్నాల మండలం కటకానిపల్లి గ్రామంలో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ పశువైద్య శిబిరంలో 34 గేదెలు, 24 ఎద్దులు, 1000 గొర్రెలు, 800 మేకలు, 20 గేదె దూడలకు వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి డాక్టర్ జే.అరుణకుమార్ మాట్లాడుతూ పశువులలో గర్భకోశ వ్యాధులు వస్తాయని వివరించారు. నట్టల నివారణ మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పారావెట్ డీ.రెడ్డిబాబు నాయక్, పశు వైద్య సిబ్బంది రమణారెడ్డి, సాయికుమార్, యాసిన్, నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## పంట వ్యర్థాలను సద్వినియోగం చేసుకోండి



**బల్లికురవ, జనవరి 21, ప్రభాతవార్త**
మండలంలోని ఉప్పుమాగులూరు, సోమవరప్పాడు గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి కుమారి రైతులతో కలిసి మొక్కజొన్న, కంది, పొగాకు పంటలను పరిశీలించారు. పంట వ్యర్థాలను తగలబెట్టకుండా రోటోవేటర్ సహాయంతో భూమిలో కలిపితే ఎరువుగా ఉపయోగపడుతుందన్నారు. మొక్కజొన్న 25-30 రోజుల పైరుతో కత్తెర పురుగు నివారణకు మొవ్వులో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరాకు 3 కిలోల చొప్పున వేసుకోని నివారించుకోవచ్చని తెలిపారు. తదుపరి మరొకసారి కోరాజన్ లేదా నోవాల్యూరాన్ పిచికారి చేసుకోవాలని తెలిపారు. కంది పూత, పిందె దశలో ఉంది. ఈ దశలో మారుకా మచ్చల పురుగు ఆశించి ఆకు పూత పిందెలను గూడు లాగ చేసి నష్టం కలిగిస్తుందని దీని నివారణకు కోరాజన్ పిచికారి చేసుకొని నివారించుకోవచ్చని తెలిపారు. ప్రతి పంట ఈకేసీ మొక్కజొన్న, పొగాకు వేసిన రైతులందరు రబీలో మరలా ఈ క్రాప్ చేయించుకోవాలన్నారు. రాబోయే వేసవిలో రైతులు భూసార పరీక్షలు చేయించుకొని, ఏమైనా సమస్యలు ఉంటే అధికారుల సలహాతో బాగుచేసుకొని తదుపరి పంటలు వేసుకోవాలని మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ లు హనుమానాయక్, హరికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## పాఠశాలకు ఫ్లోర్ మ్యాట్స్ బహుకరణ



**కంభం రూరల్, జనవరి 21, ప్రభాతవార్త**
కంభం పట్టణంలోని స్థానిక బోర్డ్ స్కూల్ విద్యార్థులకు, అదే స్కూల్‌లోని అంగన్ వాడీ కేంద్రానికి పట్టణానికి చెందిన ఆరవీటి రమేష్ బాబు మంగళవారం ఫ్లోర్ మ్యాట్స్‌ను బహుకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వరికుంట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు ఉపయోగకరమైన వస్తు సేవలను అందించడం దాతల ఔన్నత్యాన్ని ఇనుమడింపజేస్తుందని అన్నారు. దాతలు ఇలాంటి సేవా కార్యక్రమాల ద్వారా సమాజంలో ప్రతిఒక్కరికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిఆర్‌పి మురళీమోహన్, ఐఈఆర్‌పిలు ఈశ్వరి, అరుణ్ కుమార్, అంగన్ వాడీ కార్యకర్త రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి

### ఈ పంట నమోదు చేయించుకోవాలి

- వ్యవసాయ శాఖాధికారిణి జక్కం మెర్సీ



**బేస్తవారిపేట, జనవరి 21, ప్రభాతవార్త**
2024రబీ సీజన్‌కు సంబంధించి పంటలు వేసిన రైతులు తమ పంటల వివరాలను రైతుసేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఈ పంటగా నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖాధికారిణి జక్కం మెర్సీ తెలిపారు. మండలంలోని నేకునాంబాద్, చింతలపాలెం గ్రామాలలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె రైతులు సాగు చేసిన కంది పంటను పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామాల రైతులతో గ్రామసభ నిర్వహించి మాట్లాడుతూ రైతులు పంటల వివరాలను ఈ పంటగా నమోదు చేయించుకోవాలని తెలిపారు. ఉద్యాన అధికారి డి శ్వేత మాట్లాడుతూ కాయకుళ్ళు, కొమ్మ ఎండుతెగులు వ్యాప్తి చెందకుండా 1ఎంఎల్ ప్రొపికోనజోల్ లేదా 0.5ఎంఎల్ డైఫెన్ కొనోజల్ లేదా 2.5ఎంఎల్ కాపర్ హైడ్రాక్సైడ్ లేదా 2.5గ్రాముల సాప్ మందును లీటర్ నీటికి కలిపి మందులను ఒకటి మార్చి ఒకటి వారం రోజులు రెండుసార్లు పిచికారి చేయాలని తెలిపారు. అరటి పంట గురించి మాట్లాడుతూ అరటి దుంపలు కుళ్ళిపోకుండా కాపర్ ఆక్సి క్లోరైడ్ 3గ్రాములు లీటర్ నీటికి కలిపి లేదా బోర్డో మిశ్రమం 1శాతం దుంప చుట్టూ తడిచేటట్లుగా నేలలో పోయాలని తెలిపారు. ఆకుమచ్చ తెగులు అరికట్టుటకు ప్రోపి కోనజల్ లేదా మ్యాంకో జెట్ 2.5గ్రామ్ లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో ఒకటి లేదా రెండు పర్యాయాలు పిచికారి చేయాలని తెలిపారు. ఉద్యాన యాంత్రీకరణ పథకం కింద తైవాన్ స్ప్రేయర్లు 50శాతం రాయితీతో 5ఎకరాలలోపల ఉన్న రైతులకు లక్షరూపాయలు మించకుండా రాయితీ ఉందని ఉద్యాన అధికారి తెలిపారు. వ్యక్తిగత నీటి కుంటలు మరి4యు ప్యాక్ హౌసులు కోత అనంతరం యాజమాన్య పద్ధతుల క్రింద 50శాతం రాయితీ ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి గణేష్, గ్రామ వ్యవసాయ సహాయకులు సత్యనారాయణ, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## వెల్లంపల్లి, రాజుపాలెంలో పొలం పిలుస్తోంది



**త్రిపురాంతకం, జనవరి 21 ప్రభాతవార్త**
మండల కేంద్రంలోని వెల్లంపల్లి మరియు రాజుపాలెం రైతు సేవాకేంద్రం పరిధిలో మండల వ్యవసాయ అధికారిణి కె నీరజ అధ్యక్షతన మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వెల్లంపల్లి గ్రామంలో రబీ పంటసాగుకోసం తయారు చేసిన వరినారు మడులను పరిశీలించి రైతులకు తగు సూచనలు చేశారు. వరినాట్లు వేసేటప్పుడు 25-30రోజుల వయసుగల నారును నాటుట వలన ప్రధాన పొలంలో దుబ్బులు ఎక్కువగా చేసి చీడపీడల ఉధృతి తగ్గించుకోవచ్చని తెలిపారు. రబీసీజన్‌లో స్వల్పకాలీక రకాలను చదరపు మీటరుకు 44కుదుళ్ళను ఉండేలా చూసుకోవాలని తెలిపారు. వరినాటేటప్పుడు ప్రతి 2మీటర్లకు 30సెంటీమీటర్ల కాలిబాటలను తీసుకోవాలని, దీనివలన మొక్కలకు గాలి, వెలుతురు బాగా తగిలి దోమ ఉధృతి తగ్గుతుందని తెలిపారు. వరినాట్లు వేసేటప్పుడు కొసలు త్రుంచి నాటడం ద్వారా ఆకుముడత పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చని సూచించారు. రాజుపాలెం రైతుసేవాకేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి రైతులందరూ తప్పనిసరిగా అగ్రిటెక్ పోర్టల్ నందు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేపించుకోవాలని సూచించారు. దీనికిగాను రైతులు తమయొక్క ఆధార్ నెంబరుతో లింకు అయిన మొబైల్ నెంబర్ ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ఇక నుండి ప్రభుత్వం నుండి వ్యవసాయ శ్ఖాఖ ద్వారా అందించే ఎటువంటి పథకాలు అయినా రాయితీలు అయినా అర్హత పొందాలి అంటే తప్పనిసరిగా రైతులు సంబంధిత రైతుసేవాకేంద్రం పరిధిలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేపించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత గ్రామ వ్యవసాయ సహాయకులు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో హెల్త్ పింఛన్ల పున:పరిశీలన



**మార్కాపురం, జనవరి 21, ప్రభాతవార్త**
మున్సిపాలిటీలోని మొత్తం 21 సచివాలయాల పరిధిలో హెల్త్ పింఛన్ల పున:పరిశీలన కార్యక్రమం మంగళవారం నుండి చేపట్టినట్లు మున్సిపల్ కమీషనర్ నారాయణ రావు తెలిపారు. కండరాల వ్యాధి, పక్షవాతంతో మంచం పట్టి ఉన్న వ్యాధిగ్రస్తుల పరిస్థితిని వాస్తవాలను పరిశీలన బృందం సందర్శించి వివరాలు సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి.హవీలా, అసిస్టెంట్ ప్రొఫెసర్(జనరల్ మెడిసిన్) డాక్టర్ టి.వైద్య సంజీవ్, డాక్టర్ జే.రోహిత్ నాయక్, పీహెచ్‌సీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

### అదనపు ప్రయాణికులను తీసుకెళ్లడంపై ఆటో డ్రైవర్లకు కౌన్సిలింగ్



**హనుమంతునిపాడు, జనవరి 21, ప్రభాతవార్త**
జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో ఆటో డ్రైవర్లకు అదనపుప్రయాణికులను తీసుకెళ్లడంపై హనుమంతునిపాడు ఎస్సై కే.మాధవరావు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు బాధ్యతగా వాహనాలు నడపాలని, తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, నిబంధనలకు విరుద్ధంగా చట్ట వ్యతిరేకంగా వాహనాలు నడిపితే తీవ్ర చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. వాహనాలను కూడా అధిక వేగంతో నడపవద్దని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని, డ్రైవర్ల పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకోవద్దని అన్నారు. మరి ముఖ్యంగా ఆటోలకు వెనుక డోర్ ఓపెన్ చేసి ఆ డోర్స్‌పై ప్రయాణికుల్ని కూర్చోబెట్టడం కాని, నిలబెట్టడం కానీ చేయవద్దని ఆటోకు వెనుక డోర్ పూర్తిగా క్లోజ్ చేయాలని అన్నారు. అత్యాశకు పోయి వెనుకడోర్ తీసి ప్రయాణికులను ఎక్కించుకున్నా, కూర్చోబెట్టినా, నిలబెట్టినా ఆ తర్వాత పోలీసులు తీసుకునే చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. మీ ఇష్టానుసారంగా ప్రయాణికులను ఎక్కించుకుని వాహనాలు ప్రమాదాలకు కారణమైతే జరగరాని నష్టాలు ఏమైనా జరిగితే అప్పుడు మీ బాధలు వర్ణణాతీతంగా ఉంటాయన్నారు. కాబట్టి పోలీసు వారి హెచ్చరికలను పాటించి నిబంధనల ప్రకారం వాహనాలు నడుపుకోవాలని అన్నారు. పోలీసులు నిత్యం తనిఖీలు నిర్వహిస్తుంటారని తనిఖీల్లో వాహనాలకు సంబంధించి ఎలాంటి ఉల్లంఘటనలు కనిపించినా వెంటనే జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ఆయన తెలిపారు. పోలీసులకు సహకరించి నిబంధనల ప్రకారంవాహనాలు నడుపుకోవాలని పోలీసులు సూచనలుసలహాలు పాటించాలని అన్నారు.

## ప్రతి ఒక్కరూ ఈ పంట చేయించుకోండి

- మండల వ్యవసాయాధికారి కేవీ రమణ



**హనుమంతునిపాడు, జనవరి 21, ప్రభాతవార్త**
ప్రతి ఒక్క రైతు కూడా వేసిన పంటను తప్పకుండా ఈ పంట చేయించుకోవాల్సిందిగా మండల వ్యవసాయాధికారి కేవీ రమణ తెలియజేశారు. మంగళవారం మండలంలో లింగంగుంట్ల, వేములపాడు రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కేవీ రమణ పాల్గొని మాట్లాడుతూ ఈ పంట త్వరలో ముగిస్తుంది. కనుక ప్రతి ఒక్క పంట వేసిన రైతు ఈ పంట నమోదు చేయించుకోవాలని, ఈకేవైసీకి సహకరించాల్సిందిగా కోరారు. అలాగే ఇన్సూరెన్స్ కట్టుకున్న ప్రతి ఒక్క రైతు గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా పంట దృవీకరణ పత్రాలను పొందాలని తెలియజేశారు. అనంతరం ఈ పంట చేసిన పొలాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రాల సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ పెన్షన్లు పొందిన వారిపై వైద్యపరీక్షలు

**కొమరోలు, జనవరి 21, ప్రభాతవార్త**
మండలంలో అక్రమంగా ధృవీకరణ పత్రాలు పొంది పెన్షన్లు పొందుతున్న వారిపై వైద్యాధికారుల బృందం మంగళవారం ఇంటింటికి వెళ్ళి వైద్యపరీక్షలు చేపట్టింది. మీరు ప్రభుత్వాలు వారి ఎన్నికల కోసం వయస్సు తేడాతో ఆధార్ ధృవీకరణ పత్రాలను మరియు వికలాంగుల పెన్షన్‌తో తప్పుడు ధృవీకరణ పత్రాలు పొంది ఒక ఇంటికి రెండు పెన్షన్లు ఆధార్ కార్డులో వయసు మార్చి కొత్త ఆధార్ కార్డు పొంది ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసేందుకు అటు వైద్యాధికారుల బృందం ఇటు రాజకీయ నాయకులు మరియు పార్టీకి తొత్తులుగా మారిన మరికొందరు అక్రమదారులు ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అయ్యేందుకు భాగస్వాములయ్యారు. ఈ మేరకు ప్రస్తుత ప్రభుత్వం ఆదేశాలతో అక్రమంగా పొందిన వారి పెన్షన్లు ఏరివేత కార్యక్రమం చేపట్టింది. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వైద్యాధికారుల బృందం బి శ్రీహర్ష, కె విజయ్, చైతన్యలు బృందంగా ఏర్పడి ఇంటింటికి వెళ్ళి కొమరోలు పట్టణంలో పరీక్షలు నిర్వహించారు. దీనిపై వైద్యపరీక్షలు చేసిన అనంతరం జిల్లా వైద్యాధికారికి ఆయా యాప్‌ల ద్వారా నివేదిక సమర్పించనున్నట్లు వారు తెలిపారు. కొమరోలు బ్రాహ్మణ వీధిలో ఉన్న మానుకొండు చెంచయ్యను ఇప్పటికే రూ.15వేలు 83శాతం సర్టిఫికేట్ ఉన్న ఆయనకు వైద్యపరీక్షలు నిర్వహించఆరు. అదేవిధంగా వికలాంగుల ధృవీకరణాలు పొందిన వారిపై స్థానిక వైద్యశాల యందు క్యాంపు ఏర్పాటు చేసి వైద్యపరీక్షలు నిర్వహించి నివేదిక సమర్పిస్తామని వారు తెలిపారు. వారి వెంట దద్దవాడ డిజిటల్ అసిస్టెంట్ షామీర్ ఉన్నారు.

## ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయింపు

- ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు



**మార్కాపురం రూరల్, జనవరి 21 ,ప్రభాతవార్త**
రాష్ట్ర వ్యాప్తంగా భూమిగల ప్రతిరైతుకు రైతుసేవా కేంద్రం సిబ్బంది ద్వారా రిజిస్ట్రేషన్ చేసి ఒక గుర్తింపు సంఖ్యను కేటాయించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. మండల వ్యవసాయ శాఖ ఆధ్వరనయంలో మండలంలోని రాయవరం, చింతకుంట గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలలో రైతులు సాగు చేసిన కంది, శనగ పంటలను రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. అనంతరం రాయవరం, చింతకుంట గ్రామాల రైతులతో కలిసి గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలలో భాగంగా ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన ప్రతి పంటను ఆర్‌ఎస్‌కె సిబ్బందిని సంప్రదించి పంట నమోదుతోపాటుగా ఈకెవైసి కూడా చేపించుకోవాలని తెలిపారు. ప్రతి రైతుకు గుర్తింపు సంఖ్యను రైతుసేవా కేంద్రం సిబ్బంది ద్వారా ప్రభుత్వం కేటాయిస్తుందని, ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, పంటల భీమా, ఇతర వ్యవసాయ సంబంధ సేవలను పొందడానికి ఈ గుర్తింపు సంఖ్య ముఖ్యమని ఆయన తెలిపారు. కావున ప్రతి ఒక్క రైతు వెంటనే తమ ఆధార్ కార్డు, ఆధార్ కార్డుకు లింక్ అయిన మొబైల్‌ను, భూమి రికార్డు వివరాలను తీసుకొని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు చేపించుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతకుంట, రాయవరం గ్రామాల ఆర్‌ఎస్‌కె సిబ్బంది వెంకటేశ్వరరెడ్డి, వెంకట్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై చొరువతో చిల్లచెట్లు తొలగింపు



**పొన్నలూరు, జనవరి 21, ప్రభాతవార్త**
మండల పరిధిలో మాలపాడు వలేటివారిపాలెం రోడ్డులో పలు మలుపులు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానిక పొన్నలూరు ఎస్సై కే.అనూక్ చొరువతో మంగళవారం నాడు ప్రమాదకర మలుపుల వద్ద ఉన్న చిల్లచెట్లను స్థానికుల సహకారంతో జేసీబీ ద్వారా తొలగించారు. ఎస్సై అనూక్ చొరువ తీసుకొని చిల్లచెట్లు తొలగించడం పట్ల స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు.

### మాజీ సర్పంచ్‌ను సత్కరించిన ముస్లిం మత పెద్దలు



**మద్దిపాడు, జనవరి 21, ప్రభాతవార్త**
మద్దిపాడు గ్రామ మాజీ సర్పంచ్, ఎంపీటీసీ ఉప్పుగుండూరు నాగేశ్వరరావును జిల్లా మంగళవారం ఘనంగా సత్కరించారు. జిల్లా కేంద్రం ఒంగోలులో ఈనెల 9,10,11 వ తేదీల్లో ఇస్తిమా కార్యక్రమంకు మూడు రోజుల పాటు మంచినీటి సరఫరాను నాగేశ్వరరావు చేపట్టారు. ఈ నేపథ్యంలో జిల్లా మదీనా మసీద్ ప్రతినిధులు మంగళవారం మద్దిపాడులోని ఆయన స్వగృహమునకు విచ్చేసి ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. మూడు రోజుల పాటు మంచినీరును సరఫరా చేసేందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా మదీనా మసీదు కార్యదర్శి కరిముల్లా, కమిటీ సభ్యులు అబ్దుల్లా, మౌలా, అబూబాకర్, మద్దిపాడు సిరాజుద్దిన్, నూరుల్లా, షరీఫ్, దౌలత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పింఛన్లపై విచారణ



**కొనకనమిట్ల, జనవరి 21, ప్రభాతవార్త**
మండలంలోని వెలిగండ్ల, మునగపాడు, సిద్దవరం, కొనకనమిట్ల, చింతగుంట, వాగుమడుగు గ్రామ పంచాయతీలలో మంగళవారం పెన్షన్ వెర్ఫికేషన్‌ను ప్రత్యేక అధికార బృందం నిర్వహించింది. ముఖ్యంగా వైకల్యం కలిగిన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ ఈశ్వరమ్మ, కొనకనమిట్ల పీహెచ్ వైద్య అధికారి డాక్టర్ బాలయ్య, ఈవో జి.శ్రీదేవి, సంబంధిత సచివాలయ ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

### ఆటోలలో పరిమితికి మించి కూలీలను ఎక్కిస్తే చర్యలు తప్పవు

- ఎస్సై బి నరసింహారావు



**కంభం రూరల్, జనవరి 21, ప్రభాతవార్త**
ఆటోలలో పరిమితికి మించి కూలీలను ఎక్కించి ప్రయాణం చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కంభం ఎస్సై బి నరసింహారావు హెచ్చరించారు. మంగళవారం మండలంలోని తురిమెళ్ళ ప్రాంతంలో రహదారిపై పరిమితికి మించి కూలీలతో ప్రయాణిస్తున్న ఆటోను ఆయన నిలిపి డ్రైవర్‌ను హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన కూలీలతో మాట్లాడుతూ ఆటోలో ఎక్కు లోడ్‌తో ప్రయాణిస్తున్న సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రయాణించాల్సిన అవసరం లేదని కూలి పనికన్నా ప్రాణం ముఖ్యమనే విషయాన్ని కూలీలు గ్రహించాలన్నారు. ఆటోలో కూలీలను పరిమితికి మించి ఎక్కించినందుకుగాను డ్రైవర్‌పై చర్యలు తీసుకుంటామని డ్రైవింగ్ లైసెన్స్ సైతం రద్దు చేస్తామని ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని ఆయన డ్రైవర్‌ను హెచ్చరించారు.

## విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై అవగాహన



**కొండపి, జనవరి 21 ప్రభాతవార్త**
2025 జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కొండేపి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఓటుహక్కు వినియోగంపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఏ కుమార్ మంగళవారం అవగాహన కల్పించారు. మంగళవారం జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మూడు అంశాలకు సంబంధించి విద్యార్థులకు పోటీలు నిర్వహించఆరు. ఈ సందర్భంగా ఎన్నికలకు సంబంధించి అంశములు ఓటర్ల చైతన్యము ఎన్నికల సంఘం పాత్ర, ప్రజాస్వామ్య పటిష్టత, ఓటుహక్కు వినియోగంపై విద్యార్థుల పోటీలను, క్విజ్, డిబేట్‌ను ఎన్నికల అధికారి పరిశీలించారు. నియోజకవర్గ స్థాయిలో అన్ని కేటగిరిలో మొదటి, రెండవ, మూడవ స్థానములలో గెలుపొందిన వారిని గుర్తించి వారి యొక్క పేర్లను జిల్లా స్థాయిలోఈనెల 23వతేదీ జరగనున్న కాంపిటేషన్‌కు పంపించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ మురళి, ఎంపిడిఓ రామాంజనేయులు, ఎంఈఓ సురేఖ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వర్లు,ఉన్నతపాఠశాలప్రధానోపాధ్యాయులు,విద్యార్థులు,అధికారులు తదితరులు పాల్గొన్నారు

## విస్తారంగా మంచు ప్రభావం

- పగటివేళలో లైట్లు వేసుకుని పయనిస్తున్న వాహనదారులు



**సంతనూతలపాడు, జనవరి 21, ప్రభాతవార్త**
జోరు మంచు ప్రభావం వల్ల ఒంగోలు- కర్నూలు జాతీయ రహదారిపై పగటి వేళలో గత్యంతరం లేని పరిస్థితుల్లో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణం చేయాల్సి వస్తుంది. సంతనూతలపాడులోని ఒంగోలు- కర్నూలు రహదారిపై ఉదయం 8గంటలు దాటినను మంచు ప్రభావం తగ్గటం లేదు. మంచుతో రహదారులు చీకటమైపోతున్నాయి. ముఖ్యంగా పగటి వేల రహదారులు అంధకారంగా మారాయి. ఈ మంచు ప్రభావం వల్ల వాహనదారుల ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మంగళవారం నాడు పగటివేలలో మంచుతో సంతనూతలపాడు బస్టాండ్ ప్రాంగణం చీకటితో నిండింది. వాహన దారులు తప్పనిపరిస్థితుల్లో పగటి వేళలో మంచు ప్రభావం అధికంగా ఉండటంతో లైట్లు వేసుకుని పయనిస్తున్నారు.

## నిరక్షరాస్యులైన మహిళను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్



**మార్కాపురం, జనవరి 21, ప్రభాతవార్త**
నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ఉల్లాస్ ఎంతో దోహదపడుతుందని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మంగళవారం మార్కాపురంలో ఉల్లాస (వయోజన విద్య) పోస్టర్ బుక్స్‌ను ఆవిష్కరించారు. చదువులేని మహిళలకు సాయంత్రం పూట ఉచితంగా విద్యను నేర్పించడం జరుగుతుందని వెలుగు ఏపీఎం బి.సుధాకరరావు అన్నారు. మొదటి విడతగా 1146 మందిని అక్షరాస్యులుగా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఏపీఎం, వయోజన విద్య సూపర్‌వైజర్ చెన్నారెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు సాయిలు, లక్ష్మీరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చింతల శ్రీనుకు కరణం, బూచేపల్లి పరామర్శ



**బల్లికురవ, జనవరి 21, ప్రభాతవార్త**
బల్లికురవ జడ్పీటీసీ సభ్యులు చింతల అంజలి శ్రీనివాస్ తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం అందుకున్న చీరాల మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం కృష్ణమూర్తి, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిలు గురువారం మండలంలోని కొమ్మినేనివారిపాలెంలో ఆయన మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాసరావును పరామర్శించారు.

## ఆర్థిక అక్షరాస్యత చాలా ముఖ్యం

**- ఎంపీడీఓ వి.జ్యోతి**



**మద్దిపాడు, జనవరి 21, ప్రభాతవార్త**
వయోజనులకు ఆర్థిక, అక్షరాస్యత చాలా ముఖ్యమని ఎంపీడీఓ వి.జ్యోతి అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఉల్లాస్(అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) జిల్లా సూపర్‌వైజర్ పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన స్వచ్ఛంద బోధకుల శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వచ్ఛంద బోధకులు ఒక్కొక్కరు పది మంది నిరక్షరాసులను అక్షరాస్యులుగా మార్చాలని అన్నారు. స్వచ్ఛంద బోధకులు అందరికి అనువైన పాఠశాల గాని అంగన్‌వాడీ సెంటర్ కాని, కమ్యూనిటీ సెంటర్ కాని అక్షర కేంద్రంగా మలుచుకోవాలని అన్నారు. వాచకంలోని పాఠాలు స్త్రీలు నిత్యజీవితంలో ఎదుర్కొనే సమస్యలను ఎదుర్కొనే విధంగా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. అక్షరాస్యత కేంద్రాలు ఎటువంటి ఇబ్బందులు ఎదురు అయిన పరిష్కరించడానికి తాను సిద్ధంగా ఉంటానని తెలిపారు. జిల్లా వయోజన విద్య సూపర్‌వైజర్ పోతురాజు మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులైన డ్వాక్రా మహిళలకు డిజిటల్, ఆర్థిక క్రియాత్మక అక్షరాస్యత అందించడమే ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఈ శిక్షణ ద్వారా నిరక్షరాస్యులు అయిన డ్వాక్రా మహిళలు సులువుగా తమకు అనువైన సమయంలో అనుకూల ప్రదేశంలో విద్య నేర్చుకునే అవకాశం ఉందని అన్నారు. టీసీఎస్ కంపెనీ వారు సామాజిక బాధ్యతతో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించారని వారు రూపొందించిన వీడియో పాఠాలు రోజుకొక వీడియో పాఠం అభ్యాసకులకు ప్రదర్శించే విధంగా చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట ఏపీఎం కాకుమానుసుబ్బారావు, అంగన్‌వాడీసూపర్‌వైజర్లు స్వచ్ఛంద బోధకులు పలువురు పాల్గొన్నారు.

## జాల్లపాలెం, గుడిపాటిపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది



**వెలిగండ్ల, జనవరి 21, ప్రభాతవార్త**
వెలిగండ్ల మండలంలోని జాల్లపాలెం, గుడిపాటిపల్లె గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సహాయ వ్యవసాయ సంచాలకులు కనిగిరి ఈవీ రమణ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో రబీ సీజన్లో పంట ఇన్సూరెన్స్ చేసుకున్న రైతులు అందరూ తమ ఇన్సూరెన్స్ అప్లికేషన్లను సంబంధిత రైతు సేవ కేంద్రం సిబ్బందికి అందజేసి ఖచ్చితంగా ఈ పంట నమోదు చేసుకోవాల్సిందిగా తెలియపరిచారు. కేవలం ఇన్సూరెన్స్ చేసుకొని ఈ పంట నమోదు చేసుకొని రైతులు ఇన్సూరెన్స్‌కు ఎలిజిబుల్ కారని తెలిపారు. త్వరలో ప్రతి రైతుకు ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అందుకోసం ప్రతి రైతు తమ పట్టాదారు పాస్ బుక్కు జిరాక్స్ ఆధార్ కార్డు బ్యాంకు అకౌంట్ జిరాక్స్‌ను తీసుకొని రైతు సేవ కేంద్రం సిబ్బందిని కలిసి సంప్రదించి ఈ గుర్తింపు సంఖ్యను పొందాల్సిందిగా తెలిపారు. ఇప్పటి నుండి కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలు జరుగుతున్న పీఎం కిసాన్ స్కీంకు రిజిస్ట్రేషన్ చేసుకొనుటకు ఈ నెంబరు ఖచ్చితంగా అవసరమని తెలిపారు. అలాగే ఏప్రిల్ నుండి విడుదల అయ్యే పీఎం కిసాన్ ఇన్స్టాల్మెంట్లు రైతులకు డిపాజిట్ కావాలంటే ఖచ్చితంగా రైతు గుర్తింపు సంఖ్యను పొంది ఉండాలని తెలిపారు. అలసంద, వరి పంటలలో సస్యరక్షణ చర్యలు వివరించారు. పురుగు మందులు తగు మోతాదులో పిచికారి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

## వైవీని కలిసిన కనపర్తి, పెద్దిరెడ్డి



**జరుగుమల్లి, జనవరి 21, ప్రభాతవార్త**
పెద్దలు రాజ్యసభ సభ్యులు మాజీ టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డిని మంగళవారం తాడేపల్లిలోని తన నివాసంలో ప్రకాశం జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షులు కనపర్తి శేషారెడ్డి కొండపి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పెద్దిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా శేషారెడ్డి, కొండపి నియోజకవర్గ, పలు నియోజకవర్గాల్లోని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

## మండవ అప్పారావును పరామర్శించిన బూచేపల్లి



**మద్దిపాడు, జనవరి 21, ప్రభాతవార్త**
ఇటీవల ప్రమాదంలో గాయపడి ఒంగోలు వెంకట రమణ హాస్పిటల్ నందు చికిత్స పొందుతున్న మద్దిపాడు మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మండవ అప్పారావును ప్రకాశం జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, స్థానిక ఎంపీపీ వాకా అరుణ- కోటిరెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని తెలిపారు. వీరి వెంట వైసీపీ నాయకులు దుంపా చెంచురెడ్డి, సంతనూతలపాడు జడ్పీటీసీ దుంపా రమణమ్మ, పాకనాటి మహానందిరెడ్డి తదితరులు ఉన్నారు.

## రైతులందరికి పంట నమోదు చేయాలి



**దొనకొండ,జనవరి 21,ప్రభాతవార్త**
పొగాకు రైతులకి పంట నమోదు..ఈ రబి సీజన్లోపొగాకు సాగు చేసిన రైతులందరికి పంట నమోదు చేయాలని దొనకొండ మండల వ్యవసాయాదికారి వి. లక్ష్మి   మ నారాయణ రైతు సేవా కేంద్ర సిబ్బందిని ఆదేశించారు. ఈ రోజు గంగదేవిపల్లి మరియు పెద్దన్నపాలెం రైతు సేవా కేంద్రాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశం లో రైతులతో మాట్లాడుతూ రైతులు సహకర్నిచి పొగాకు పంట నమోదు చేయించుకోవాలన్నారు.నమోదు చేయించాకుంటేనే బుకింగ్ ఐడి వస్తదని, ఇది ఉంటేనే ప్రకృతి వైపరిత్యాలపుడు ఇన్పుట్ సబ్సిడీ, పంటల భీమా పథకం, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో పంట ఉత్పత్తులని అమ్ముకోవటానికి కుదురుతుందని తెలిపారు.రైతులు ఫార్మర్ రిజిస్ట్రీ లో నమోదుకు వారి పొలం వెబలాండ్ లో ఉండాలని, ఆధార్ నెంబర్ కు ఫోన్ నెంబర్ ని లింక్ చేసుకోవాలాని కోరారు.అనంతరం పొగాకు, మిర్చి పంటలని రైతులతో కలిసి పరిశీలిచారు. మిరపలో నల్ల తామర పురుగు నివారణ చర్యలని వివరించారు.ఈ కార్యక్రమంలో రెండు గ్రామాల రైతులు,వ్యవ సాయ సిబ్బంది అరుణా దేవి, వీణా కుమారి పాల్గొన్నారు.

## లక్ష్యసాధన దిశగా చదువును కొనసాగించండి

**- విద్యార్థులకు ఎమ్మెల్యే కందుల హితవు**




**మార్కాపురం, జనవరి 21, ప్రభాతవార్త**
కష్టంగా కాకుండా ఇష్టంగా చదివి లక్ష సాధన దిశగా విద్యను అభ్యసించాలని మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి విద్యార్థులకు హితవు పలికారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం 2280 నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోకేష్‌బాబు జన్మదిన సందర్భంగా నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించాలని భావించామన్నారు. అయితే అదే రోజు మెగా బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో ఈ కార్యక్రమాన్ని రెండు రోజులు ముందుగానే నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలోని అత్యంత వెనుకబడిన మార్కాపురం అభివృద్ధికి కృషి చేస్తానని, విద్యా సదుపాయాలకును మెరుగుపరుస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ చదువును భారంగా భావించకుండా ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని ఉత్తమంగా ఎదగాలన్నారు. ప్రస్తుత రోజులలో చదువు వెలలేని ఆభరణంగా మారిందని, కష్టపడి చదివితే భవిష్యత్తులో ఎంతో ఉన్నతులుగా ఎదుగుతారని అన్నారు. మార్కాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదివి ఐఏఎస్ ఐపీఎస్‌ల స్థాయిలో ఉద్యోగాలు పొంది ఈ ప్రాంతానికి వన్నెతెచ్చిన వారు ఎందరో ఉన్నారని వారిని మార్గదర్శకంగా తీసుకుని చదువును కొనసాగించాలని తల్లిదండ్రుల ఆశయాలను గురువుల సంకల్పాన్ని నెరవేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### దళిత సంఘ నాయకులు వెంకట సుబ్బయ్యకు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ఘన నివాళులు



**సంతనూతలపాడు, జనవరి 21, ప్రభాతవార్త**
సంతనూతలపాడు మండలం బొడ్డువారిపాలెం అంబేద్కర్ నగర్ నందు అనారోగ్యంతో మృతి చెందిన దళిత వృద్ధ నాయకులు నూతలపాటి వెంకట సుబ్బయ్యకు మంగళవారం నాడు సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్, ఎమ్మెల్యే తండ్రి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బి.దానం, సతీమణి బి.సరోజిని తదితరులు ఘన నివాళులర్పించారు. సంతనూతలపాడు మండలం బొడ్డువారిపాలెం గ్రామంలో వెంకట సుబ్బయ్య మృతదేహాన్ని ఎమ్మెల్యే విజయ్‌కుమార్, వారితల్లి సరోజిని సందర్శించి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు మాజీ సర్పంచ్, బాపట్ల పార్లమెంట్ టీడీపీ ఎస్సీ సెల్ సెక్రటరీ రంపతోటి అంకారావు, మాజీ ఉప సర్పంచ్ రావుల సుబ్బారావు, సంఘ నాయకులు తెలగతోటి జాన్సన్ తదితరులు పాల్గొని వెంకట సుబ్బయ్యకు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## పశువైద్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలి

**- పశువైద్యాధికారులు హరిబాబు, సాయిచక్రవర్తి**



**రాచర్ల, జనవరి 21 ప్రభాతవార్త**
గ్రామాల్లో నిర్వహిస్తున్న పశువైద్య ఆరోగ్య శిబిరాలను పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని రాచర్ల, అనుములవీడు పశువైద్యాధికారులు డాక్టర్ డి హరిబాబు, డాక్టర్ వివి సాయిచక్రవర్తిలు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పశుపోషకుల సంక్షేమం కోసం నిర్వహిస్తున్న పశువైద్య ఆరోగ్య శిబిరాలను మంగళవారం వారు ఎడవల్లి, కాల్వపల్లి గ్రామాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని రైతులు మరియు పశుపోషకులు తమ పశువులు మరియు జీవాలకు సంబంధించి ఎలాంటి వ్యాధులు సోకినా ఈ శిబిరాలకు తీసుకువస్తే వ్యాధి నివారణకు చికిత్సలు చేస్తామన్నారు. ప్రభుత్వం ఈనెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు మండలంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తుందని కాబట్టి రైతులు, పశుపోషకులు ఈ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. చూడు పశువులు గొడ్డుమోతు పశువులు వాటికి సంబంధించిన గర్భకోశవ్యాధులు అన్నింటిని పరీక్షించడం జరుగుతుందన్నారు. జీవాలకు సంబంధించి ఎలాంటి వ్యాధులు సోకినా ప్రత్యేక చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. నట్టల నివారణ మందులు కూడా ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. బుధవారం (22వ తేదీ) అనుములపల్లి, గుడిమెట్ట గ్రామాల్లో ఈ పశువైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనుములవీడు, రాచర్ల పశువైద్యశాలల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం







**రాచర్ల, జనవరి 21 ప్రభాతవార్త**
2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలల్లో 5వతరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకు నేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. 5వ తరగతిలో ప్రవేశాల కొరకు ఆసక్తి ఉన్నవారు ఈనెల 25వ తేదీ నుండి ఫిబ్రవరి నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. ఆసక్తిగల విద్యార్థులు సంబంధిత వెబ్సైట్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈఏడాది మార్చి 10వ తేదీ ప్రవేశపరీక్ష జరిగే అవకాశం ఉంది కాబట్టి ఆసక్తిగల విద్యార్థినీలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు.

## ప్రభుత్వ పథకాలకు నోచుకోని చిరు ఉద్యోగులు

**- అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం శూన్యం**

**- పరిష్కారం కోసం ఎదురు చూపులు చూస్తున్న వైనం**






**మార్కాపురం రూరల్, జనవరి 21 ,ప్రభాతవార్త**
కూటమి ప్రభుత్వం గత ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్‌లో భాగంగా అధికారంలోకి వచ్చిన వెనువెంటనే మొదటి నెల నుంచే పెంచిన పింఛను రూ.4వేలు ఇవ్వటం జరిగింది. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు మహిళలకు దీపావళి కానుకగా అక్టోబర్ 31 నుంచి అర్హులైన ప్రతిఒక్కరికి ఏడాదికి 3ఉచిత సిలీండర్లను పంపిణీ చేయడం ప్రారంభించారు. అయితే ఇంతవరకు బాగానే ఉంది. కానీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందటానికి నిర్ధేశించిన పారామీటర్స్ సిక్స్ స్టెప్స్ నందు ఒకటైనా కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే తీసుకుంటున్న జీతంతో సంబంధం లేకుండా అనర్హులుగా ఉండటం చేత చాలామంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరంగా ఉన్నారు.

**భగత్‌సింగ్ కాలనీలో అంగన్ వాడీ చిరు ఉద్యోగిని ఆవేదన :**
ఇటీవల భగత్ సింగ్ కాలనీలో నివాసం ఉంటున్న ఎస్టీ కేటగిరికి చెందిన అంగన్ వాడీ ఆయా కార్యకర్త ఇటీవల ఎస్సీ, ఎస్టీ విద్యుత్ 200యూనిట్ల లోపల యూజర్స్‌కు ఉచిత సబ్సిడీ పథకం కోసం దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ ఉద్యోగి అయినందు వలన సబ్సిడీ వర్తించదని రిపోర్ట్ ఇచ్చారు. ఆమెకు నెలకు రూ.7వేలు వేతనం తీసుకుంటున్నట్లు సిడిపిఓ దగ్గర సర్టిఫికేట్ తీసుకుని రూ.12వేలకు పైగా ఆదాయం చూపెట్టడం వలన నాకు ఏ ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావడం లేదని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్ నందు విన్నవించుకోవడం జరిగింది. అక్కడి నుండి ఆమె దరఖాస్తును పట్టుకొని సచివాలయం అధికారులకు, మున్సిపల్ అధికారులకు, విద్యుత్ శాఖ అధికారులకు సంబంధిత అధికారులందరి దగ్గర సమస్య ప్రస్తావిస్తే ఒకటే సమాధానం మా పరిధిలో ఏమీ చేయటానికి లేదు.

**అనేక శాఖలలో చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న బాధితులు కోకొల్లలు :**
ఇలాంటి అనేక శాఖలలో చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటున్న బాధితులు కోకొల్లలు ఉన్నారు. గతంలో ఇటువంటి సాంకేతిక సమస్యలు వచ్చాయని, సంబంధిత శాఖాధికారి ఇచ్చిన శాలరీ సర్టిఫికేట్ ఆధారంగా పరిశీలించి సచివాలయంలో మార్చుకునే వెసులుబాటు ఉండేదని పలువురు చెప్పటం గమనార్హం. ఉచిత సబ్సిడీకి ప్రత్యక్షంగా తూట్లు పొడవనప్పటికీ పరోక్షంగా కోత పెడుతున్నారని బయట గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమగ్రంగా విచారణ జరిపి పరిశీలించి చిరు ఉద్యోగులకు ఊరట కలిగించాలని అనేక మంది చిరు ఉద్యోగులు కోరుకుంటున్నారు.

## నేటి నుండి రెవెన్యూ భూములు రీ సర్వే

**దొనకొండ,జనవరి 21,ప్రభాతవార్త**
దొనకొండ పంచాయతీ పరిధిలోని వీరవెంకటాపురం రెవిన్యూ ఇలాఖాలోని భూములకు సంబంధించి రీ సర్వే రేపటి నుండి జరుగును. కావున భూములు గలవారు తమ పట్టాదారుపాసుపుస్తకములు. పత్రము లు. దస్తావేజులు. ఆధార్ కార్డులు తీసుకోని దొనకొండ పంచాయతీ కార్యాలయము నందు ఉదయం 10.00 గంటలకు హాజరు కావలసినదిగా కోరుచున్నాము. ఇట్లు. గ్రామరెవిన్యూ అధికారులవారు. దీ. మాచెర్ల.. సెల్.9949726413

# సేవాతత్పరుడు రావులపల్లి

**- సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ**




**మార్కాపురం, జనవరి 21, ప్రభాతవార్త**
నమ్మిన సిద్ధాంతం కోసం ఉన్నతమైన ఉద్యోగాన్ని వదులుకొని భారత కమ్యూనిస్టు పార్టీలో చేరి తుది శ్వాస వరకు పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటాలు నిర్వహించిన గొప్ప వ్యక్తి, సేవా తత్పరుడు, ఆదర్శప్రాయులు రావులపల్లి చెంచయ్య అని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. స్వర్గీయ రావులపల్లి చెంచయ్య 17వ వర్ధంతి సభ భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయుసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కే కాశీం అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలో తొలితరం కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా, ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, రైతుల సమస్యలపై అకుంఠిత దీక్షతో పోరాటాలు చేసిన ప్రజానేత రావులపల్లి చెంచయ్య అని అన్నారు. వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రజలకు కృష్ణ జలాలు అందించాలని కోరుతూ స్వర్గీయ పూల సుబ్బయ్య, గుజ్జుల యల్లమందారెడ్డి, సానికొమ్ము కాశిరెడ్డి తదితర నాయకులతో కలిసి చెంచయ్య పెద్ద ఎత్తున ఉద్యమాలు నడిపారని ఆయన గుర్తు చేశారు. యర్రగొండపాలెం నియోజకవర్గం నుండి సీపీఐ పార్టీ తరుపున ఎమ్మెల్యేగా పోటీ చేసి అతి తక్కువ ఓట్లతో చెంచయ్య ఓటమి చెందినప్పటికి, అధికారంతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకమై పలు సమస్యలపై పోరాడిన నాయకులు చెంచయ్య అని ఆయన సేవలను కొనియాడారు. చెంచయ్య చేసిన ప్రజా పోరాటాలు పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. అయ్యగానిపల్లె, మేడపి తదితర గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు భూ పంపిణీ చేయాలని కోరుతూ పెద్దఎత్తున పోరాటాలను చేపట్టి విజయం సాధించారని ఆయన గుర్తు చేశారు. చెంచయ్య ఉన్నత రైతు కుటుంబంలో జన్మించినప్పటికి అట్టడుగు వర్గాల పక్షపాతిగా ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటాలను కొనసాగించారని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అన్నారు. ఏఐటీయుసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ తన తండ్రి చెంచయ్య భౌతికంగా మన మధ్య లేకపోయినప్పటికి ఆయన ఆశయాలు, లక్ష్యాలు ఎప్పుడు మా మదిలో మెదులుతూనే ఉంటాయని అన్నారు. ఏపీ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు జిల్లా అధ్యక్షులు ఎన్‌వీ రమణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాటాలు చేస్తూనే మరోవైపు జర్నలిస్టుగా మంచి కథనాలు వ్రాస్తూ ప్రజలను చైతన్యవంతులను చేసిన గొప్ప వ్యక్తి చెంచయ్య అని అన్నారు. పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం పనులు పూర్తి అయినప్పుడే ఆయన ఆత్మకు శాంతి లభిస్తుందని అన్నారు. ఈ సందర్భంగా రావులపల్లి చెంచయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి చిత్తారిపెద్దన్న, ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు ఏలూరి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వివిధ పోటీలు



**సంతనూతలపాడు, జనవరి 21, ప్రభాతవార్త**
సంతనూతలపాడు హైస్కూల్ ప్రాంగణంలో మంగళవారం నాడు జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. స్పెషల్ డిప్యూటకలెక్టర్, స్పెషల్ ఆఫీసర్ ఎస్.వరకుమార్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేశారు. విద్యార్థులు భాగా చదివి అన్ని రంగాల్లో రాణించాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వరకుమార్ పేర్కొన్నారు. ఇటువంటి పోటీల ద్వారా విద్యార్థులు యెడల విజ్ఞానం పెంపొందింపబడుతుందని వరకుమార్ తెలిపారు. విద్యార్థులకు క్విజ్, డిబేట్, వ్యాసరచన పోటీలను ఈ సందర్భంగా నిర్వహించారు. ఈనెల 20వ తేదీన ఇందులో భాగంగా సంతనూతలపాడు నియోజకవర్గ పరిధిలోని చీమకుర్తి, సంతనూతలపాడు, నాగులుప్పలపాడు, మద్దిపాడు కేంద్రాల్లో ఆయా మండలాల స్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. మండల స్థాయిలో విజేతలైన టీములకు ఈనెల 21న సంతనూతలపాడు హైస్కూల్ ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయిలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు ఈనెల 23న ఒంగోలులో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండలంలోని చికలపాడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులైన కే.శ్రావ్య, మల్లికా ప్రియా, లిఖిత లు గెలుపొందారు. డిబేట్లో మండలంలోని మైనంపాడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థులైన ఎస్‌కే తస్లీమా, ప్రథమ స్థానాన్ని చిలకపాడు హైస్కూల్‌కు చెందిన విద్యార్థి కే.శ్రావ్యా ద్వితీయ స్థానంను సంతనూతలపాడు హైస్కూల్‌కు చెందిన ప్రియాంక తృతీయ స్థానం సాధించారు. వ్యాసరచన పోటీల్లో చిలకపాడు హైస్కూల్‌కు చెందిన పి.మల్లికా ప్రియా ప్రథమ స్థానంను, మైనంపాడు హైస్కూల్‌కు చెందిన జి.రేమా షణ్, ద్వితీయ స్థానంను చీమకుర్తి హైస్కూల్‌కు చెందిన జి.సుమిత్ర, తృతీయ స్థానంను సాధించారు. విజేతలైన వీరికి సంతనూతలపాడు తహాశీల్దార్ వేమూరి ఆదిలక్ష్మి బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విజేతలను తహాశీల్దార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి తహాశీల్దార్ ఆర్.బ్రహ్మయ్య, సంతనూతలపాడు ఎన్నికల డిప్యూటీ తహాశీల్దార్ డి.అరుణ, సంతనూతలపాడు, చిలకపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రమోద, పి.స్వప్న రాజు, ఎలక్షన్ కంప్యూటర్ ఆపరేటర్లు ఫణికుమార్, అనిల్, హైస్కూల్ పీడీ కే.మల్లికా రాణి, ఉపాధ్యాయులు రామాచార్యులు, కోటేశ్వరరావు, సుబ్బారావు, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు జాతీయ ఓటర్ల దినోత్సవంలో భాగంగా భోజన సదుపాయాలను కల్పించారు.

## నేడు ఒంగోలులో అక్కినేని వర్ధంతి వేడుకలు




**ఒంగోలు కల్చరల్,జనవరి 21,ప్రభాతవార్త**
సినీ గాయకుడు వందేమాతరం శ్రీనివాస్‌కు అక్కినేని అవార్డు ప్రధానం పద్మభూషణ్ , దాదా ఫాల్కే అవార్డు గ్రహీత, నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 11వ వర్ధంతి వేడుకలు ఈ నెల 22వ తేదీ బుధవారం సాయంత్రం 6 గంటలకు ఒంగోలులోని సివియన్ రీడింగ్ రూమ్ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు అక్కినేని కళాపరిషత్ అధ్యక్షుడు కళ్ళగుంట కృష్ణయ్య తెలిపారు. ఈ సందర్భంగా సినీ నేపథ్య గాయకుడు, సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్‌కు నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు అవార్డు2025ను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. గతంలో ఈ అవార్డును కళాతపస్వి కె. విశ్వనాథ్, సినీ హీరోలు సుమన్, చంద్రమోహన్‌తో పాటు పలువురు సినీ రంగ ప్రముఖులకు అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వందేమాతరం శ్రీనివాస్, ప్రముఖ గాయనీ గాయకులు పాల్గొనే సంగీత విభావరికి వ్యాఖ్యాతగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ వ్యాఖ్యాతగా ఉగాది పురస్కారం అందుకున్న పొన్నూరు వేంకట శ్రీనివాసులు వ్యవహరిస్తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి,ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు, ప్రజానాట్యమండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు అన్న నల్లూరి వెంకటేశ్వర్లు, మండవ మురళీకృష్ణ నగరంలోని పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. కనుక నగరంలోని కవులు, కళాకారులు, సాహిత్య,సంగీత కళాసంస్థల ప్రతినిధులు, అక్కినేని అభిమానులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరారు.

# సాహిత్య సేవ మరువలేనిది



**ఒంగోలు కల్చరల్,జనవరి 21,ప్రభాతవార్త**
ప్రకాశం జిల్లా రచయితల సంఘం పూర్వ అధ్యక్షులు బి.హనుమారెడ్డి జిల్లాకు చేసిన సాహిత్య సేవ మరువలేనిదని సంఘం అధ్యక్షులు పొన్నూరు వెంకట శ్రీనివాసులు అన్నారు. ఆయన 5వ వర్ధంతి సభ సంఘ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వృత్తిరీత్యా క్రిమినల్ లాయర్‌గా, ప్రవృత్తి రీత్యా సాహితీవేత్తగా జిల్లా ఖ్యాతిని రాష్ట్రస్థాయిలో ఇనుమడింపజేశారన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి యత్తపు కొండారెడ్డి మాట్లాడుతూ హనుమారెడ్డి జూనియర్స్ అనేకమందిని పిపిలుగా , ఏపీపీలుగా జడ్జిలుగా పదోన్నతులు పొందారని ఆయన సాహిత్యంపై అనేకమంది సాహితీవేత్తలు పిహెచ్‌డిలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ముస్లిం రచయితల సంఘం అధ్యక్షులు షేక్ మహబూబ్‌జాన్, ఆనందమయి సాహితీ సమితి ప్రధాన కార్యదర్శి అన్న విజయకుమారి, అక్కినేని కళాపరిషత్ అధ్యక్షులు కళ్ళగుంట కృష్ణయ్య, అన్నమయ్య సంగీత సేవా సమితి అధ్యక్షులు ఐ.మురళీకృష్ణ, సాహితీసుధ కనిగిరి ప్రధాన కార్యదర్శి పాలూరి శివప్రసాద్, అమృతవర్షిణి అధ్యక్షులు కె.ఎస్.వి.ప్రసాద్, అధ్యాత్మిక ఉపన్యాసకులు చిలకపాటి రంగారావు, రచయితల సంఘం సభ్యులు సయ్యద్ ఇస్మాయిల్, ఓరుగంటి ప్రసాద్, జానకిరామ్, హనుమారెడ్డి జూనియర్స్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన జవ్వాజి



**మార్కాపురం రూరల్, జనవరి 21 ప్రభాతవార్త**
మండలంలోని దరిమడుగు గ్రామంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పశువైద్యశిబిరాన్ని మండల పార్టీ అధ్యక్షులు జవ్వాజి రామానుజుల రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మార్కాపురం పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ బి చిన్న బాలునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలునాయక్ మాట్లాడుతూ గొర్రెలకు, మేకలకు, దూడలకు నట్టల నివారణ, గేదెలకు గర్భకోశవ్యాధులకు సంబంధిత వ్యాధులకు మందులను పశుపోషకులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గజ్జలకొండ పశువైద్యాధికారి వి అశోక్ కుమార్, ఇడుపూరు గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ ఆఫీసర్ పి అనిత, గోపాలమిత్ర వి సుబ్బారావు, యానిమల్ హస్బండ్రీ అసిస్టెంట్లు సాయితేజ, తేజశ్విని, అటెండర్ ఎస్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 50 సార్లు రక్తదానం చేయడం ఆదర్శనీయం

- జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు గయాజ్ భాషను సన్మానించిన ప్రజా సంఘాలు

**కనిగిరి, జనవరి 21, ప్రభాతవార్త**




రక్తదానం ప్రాణదానంతో సమానం అని రక్తదానం చేసి ఎంతో మందికి ప్రాణం పోసిన జనవిజ్ఞాన వేదిక జాతీయ ఉపాధ్యక్షుడు అందరికి ఆదర్శనీయమని ప్రజా సంఘాల నాయకులు కొనియాడారు. మంగళవారం కేటీసీ స్టడీ సర్కిల్లో గయాజ్ భాషకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక నాయకులు మాలకొండారెడ్డి, యూటీఎఫ్ సీనియర్ నాయకులు మేడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి ఎస్ఎఫ్ఐ కార్యకర్తగా అక్షర ప్రకాశంలో కళాకారుడిగా పని చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ 50 సార్లు రక్తం దానం చేయటం హర్షించే విషయం అని అన్నారు. జనవిజ్ఞాన వేదిక ద్వారా ప్రజలను విద్యార్థులను మూఢనమ్మకాల నుంచి చైతన్య పరుస్తూ అవగాహన కలిగించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా గయాజ్ భాషను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు పసుపులేటి అరుణ్, సయ్యద్ నాయబ్ రసూల్, పాపారాయుడు, ఫణీంద్ర, దూళిపాళ్ల మల్లిఖార్జున, సుధీర్ పాల్గొన్నారు.

## నేడు జీసీ అండ్ వైపీఎన్ డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా

**కనిగిరి, జనవరి 21, ప్రభాతవార్త**

కనిగిరి పట్టణంలోని జీసీ అండ్ వైపీఎల్ డిగ్రీ కళాశాలలో బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, జీసీ అండ్ వైపీఎన్ అండ్ డిగ్రీ కళాశాల సంయుక్తంగా ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందని కళాశాల డైరక్టర్ ఏలూరి సుబ్బారావు మంగళవారం తెలిపారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలైన జాయలుకాస్, భారత్ ఫైనాన్స్, అమర్ రాజా బ్యాటరీస్, ఎయిర్ టెల్ పేమెంట్స్, ఎస్‌బీఐ క్రెడిట్ కార్డ్స్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో పూర్తి చేసిన విద్యార్థులు 18 సంవత్సరాల నుంచి 28 సంవత్సరాల వరకు ఉన్న నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డైరక్టర్ ఏలూరు సుబ్బారావు వివరించారు. పూర్తి వివరాలకు స్కిల్ హబ్ కోఆర్డినేటర్ ఆర్.బెనర్జీ బాబుని 8008822821 సమాచారం కోసం తెలియజేయాలన్నారు.

## పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దు

**కనిగిరి, జనవరి 21, ప్రభాతవార్త**



కనిగిరి టౌన్‌లోని వివిధ ఆటో స్టాండ్లలోని ఆటో డ్రైవర్లకు జిల్లా ఎస్పీ, కనిగిరి డీఎస్పీ ఉత్తర్వుల మేరకు కనిగిరి సీఐ ఎస్‌కే ఖాజావలి, హెచ్ఎంపాడు ఎస్సై కే.మాధవరావు వివిధ సూచనలు చేశారు. పరిమితికి మించి ఆటోలలో ప్రయాణికులను ఎక్కించుకోరాదని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని సూచించారు.

## గోకులం షెడ్డును ప్రారంభించిన మండల టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి

**పామూరు, జనవరి 21, ప్రభాతవార్త**



పామూరులో నూతనంగా నిర్మించిన గోకులం షెడ్డును మండల టీడీపీ అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమ ద్వారా పశుపోషకులకు ఆర్థిక పరిపుష్టికి చేయూతలో భాగంగా గోకులం పశువుల షెడ్డుల నిర్మాణాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి బి.సురేష్, రాష్ట్ర టీడీపీ నాయకులు అడుసుమల్లి ప్రభాకరరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు మోరబోయిన హుస్సేన్‌రావు, ఎంపీటీసీ సభ్యులు బొల్లా నరసింహచౌదరి, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి డైరక్టర్ దేవరపు రమణమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జీ గుంటుపల్లి శ్రీను, కవులూరి హనీఫ్, రామకృష్ణ, చంటి, ఉపాధి హామీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు అత్యంత ఉపయోగకరంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం

**వేటపాలెం, జనవరి 21, ప్రభాతవార్త**



వేటపాలెం మండలంలోని దేశాయిపేట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ఖరీఫ్ పంటకు సంబంధించి కోతకు వచ్చినటువంటి ధాన్యాన్ని ప్రభుత్వం వారు అందించే మద్దతు ధరకు విక్రయించడానికి గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తేమ శాతాన్ని పరీక్ష చేయించుకుని వారికి అందుబాటులో ఉన్న మిల్లు దగ్గర నుండి గోనె సంచులు అందుబాటులో ఉంటాయని లేని యెడల రైతు సొంత ఖర్చులతో తెచ్చుకున్న ఎడల వారికి డబ్బులు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. అలాగే రబీ పంట వేసినటువంటి రైతులు తమ పంటను ఈ పంటలో నమోదు చేయించుకోవాలని తెలిపారు. అలాగే దేశాయిపేట గ్రామంలోని జగన్‌మోహన్‌రావు పొలం నందు పంట కోత ప్రయోగం నిర్వహించడం జరిగింది. చదరపు మీటరుకు పంట దిగుబడి 11.100 కేజీలు రావడం జరిగింది. దీనిని బట్టి ఒక ఎకరానికి దిగుబడిని అంచనా వేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ.కాశీ విశ్వనాథ్, ఏఈఓ జస్వంత్, గ్రామ వ్యవసాయ సహాయకులు మనీషా, కావ్య, రుఫియా, సరేనా, కుసుమ, టాటా ఇన్సూరెన్స్ కంపెనీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## గోకులం షెడ్డుని పరిశీలించిన ఉపాధి హామీ పథకం పీడీ గంగవరపు జోసఫ్ కుమార్

**ముండ్లమూరు, జనవరి 21, ప్రభాతవార్త**



మండలంలోని శంకరాపురం గ్రామంలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్‌ని మంగళవారం పరిశీలించిన ఉపాధి హామీ ప్రాజెక్టు పీడీ గంగవరపు జోసఫ్ కుమార్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకులం షెడ్ పనితీరు బాగుందని, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, గోకులం షెడ్‌ని పరిశీలించిన పీడీ సంతృప్తి వ్యక్తం చేశారు. అందరూ సహకరించాలని ఆయన అన్నారు. అందరు సహకరించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ ఆర్ లలిత కుమారి, ఎంపీడీఓ ఆర్.జనార్దన్, ఏపీవో నాగరాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ కూరపాటి మహేశ్వరి, నారాయణస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాగి, కొర్రలు జనవరి మాసంలో విత్తుకోవాలి

**తాళ్లూరు, జనవరి 21, ప్రభాతవార్త**

జనవరి మాసంలో రాగులు, కొర్రలు, విత్తుకోవచ్చని అధిక దిగుబడి నిచ్చే రకాలను ఎంపిక చేసుకుని విత్తన శుద్ధి చేసినట్లయితే మంచి దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. శివరాంపురం, మాధవరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులకు వేసవి రాగి, కొర్ర పంటను జనవరి మాసంలో విత్తుకోవచ్చని తెలిపారు. రాగిలో అధిక దిగుబడి నిచ్చే రకాలైన గోదావరి, శ్రీచైతన్య హేమ(తెల్లరాగి), సువర్ణముఖ, ఇంద్రావతి రకాలు, ఎంపిక చేసుకుని ఎకరాకు 4 కిలోలు వెదజల్లే పద్ధతిలో వాడుకోవాలని, కిలో విత్తనానికి 2 గ్రాముల కార్బండిజమ్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలని తెలిపారు. కొర్రలో అధిక దిగుబడినిచ్చే రకాలైన సూర్యనంది, మహానంది, రకాలను సాగు చేసుకోవాలని, ఎకరాకు 2 కిలోలు విత్తనం సరిపోతుందని, కిలో విత్తనానికి 2 గ్రాముల ట్రైసోక్లోజోల్ మందును కలిపి విత్తుకోవాలని తెలిపారు. దుక్కిలో ఎకరాకు 5 టన్నులు పశువుల ఎరువు వేసి కలియ దున్నాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ ఏటీఎం కే.రామిరెడ్డి, వీఏఏ ఎం.రాజు శేఖర్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.




## కట్టెల ట్రాక్టర్..మోటార్ సైకిల్ ఢీ

### - ఇద్దరు మృతి..ఒకరి పరిస్థితి విషమం

**కొండపి, ప్రభాతవార్త**









కట్టెల ట్రాక్టర్‌ను మోటార్‌సైకిల్‌ఢీ కొనడంతో ఇద్దరు మృతిచెందగా ఒకరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటన కొండపిలోని మద్దులూరు రోడ్డులో జేఎల్ కోల్డ్‌స్టోరేజ్ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం అద్దంకి మండలం శంకరాపురం గ్రామానికి చెందిన చిరంజీవి, అమీన్, దుర్గారావు అనే ముగ్గురు వ్యక్తులు మంగళవారం తన స్వగ్రామం నుంచి ద్విచక్రవాహనంపై జరుగుమల్లి మండలం కామేపల్లి పోలేరమ్మ తల్లి గుడి వద్దకు వచ్చి మద్యం త్రాగకుండా ఉండటానికి కంకణాలు కట్టించుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి ద్విచక్రవాహనంపై తిరుగు ప్రయాణంలో కొండపిలోని మద్దులూరు రోడ్డులో జెఎల్ కోల్డ్‌స్టోరేజ్ సమీపంలోకి రాగా అటువైపు నుంచి కొండపి మండలం మూగచింతల గ్రామానికి చెందిన కట్టెల ట్రాక్టర్ ముప్పవరం గ్రామంలో ఓ బ్యారన్ దగ్గర కట్టెలు పడవేయడానికి బయలు దేరి వస్తుంది.. ఈ వస్తున్న క్రమంలో స్టోరేజ్ వద్ద ద్విచక్రవాహనం కట్టెల ట్రాక్టర్ బలంగా ఢీకొట్టడం జరిగింది. అక్కడికక్కడే చిరంజీవి(40) మృతిచెందాడు. వాహనదారులు 108కు సమాచారం అందించారు. 108లో కొండపి వైద్యశాలకు మిగిలిన ఇద్దరు క్షతగాత్రులను తరలించి వైద్యచేస్తుండగా దుర్గారావు (35) మృతిచెందాడు. అమీన్ పరిస్థితి విషమంగా ఉండడంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కొండపి ఎస్ఐ ప్రేమ్‌కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

## మహతి బాలాజీకి తెలుగు కీర్తి జాతీయ పురస్కారం

**టంగుటూరు, జనవరి 21, ప్రభాతవార్త**



అంతర్జాతీయ ప్రామాణికత సంస్థ(ఐఎస్ఓ) గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో మహతి తన్నీరు బాలాజీకి తెలుగు కీర్తి జాతీయ పురస్కారాన్ని ప్రధానం చేశారు. మహతి సాహితి సంస్థను స్థాపించి పద్య కవిగా, సాహితీవేత్తగా, గాయకునిగా పలు భాష, సాహితీ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించిన టంగుటూరు మండల విద్యాధికారి, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్ జిల్లా కార్యదర్శి మహతి తన్నీరు బాలాజీకి ఈ పురస్కారం ప్రధానం చేశారు. కందుకూరులో మహతి సాహితి సాంస్కృతిక సంస్థను స్థాపించి బాలాజీ అనేక అష్టావధానాలు, కవి సమ్మేళనాలు, పద్య కవితా పోటీలు నిర్వహించడమే కాకుండా అనేక జాతీయ సదస్సుల్లో పరిశోధనా పత్రాలు సమర్పించారు. ప్రతి సంవత్సరం వారి తండ్రి పేరు మీద భాషా సేవ చేసే సాహితివేత్తలకు తన్నీరు కోటయ్య స్మారక జాతీయ పురస్కారాలు ప్రధానం చేస్తున్నారు. తెలుగు కీర్తి పురస్కారాన్ని అందుకున్న బాలాజీని జిల్లా విద్యాధికారి ఏ.కిరణ్ కుమార్, ఉప విద్యాధికారి ఏ.చంద్రమౌళీశ్వరరావు, డీసీఈబీ సెక్రటరీ మర్రి శ్రీనివాస్, ఒంగోలు ఎంఈఓ కిషోర్‌బాబు, ఎంఈఓలు చెంచు పున్నయ్య, వెంకారెడ్డి, నాగేంద్రవదన్, రామారావు, హరిబాబు, రమణయ్య, స్కౌట్స్ అండ్ గైడ్ అసోసియేషన్ కార్యవర్గం పి.వెంకటరావు, శేషారావు, హెబ్సిబా, పలువురు ఉపాధ్యాయులు బాలాజీని అభినందించారు.

## కొణిజేడు, కారుమంచిలో పొలం పిలుస్తోంది

**టంగుటూరు, జనవరి 21, ప్రభాతవార్త**



మండలంలోని కొణిజేడు, కారుమంచి గ్రామంలో వ్యవసాయాధికారి జి.స్వర్ణలత ఆధ్వర్యంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రబీ 2024-25 సీజన్‌కి ఈ పంట నమోదు చేస్తున్నామని, పంటలు సాగు చేసిన రైతులు తమ వివరాలు గ్రామ వ్యవసాయ సహాయకులకు ఇచ్చి ఈ పంటలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని రైతులకు తెలియజేశారు. గ్రామాల్లో సాగు చేసిన శనగ, పొగాకు పంట పొలాలను సందర్శించి ప్రస్తుత వర్షాల వలన శనగ పంట సాగు చేయడం ఆలస్యం అవుతున్న కారణంగా శనగ పంటకు తుప్పు తెగులు వచ్చే అవకాశం ఉన్నందున రైతులు తొలి దశ నుండి తెగులు ముందు హెక్సాకొనజోల్ 500 మి.లీ ఒక ఎకరానికి పిచికారి చేసుకున్న యెడల తుప్పు తెగులు రాకుండా నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు కే.సౌమ్య, ఉద్యాన సహాయకురాలు ఎన్.సాయి లక్ష్మి, విస్తరణ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలను అరికడదాం: ఎస్సై నాగమల్లేశ్వరరావు

**టంగుటూరు, జనవరి 21, ప్రభాతవార్త**



రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా వాహనదారులు, పోలీసు శాఖకు సహకరించాలని టంగుటూరు ఎస్సై వి.నాగమల్లేశ్వరరావు తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుతం పొగాకు సీజన్ జరుగున్నందున, మండల పరిధిలోని కూలీల భద్రతకు రైతులు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని ఆయా గ్రామాల రైతులకు కూలీలను ఉద్దేశించి కూలీల జీవితాలు చిన్నవని, పొట్టకూటి కోసం కాయకష్టం చేస్తున్నారని, వారికి భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని, రైతులు అందుకు సహకరించాలన్నారు. పొగాకు పండించే రైతులు పచ్చాకును కోత చేసి, బ్యారెన్‌లకు, ట్రాక్టర్ల మీద పొగాకుని తరలించడం జరుగుతుందని, అయితే ఆ క్రమంలో ట్రాక్టర్ల మీద ఎత్తుగా పొగాకును అధిక లోడు వేసుకొని తీసుకొని పోవడం, దానిమీద పచ్చాకు కూలీలను పరిమితికి మించి కొంత మంది డ్రైవర్లు ఎక్కించుకుని పోవడం సరికాదన్నారు. అంతే కాకుండా ట్రాక్టర్ యొక్క వెనుక భాగం రెండు వైపులా డోర్లు తెరిచి కూలీలను కూర్చోబెట్టుకుని పోతున్నారని, దీని వలన అనేక ప్రమాదాలు జరుగుతు న్నాయని అన్నారు. నిబంధనలు ఉల్లంఘించరాదని తెలియజేశారు.

## షర్మిలా నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం

**సంతనూతలపాడు, జనవరి 21, ప్రభాతవార్త**



రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మున్ముందు బలోపేతం కానున్నట్లు సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ పాలపర్తి విజేష్ రాజ్ వెల్లడించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా షర్మిలారెడ్డి బాధ్యతలు స్వీకరించి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆయన ఆమెకు అభినందనలు తెలిపారు. ప్రతిపక్ష పాత్రలో ఉన్న వైసీపీ రాష్ట్రంలో నిద్రా వస్థలో ఉన్నట్లు విజేష్ రాజ్ ఆరోపించారు. విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు హామీ ఇచ్చిన ప్రత్యేక హోదా సాధన కొరకు పోరాడుతున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలపై షర్మిలారెడ్డి పోరాడుతున్నట్లు ఆయన తెలిపారు. 2004, 2009 సంవత్సరాల్లో యూపీఏ ఒకటి, యూపీఏ రెండు ప్రభుత్వాలు ఏర్పాటులలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించినట్లు ఆయన పేర్కొన్నారు. వైఎస్ షర్మిలారెడ్డి నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ యూపీఏ 3 ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

## సబ్సిడీ యూనిట్లకు త్వరలో ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభిస్తాం

**సంతనూతలపాడు, జనవరి 21, ప్రభాతవార్త**

సంతనూతలపాడు మండలం బీసీ, ఈడబ్ల్యూఎస్ 2024-25 యాక్షన్ ప్లాన్‌కు సంబంధించి అర్హులైన లబ్ధిదారులు సబ్సిడీతో కూడిన ఆయా యూనిట్స్ పొందడానికి నెల 19వ తేదీలోపు దరఖాస్తులను దాఖలు చేసుకోవాలని తొలుత తెలిపి ఉన్నారు. కానీ ఓబీ ఎంఎంఎస్ పోర్టల్ అందుబాటులోకి రానందున వలన దరఖాస్తు కార్యక్రమం వాయిదా పడినట్లు సంతనూతలపాడు ఎంపీడీఓ డి.సురేష్‌బాబు తెలిపారు. త్వరలోనే సాంకేతిక కారణాలనుఅదిగమించి దరఖాస్తు తేదీని లబ్దిదారులకు తెలియపరుస్తామని ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. లబ్దిదారులు దీనిపై ఆందోళన చెందవద్దని తెలియజేశారు.

## దర్శి-4, బొట్లపాలెంలో పొలం పిలుస్తోంది

**దర్శి, జనవరి 21, ప్రభాతవార్త**



దర్శి మండలంలోని దర్శి-4, బొట్లపాలెం రైతు సేవా కేంద్రాల పరిధిలోని పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారి వి.బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులందరూ కూడా వ్యవసాయ శాఖ సేవలను వినియోగించుకోవాలని వ్యవసాయ శాఖ నందు అవలంభిస్తున్నటువంటి పథకాల గురించి అవగాహన కల్పించారు. అదే విధంగా ప్రతి, మంగళ, బుధవారాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం ద్వారా క్షేత్ర సందర్శన జరుగుతుందని పంటలపై ఆశించు చీడపీడలు, తెగుళ్ల గురించి క్షేత్ర ప్రదర్శన ద్వారా తెలియజేయడం జరుగుతుందని తెలియజేశారు. అదే విధంగా వ్యవసాయ శాఖ అవలంభిస్తున్న పంట నమోదు కార్యక్రమం ద్వారా పంట సాగు చేసినటువంటి రైతులందరూ కూడా పంట నమోదు చేయించుకోవాలని తద్వారా అనేక రకాల ఉపయోగాలు ఉన్నాయని, ప్రతి కూల పరిస్థితిల్లో పంట నష్టం వాటిల్లినప్పుడు అదే విధంగా పంటలకు ఇన్సూరెన్స్ వర్తించాలన్న రైతు పండించిన పంటలను మార్కెట్లో గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలన్న పంట నమోదు అవసరమని సూచించారు. ఈ రబీ పంట కాలంలో పొగాకు పంటకు ప్రత్యామ్నాయంగా రైతు సోదరులందరూ శనగ, ఇతర పంటలను సాగు చేయాలని సూచించారు. ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్నటువంటి డ్రిప్, స్ప్రింక్లర్లు రైతులు వినియోగించుకోవాలన్నారు. పంట మార్పిడి పద్ధతి అలాగే పప్పు దినుసు పంటలైన కంది, మినుము, పెసర సాగు చేయడం వలన నేలకు బలం చేకూరుతుందని తెలిపారు.

## ఆంధ్రప్రదేశ్- రీ సర్వే ప్రాజెక్టు వన్ మండల్- వన్ విలేజ్

**దర్శి, జనవరి 21, ప్రభాతవార్త**



దర్శి మండలం, బుక్కాపురం రెవెన్యూ గ్రామం నందు రీ సర్వే అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. బుక్కాపురం గ్రామం 488 పట్టాదారులు ఉండి, విస్తీర్ణం 1636.96 ఎకరాలు కలిగి ఉంది. ఇందులో భాగంగా ఆర్డీఓ కనిగిరి వారు, తహశీల్దార్ దర్శి వారు, సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామ అధికారులు, గ్రామ ప్రజలు ఇందులో పాల్గొన్నారు. అవగాహన సదస్సు నందు ఆర్డీఓ కనిగిరి వారు, తహశీల్దార్ దర్శి వారు రీ సర్వే విధి విధానాలు, రీ సర్వేపై అవగాహన కల్పించడం జరిగింది. సభలో మాట్లాడుతూ గ్రామ ప్రజల భాగస్వామ్యం ముఖ్య పాత్ర వహిస్తుందని తెలియజేశారు. తదుపరి సర్వే, రెవెన్యూ బృందంతో కలిసి భూకమతంను రీ సర్వే పద్ధతిలో కొలతలు జరపటమైంది.

## మొక్కజొన్నలో సామూహిక ప్రదర్శన క్షేత్రాల ఏర్పాటు

**ముండ్లమూరు, జనవరి 21, ప్రభాతవార్త**



ముండ్లమూరు మండలంలోని పోలవరం, ముండ్లమూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి ఎండీ ఫారుక్ మాట్లాడుతూ రబీలో పొగాకు పంటకు బదులుగా ప్రభుత్వం మొక్కజొన్న లేదా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడం జరుగుతుందని తెలియజేశారు. ప్రతి సంవత్సరం పొగాకు పంటను సాగు చేయటం వలన ఆ పొలాల్లో కలుపు సమస్య అధికం అవుతుందని, అందుకే మొక్కజొన్న వంటి పంటలతో మార్పిడి చేయాలని కోరారు. అందుకే ముండ్లమూరు, పోలవరం గ్రామాల్లో మొక్కజొన్న సాగు చేసిన ఎంపిక చేసుకున్న రైతులకు ప్రస్తుతం పంట స్థితిపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. పంట మొదటి దశలో వేప కషాయం పిచికారి తప్పకుండా చేయాలని తద్వారా మొదటి దశలోనే కత్తెర పురుగు ఉధృతి తగ్గించవచ్చని తెలియజేశారు. రెండవ, మూడవ దశలో లార్వాలను సమర్థవంతంగా నిర్మూలించుకోవచ్చని తెలిపారు. కత్తెర పురుగు ఉధృతి తగ్గించుటకు లార్వాలు చిన్న దశలో ఉన్నప్పుడు ఇమామెక్టిన్ బెంజోయేట్ లేదా స్పైనోటోరమ్ వంటి మందులను మార్చి పిచికారి చేయాలని కోరారు. మండల వ్యవసాయాధికారి మహమ్మద్ ఫారుక్. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు జి.ప్రదీప్, శోభారాణి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

## ఆచార్య ఎండ్లూరి సుధాకర్ 65వ జయంతి

### - 10వ తరగతి పరీక్షా మెటీరియల్ పంపిణీ

**దర్శి, జనవరి 21, ప్రభాతవార్త**



దళిత బహుజన కవి కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత కి.శే అచార్య ఎండ్లూరి సుధాకర్ జయంతి రాజంపల్లి ఫార్లి హైస్కూల్ నందు పాఠశాల హెచ్ఎం జే.నాగభూషణం అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఎకేవిఎస్ చారిటబుల్ ట్రస్టు అధినేత, బహుజన కవి అట్లూరి రామారావు 10వ తరగతి పరీక్షా మెటీరియల్ పుస్తకాలను 43 మందికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ ఆచార్య ఎండ్లూరి సుధాకర్ ప్రకాశం జిల్లా పామూరు మండలం రావిగుంటపల్లెలో జన్మించి హైదరాబాద్ కేంద్ర విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పని చేస్తూ తెలుగు విశ్వవిద్యాలయాల వీసీ మెంబర్‌గా హిందీ, ఉర్దూ కవితలు, ఉర్దూ పద్యాల లఘు చిత్రాల అనువాదకుడుగా ఎన్నో సేవలు అందించి కేంద్ర సాహిత్య అకాడమి వారిచే అవార్డు పొందిన అడవి కట్టెలు కొట్టుకుని పొట్ట నింపుకొనే కష్టజీవుల కథలను అనేక రూపాలలో 16 పుస్తకాలను రచించి 30 అవార్డులు, పురస్కారాలను పొందడం ప్రకాశం జిల్లా కే గర్వకారణమని ఆయన సేవలను కొనియాడారు. ప్రిన్సిపాల్ జి.ప్రసాద్ రావు మాట్లాడుతూ అనేక మంది ఉద్యమకారులు, కవులు, కళాకారులు ఉన్న ప్రకాశం జిల్లాలో కేంద్ర సాహిత్య అవార్డు ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జన్మించడం ఎంతో గర్వకారణమన్నారు.కార్యక్రమంలో న్యూఅలియాన్స్ ఫౌండేషన్ అధినేత కొడవటికంటి ప్రశాంత్,కళాశాల ట్రెజరర్ బి.పాల్‌సన్ పాల్గొన్నారు.

## సత్తా చాటిన శ్రీ చైతన్య విద్యార్థులు

**దర్శి, జనవరి 21, ప్రభాతవార్త**



పొదిలి రోడ్డు నందు ఉన్న శ్రీ చైతన్య విద్యార్థులు ఆల్ ఇండియా క్యాట్ నాలెడ్జ అసెస్మెంట్ టెస్ట్ ఒలంపియాడ్ పరీక్ష నందు క్యాష్ ప్రైజ్ పొందిన విద్యార్థులు - 5 మంది మెడల్, మెరిట్ సర్టిఫికేట్స్ పొందిన విద్యార్థులు 14 మంది మెరిట్ సర్టిఫికేట్స్ పొందిన విద్యార్థులు 18 మంది మొత్తం 37 మంది. వీరిని ప్రిన్సిపాల్ ఉదయశ్రీ అభినందించి ఇలాంటి టాలెంట్ టెస్టులలో పాల్గొని మరింత ప్రతిభను కనపరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం అంజయ్య, ఆర్ఐ అనిల్, కోఆర్డినేటర్ వీరాంజనేయులు, వైస్ ప్రిన్సిపాల్ ఖాదర్ భాషా, డీన్ రామచంద్ర పాల్గొన్నారు.

## రామచంద్రాపురంలో పశువైద్యశిబిరం

**దర్శి, జనవరి 21, ప్రభాతవార్త**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టినటువంటి పశు ఆరోగ్య శిబిరాలులో భాగంగా దర్శి మండలం రామచంద్రాపురం గ్రామ ప్రకాశం జిల్లా పశు సంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరక్టర్ డాక్టర్ ఏ.పురుషోత్తం రాజు ఆధ్వర్యంలో డాక్టర్ ఎం.బసవయ్య, పశుసంవర్ధకశాఖ సహాయకులు బి.ఆదిలక్ష్మి, కే.వెంకటేశ్వర్లు, జి.జోయల్, రాజు, దివ్య, అశ్విని, గ్రామంలోని పెద్దలు పాల్గొన్నారు. ఇందులో భాగంగా 32 పశువులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగింది. రైతులకు మినరల్ మిశ్రమం, నులి పురుగుల మందులు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మారెళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంతి ఉద్యోగి మృతి

**టంగుటూరు, జనవరి 21, ప్రభాతవార్త**



మండల కేంద్రమైన టంగుటూరులోని అరుంధతి నగర్‌కు చెందిన రిటైర్డ్ ఇండ్లూరి కొండయ్య పంతులు సతీమణి మార్తమ్మ మంగళవారం సాయంత్రం మరణించారు. కనుక విశ్రాంతి ఉద్యోగులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భూస్థాపన కార్యక్రమం నేడు జరుగుతదని కుటుంబ సభ్యులు తెలియజేశారు. ఆమె భౌతికకాయానికి పలువురు పూలమాల వేసి నివాళుర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు తెలియజేశారు.

22-1Pg5.qxd:22-1Pg5.qxd 01/01/01 8:02 AM Page 1



# 'డోజ్'కు వివేక్ రామస్వామి గుడ్‌బై

## ఆశాఖపై కోర్టుకు వెళ్లిన అమెరికా ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య



**వాషింగ్టన్, జనవరి 21:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కార్యవర్గం తొలిసారిగా ఏర్పాటు చేసిన డోజ్ (డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ)కి చట్టపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. ప్రమాణస్వీకారం ముగిసిన నిమిషాల్లోనే దానిపై తొలి దావా దాఖలైంది. అమెరికాలోని అతిపెద్ద ఉద్యోగ సంఘమైన ది అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్‌గవర్నమెంట్ ఎంప్లాయీస్ దీనిపై న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అసలు అటువంటి డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయడాన్నే ఈ పిటిషన్‌లో సవాల్ చేశారు. అది ఫెడరల్ అడ్వైజరీ కమిటీ చట్టపరమైన నిబంధనలు పూర్తి చేయలేదని పేర్కొంది. రోజువారీ అమెరికన్ల ప్రయోజనాల కోసం పనిచేయని వారి డోజీలో సభ్యులుగా ఉన్నారని దీనిలో ఆరోపించారు. వారు ప్రభుత్వ ఏజెన్సీల వ్యయనియంత్రణలను సూచిస్తుంటారని ఆ సంఘం పేర్కొంది. వాస్తవానికి ఫెడరల్ నిబంధనల ప్రకారం కమిషన్ లేదా టాస్క్‌ఫోర్సులను ఏర్పాటుచేసి, ప్రైవేటు రంగం నుంచిసూచనలు స్వీకరించవచ్చని గుర్తు చేసింది.

**డోజ్‌కు ఉద్యోగుల కేటాయింపు:** మరోవైపు డిపార్టమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్స్(డోజ్)ను ఏర్పాటు చేస్తూ అధ్య క్షుడు ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లను జారీ చేశారు. ప్రభుత్వ పనితీరును మెరుగుపర్చడం, ఫెడరల్ టెక్నాలజీ, సాఫ్ట్‌వేర్‌లను ఆధునీకరించడం వంటివి దీనిలో ఉన్నాయి. దీనికి మస్క్‌ను అధ్యక్షుడిగా అధికారికంగా ప్రకటించారు. డోజ్ సభ్యులను కూడా కేటాయించేలా ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ కార్యవర్గంలో కీలకమైన డోజ్ బాధ్యతల నుంచి భారతీయ అమెరికన్ వ్యాపారవేత్త వివేక్‌రామస్వామి వైదొలిగారు. ఒహాయో రాష్ట్ర గవర్నర్ ఎన్నికల్లో పోటీ చేయడానికి వివేక్ సమాయత్తమవుతున్నట్లు సంబంధిత వర్గాలు ఇటీవల వెల్లడించిన విషయం తెలిసిందే. ఒహాయో గవర్నర్ ఎన్నికలు నవంబరు 2026లో జరగ నున్నాయి. ఇటీవల జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్షఅభ్యర్థిగా అవకాశం కోసం రామస్వామి తీవ్రంగా ప్రయత్నించి విఫలమయ్యారు.

**అధ్యక్షుడిగా తొలిరోజే నలుగురిపై వేటు**
**వెయ్యి మంది అధికారులకు ట్రంప్ హెచ్చరిక**

అమెరికా అధ్యక్ష పదవి చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన కొన్ని గంటల్లోనే ప్రభుత్వంలోని నలుగురు సీనియర్ అధికారులపై వేటు వేశారు. మరో వెయ్యి మందిని ఉద్యోగాల నుంచి తీసివేస్తామంటూ ఆయన హెచ్చరించారు. అధ్యక్ష కార్యాలయం ప్రస్తుతం అధికారుల వడపోత పనులు చూస్తోందని ట్రూత్ సామాజిక మాధ్యమం ద్వారా ట్రంప్ వెల్లడించారు. 'అమెరికాను మళ్లీ గొప్పగా మార్చాలి. మా విధానానికి అనుగుణంగా లేనివారంతా విధుల్లో కొనసాగలేరు. అలాంటి వారిని గుర్తించే ప్రక్రియలో మా అధ్యక్ష కార్యాలయం ఉంది. మునుపటి అధ్యక్షుడి హయాంలో నియమితు లైనవారిలో అలాంటి వెయ్యిమందిని తొలగిస్తాం' అని నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు.

ప్రెసిడెంట్స్ కౌన్సిల్ ఆన్ స్పోర్ట్స్, ఫిట్‌నెస్ అండ్ న్యూట్రీషన్, నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అడ్వైజరీ కౌన్సిల్, ప్రెసిడెంట్ ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్‌కు సంబంధించి నలుగురు సీనియర్ అధికారులను ట్రంప్ తొలగించారు. వీరితోపాటు మరో వెయ్యి మందిని తొలగిస్తామంటూ హెచ్చరించారు. అంతకుముందు.. యుఎస్ కేపిటల్‌పై దాడి చేసిన తన మద్దతుదారులకు ఉపశమనం కల్పించారు. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా పౌరసత్వాన్ని అందించే చట్టాన్ని ట్రంప్ రద్దు చేశారు. వీటికి సంబంధించిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు కూడా జారీ చేశారు.

**నా కుమారుడు చాలా పొడగరి : ట్రంప్**

పలు కేసుల సుడిగుండాల్లో చిక్కుకొని దోషిగా తేలినా.. పట్టినపట్టు వదలకుండా డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టారు. ప్రమాణస్వీకారం చేసిన తర్వాత ట్రంప్ మాట్లాడుతూ ఈ విజయంలో తన కుమారుడు బారన్ ట్రంప్ పాత్ర కీలకమంటూ కొనియాడారు. 'నా కుమారుడు బారన్ ట్రంప్ చాలా పొడగరి. యువత ఎలా ఓటింగ్ చేస్తారో అతడికి బాగా తెలుసు. బారన్ సూచనలతో కొన్ని కార్యక్రమాలు నిర్వహించాం. యువత ఓట్లతో 36పాయింట్లు గెలిచాం' అంటూ ప్రశంసలు కురిపించారు.

# గల్ఫ్‌ఆఫ్ మెక్సికో ఇకపై గల్ఫ్ ఆఫ్ అమెరికా

## మెక్సికో వ్యతిరేకిస్తున్నా ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వు




**వాషింగ్టన్, జనవరి 21:** అందరూ ఊహించినట్లే ట్రంప్ తన సొంతకాల పరంపరను ప్రారంభించారు. గల్ఫ్ ఆఫ్‌మెక్సికో పేరును గల్ఫ్ ఆఫ్ అమెరికాగా మారుస్తూ ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులు జారీచేసారు. ట్రంప్ ఈ సందర్భంలో మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యుత్తమ శక్తిమంతమైన దేశంగా ఆస్థానాన్ని అది పొందిందని అన్నారు. జనవరిలో మార్ ఎలాగో ఎస్టేట్‌లో జరిగిన సభలో పాల్గొన్నపుడు తొలిసారి ప్రస్తావించిన ట్రంప్ ఇపుడు ఏకంగా ఉత్తర్వులే జారీ చేసారు. ప్రస్తుతం ఈప్రదేశాలను మాదకద్రవ్యాలు కంట్రోల్ చేస్తున్నాయని, ఈముఠాలు అమెరికా సరిహద్దుల్లోకి చొచ్చుకువస్తున్నాయని తాము ఈ ముఠాల ఆగడాలను కట్టడిచేస్తామని ప్రకటించారు. ఆరులక్షల చదరపు మైళ్ల సముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ మెక్సికోగా వ్యవహరిస్తారు. ప్రపంచంలోనే తొమ్మిదో అతిపెద్ద జలవనరు అది. తొలిసారి ఈపేరును 16వ శతాబ్దంలో స్పెయిన్‌కు చెందిన అన్వేషకులు వినియోగించారు. ఈక్రమంలో ట్రంప్ ప్రతిపా దనలను మెక్సికో తొలినుంచి వ్యతిరేకిస్తోంది. ఆదేశం అధినయక్షురాలు క్లాడియా షీన్‌బామ్ మాట్లాడుతూ 1607లో గల్ఫ్ ఆఫ్‌మెక్సికో పేరును వాడిన మ్యాప్‌లుచూపించారు. గతంలో కూడా అమెరి కాను గల్ఫ్ ఆఫ్ అమెరికాగా వ్యవహరించే వారన్నారు. మౌత్ ఆఫ్ రియో గ్రాండ్ అనే ప్రదేశంలో అమెరికా మెక్సికోల మధ్య సరిహ ద్దులు ప్రారంభం అవుతాయన్నారు. అమెరికా ఆర్థికవ్యవస్థకు ఈప్రదేశం అత్యంత కీలకమైనదని ఈ ప్రదేశంలో అమెరికాలో వినియోగించే సగానికిపైగా శుద్ధిచేసిన గ్యాస్ తయారీకేంద్రాలు న్నాయి. అమెరికాలో అమలు చేసే 40శాతం మత్స్యసంపద ఇక్కడే లభి స్తుంది. ఇక గ్రీన్ ల్యాండ్ కొనుగోలుపరంగా కూడా తమతోపాటు డెన్మార్క్ కలిసివస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు. ఆయన ఓవల్ ఆఫీసులో బాధ్యతలు చేపట్టిన తర్వాత మాట్లాడుతూ గ్రీన్‌ల్యాండ్ ఒక అద్భుతప్రదేశం అని అంతర్జాతీయ భద్రతకోసం ఇది అమెరికా అధీనంలో ఉండటం చాలా అవసరమన్నారు. ఈ క్రమంలో మాతో డెన్మార్క్ కలిసొస్తుందని కచ్చితంగా విశ్వసిస్తున్నట్లు ట్రంప్ అన్నారు. ఇప్పటికే ట్రంప్ బృందం ఒకపర్యాయం గ్రీన్‌ల్యాండ్‌కు వెళ్లి చర్చలు కూడా జరిపింది.

# ట్రంప్ కుటుంబమే వలసవాదుల మయం..

## తండ్రి హయాంనుంచే బీజాలు..ఇపుడు చట్టం వర్తిస్తుందా?



**వాషింగ్టన్, జనవరి 21:** అమెరికా 47వ అధ్యక్షుడుగా డొనాల్డ్‌ట్రంప్ బాధ్యతలు స్వీకరిస్తూనే జన్మతఃవచ్చిన పౌరసత్వంపై ఉక్కుపాదం మోపారు. శతాబ్దాల చరిత్ర ఉన్న ఈ చట్టాన్ని రద్దుచేస్తూ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీచేయడంతో అసలు ట్రంప్ కుటుంబమే వలసవాదుల కుటుంబం అన్న వాదన తెరపైకి వచ్చింది. రాజకీయవేత్తలు, ప్రైవేటు వ్యక్తులు, కుంభకోణాల చరిత్ర ఉన్న ట్రంప్‌ల కుటుంబంలో ఆధునిక రాజకీయ వంశవృక్షం అన్న విమర్శలు ఎదురవుతున్నాయి. ట్రంప్‌తండ్రి ఫ్రెడ్‌ట్రంప్ 1905-1999 వరకూ జీవించారు. ఆయన జర్మన్ వలసవాదులకు జన్మించారు. బ్రాంక్స్‌లో పుట్టిన ఫ్రెడ్ నిర్మాణ రంగంనుంచి రియల్‌ఎస్టేట్ టైకూన్‌గా ఫ్రెడ్ ట్రంప్ ఆర్గనేజేషన్‌ను క్వీన్స్‌లో పెంచారు. ఫ్రెడ్‌పైన అక్రమ లాభాలు, పన్నులమోసం, హౌసింగ్ విధానాల్లో వర్ణ వివక్ష, 1927 నాటి హౌసింగ్ చట్టాన్ని ఉల్లంఘించారన్న ఆరోపణలున్నాయి. కూ క్లక్స్‌క్లాన్ మార్చిలో పాల్గొన్నారని అరెస్టులు కూడా చేసారు. ఇక ట్రంప్ తల్లిమేరి మెక్‌లాయిడ్ ట్రంప్ 1912-2000 వరకూ ఉన్నారు. ఆమె స్కాటిష్ ఇమ్మిగ్రెంట్.లూయిస్ ద్వీపంలో జన్మించారు. అమెరికాకు 1930లో వచ్చి ఇంటి పనిమనిషిగా 50 డాలర్లకు పనులుచేసేవారు. ఆ తర్వా తఫ్రెడ్‌ను వివాహం చేసుకున్నారు. ఐదుగురు పిల్లలు జన్మించారు. మేరియాన్నే, ఫ్రెడ్ జూనియర్, ఎలిజబెత్ డొనాల్డ్, రాబర్ట్‌లు పుట్టారు. ట్రంప్ సోదరి మేరియాన్నే ట్రంప్ 1937నుంచి 2023 మధ్యలో జీవించారు. అమె ఫెడరల్ జడ్జిగా దశాబ్దాలపాటు పనిచేసారు. రీగన్, క్లింటన్‌ల హయాంలో కూడా ఉన్నారు. డొనాల్డ్ ట్రంప్‌ను వ్యతిరేకించేవారు. ఆమె సోదరి మేరిట్రంప్‌తో ప్రైవేటు చిట్‌చాట్‌లో ట్రంప్‌ను వ్యతిరేకించేవారు. ఇక ఫ్రెడ్‌కుమారుడు ఫ్రెడ్ జూనియర్ 1938 నుంచి 1981మధ్యకాలంలో పెరిగారు. కుటుంబ వ్యాపారం ముందు నిర్వహించేవారు. తాగుడుకు బానిస అయి కెరీర్ నాశనం చేసుకున్నారు. గుండెపోటుతో 42 ఏళ్లకే చనిపోయేంతవరకూ పైలట్‌గా కూడా పని చేసారు. ఫ్రెడ్‌జూనియర్‌కు ఇద్దరుపిల్లలు. మేరిట్రంప్, ఫ్రెడ్‌ట్రంప్-3, ఆ తర్వాత మేరి కుటుంబాన్ని తరచూ విమర్శిస్తూ మేరి వార్తల్లో నిలిచారు. ఇక ఫ్రెడ్‌ట్రంప్‌కు జన్మించిన ఎలిజెబెత్ ట్రంప్ గ్రావు 1942లో జన్మించారు. జెపిమోర్గాన్‌లో పనిచేసారు. డాక్యుమెంటరీ నిర్మాణం జేమ్స్ గ్రావ్‌ను పెళ్లాడారు. పామ్ బీచ్‌లో ఉంటారు. వారికి పిల్లలు లేరు. ఇక ట్రంప్‌సోదరుడు రాబర్ట్‌ట్రంప్ 148 నుంచి 2020వరకూ ఉన్నారు. డొనాల్డ్‌కు విధేయుడగా ఉండేవారు. ట్రంప్ సంస్థలోనే సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేసారు. పిల్లలు లేకపోవడంతో ఒకరిని దత్తత తీసుకున్నాడు. ఇక డొనాల్డ్ జాన్‌ట్రంప్ పరంగాచూస్తే ఆయన మొదటిభార్య ఇవానా ట్రంప్ 1949లో పెళ్లాడారు. చెక్ అమెరికా బిజినెస్ మహిళ ముగ్గురు పిల్లలున్నారు. 2022లో ఆమె చనిపోయారు. ఆమెకు డొనాల్డ్‌ట్రంప్ జూనియర్ ట్రంప్‌సంస్థలో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్నారు. ఇవాంక ట్రంప్ అధ్యక్షుడికి సీనియర్ సలహాదారుగా కూడాపనిచేసారు. జారేడ్ కుష్నర్‌ను పెళ్లాడారు. వారికి అరబెల్లా, జోసెఫ్, థియోడర్ అనే ముగ్గురుపిల్లలున్నారు. ఇక ఎరిక్‌ట్రంప్ ట్రంప్ సంస్థలోనే ఉపాధ్యక్షుడు. లారాట్రంప్‌ను పెళ్లాడి ఇద్దరుపిల్లలతో ఉన్నాడు. ఇక ట్రంప్ రెండోభార్య మార్లా మ్యాపిల్స్‌ను 1963లో పెళ్లాడాడు. ఆమె టెలివిజన్ పర్సనాలిటీ. ఒక కుమార్తె టిఫానీ ట్రంప్ జార్జిటౌన్ లా గ్రాడ్యుయేట్ నిరాడంబరంగానే ఉంటారు. ఇక ప్రస్తుత భార్య మెలానియా ట్రంప్ 1970లో ఆమెను వివాహమాడారు. సొల్వేనియన్ అమెరికా ప్రాంతానికి చెందిన ఆమె మాజీ మోడల్. వారికి బారన్ ట్రంప్ అనే కుమారుడున్నాడు.

# తాలిబన్లతో అమెరికా ఒప్పందం

## ఖాన్‌మహ్మాద్ విడుదలకు యుఎస్ ఓకే



**ఇస్లామాబాద్, జనవరి 21:** అమెరికాకు తాలిబన్లకు మధ్య ఖైదీల మార్పిడి ఒప్పందం కుదిరింది. అమెరికాలో ఖైదీగా ఉన్న ఆఫ్గన్ ఫైటర్ ఖాన్ మహ్మద్‌ను విడిపించుకోడానికి తమ వద్ద ఉన్న అమెరికా ఖైదీలను విడుదలచేస్తామని తాలిబన్‌ప్రభుత్వం తెలిపింది. రెండు దశాబ్దా ల క్రితం అరెస్టు అయిన ఆఫ్గన్ ఫైటర్ ఖాన్ మహ్మద్ ప్రస్తుతం కాలిఫోర్నియాలోని జైలులో జీవితఖైదు శిక్షలో ఉన్నాడు. ఖాన్‌ను తమకు అప్పగిస్తే తమ వద్ద ఉన్న ఇద్దరు అమెరికా ఖైదీలను విడుదల చేస్తామని విదేశాంగశాఖ ప్రకటించింది. యుఎస్‌తో తాము జరిపిన సుదీర్ఘచర్చల అనంతరం ఈసమస్య పరిష్కారం అయినట్లు తాలిబన్ అధికారులు తెలిపారు. ఖతార్‌మధ్యవర్తిత్వంతో ఈమార్పిడి ఒప్పందం కుదిరింది. ఇరుదేశాలమధ్య సాధారణ సంబంధాలస్థాయికి రావడానికి ఈచర్యలు దోహదంచేస్తున్నట్లు తెలిపారు. అమెరికా ఖైదీల్లో ఒకరయిన ర్యాన్‌కార్బెట్ కుటుంబం మీడియాతో మాట్లాడుతూ ర్యాన్ దూరం అయిన 894 రోజులు తమ జీవితంలో అత్యంత సవాళ్లతో కూడుకున్నవన్నారు. విదేశీపర్యటనలో ఉండగా తాలిబన్లు కిడ్నాప్‌చేసారని తిరిగి ఇన్నాళ్లకు తమకు అప్పగిస్తున్నందుకు అమెరికా ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నామన్నారు.

### తుర్కియే హోటల్‌లో అగ్నిప్రమాదం

## 69 మంది మృతి, మరో 51 మందికి తీవ్రగాయాలు

**అంకారా, జనవరి 21:** వాయవ్య టుర్కియేలో మంగళవారం ఒక హోటల్ రిసార్టులో జరిగిన అగ్నిప్రమాదంలో 69 మందివరకూ చనిపోయారు. తుర్కియే అంతర్గత వ్యవహారాల మంత్రి ప్రమాదం వివరాలను వెల్లడించారు. తాళ్లసాయంతో అతిథులు అక్కడినుంచి బయటపడాలని ప్రయత్నించారు. కిటికీలనుంచి బెడ్‌షీట్లు తాళ్ల మాదిరిగా వేలాడుతు కనిపించాయి. బయటపడేందుకు కొందరు దూకే ప్రయత్నంచేసి చనిపోయారు. అనేక మంది తుర్కియే మంత్రులు సంఘటన ప్రాంతానికి చేరుకుని రక్షణ చర్యలుప్రారంభించారు. దేశరాజ ధాని అంకారాకు వాయవ్యంగా 170 కిలోమీటర్ల దూరంలో ఉన్న కర్తల్‌కాయ రిసార్టులో ఈప్రమాదం జరిగింది. అంతర్గత వ్యవహారాల మంత్రి అలీ యెర్లికాయా మాట్లాడుతూ ప్రస్తుతం 66 మంది చనిపోయారని, 51 మంది తీవ్ర గాయాలపాలయినట్లు తెలిపారు. 12 అంతస్తుల్లో నిర్మించిన గ్రాంట్ కర్తాల్‌హోటల్‌లో ఈ ప్రమాదం తెల్లవారుజామున 3.27 గంటలకు జరిగింది. హోటల్‌ను ఎక్కువశాతం కలపతోనే నిర్మించారు. మొత్తం 238 మంది అతిథులు హోటల్‌లో ఉన్నట్లు తెలిపారు. రెండువారాలపాటు స్కూళ్లకు సెలవులు రావడంతో గెస్టులు



ఎక్కువమంది వచ్చినట్లు తేలింది. ప్రమాదానికి గల కారణాలు మాత్రం ఇప్పటికీ నిర్ధారణ కాలేదు. మంటలను అదుపుచేయడం ఒకదశలో అగ్నిమాపక సిబ్బందికి కూడా కష్టతరంగా మారింది. అయితే తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇప్పటికీ ఆ కార్యక్రమం కొనసాగుతూనే ఉందని మంత్రి వెల్లడించారు.



### నక్సల్స్‌లేని భారత్ దిశగా

## ఓ కీలక అడుగు

### కేంద్ర మంత్రి అమిత్‌షా

**న్యూఢిల్లీ, జనవరి 21:** చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దులో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా భద్రతా బలగాలు ఇప్పటికీ ఆపరేషన్ నిర్వహిస్తున్నాయి. దీనిపై తాజాగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. ఇది నక్సల్స్ లేని భారత్ దిశగా కీలక అడుగని వ్యాఖ్యానించారు. దేశంలో దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉందన్నారు. ఇది నక్సలిజానికి గట్టి ఎదురుదెబ్బ. మన భద్రతా బలగాలకు ఇది గొప్ప విజయం. నక్సల్స్‌లేని భారత్ దిశగా ఇది ఓ కీలక అడుగు. దేశంలో నక్సలిజం కొన ఊపిరితో ఉంది. సిఆర్‌పిఎఫ్, ఒడిశా, చత్తీస్‌గఢ్‌కు చెందిన బలగాలు ఈ జాయింట్ ఆపరేషన్‌లో భాగమయ్యాయి అని అమిత్ షా స్పందించారు. చత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు జిల్లాలైనా గరియాబంద్, నౌపాడలో జనవరి 19 రాత్రి నుంచి ఈ ప్రత్యేక ఆపరేషన్ జరుగుతోంది. పలుమార్లు జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇప్పటివరకు 20 మంది మావోయిస్టులు మృతి చెందారు. వారిలో కీలక నేతలు కూడా ఉన్నారు.

### ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి

# వైదొలగిన యుఎస్

## మా పూర్తి మద్దతు ఉంటుంది: చైనా కీలక ప్రకటన



**బీజింగ్, జనవరి 21:** ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) నుంచి వైదొలగాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించిన నేపథ్యంలో చైనా కీలక ప్రకటన చేసింది. యుఎస్‌వైదొలగినా డబ్ల్యుహెచ్‌ఒకు తమ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన తర్వాత అనూహ్య నిర్ణయాలు తీసుకున్న సంగతి తెలిసిందే. అందులో ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి అమెరికా వైదొలగడం కూడా ఉంది. కొవిడ్ వ్యాప్తి సమయంలో ఈ సంస్థ బాధ్యతారహిత్యంగా వ్యవహరించినందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ నేపథ్యంలో చైనా స్పందించింది.

డబ్ల్యుహెచ్‌ఒకు తమ మద్దతు కొనసాగుతుందని ప్రకటించింది. 'ప్రపంచ ఆరోగ్య సంస్థను మరింత బలోపేతం చేయాలి తప్ప బలహీన పరచకూడదు' అని చైనా విదేశాంగ శాఖ అధికారి ప్రతినిధి జియాకున్ పేర్కొన్నారు. డబ్ల్యుహెచ్ఒ కార్యకపాలకు చైనా సహకారం ఉంటుందన్నారు. ఆరోగ్యకర ప్రపం చం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తామన్నారు.

# ఇటు డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం.. అటు పుతిన్-జిన్‌పింగ్ వీడియో కాల్

## రష్యా విషయంలో స్వరం మార్చిన ట్రంప్

**మాస్కో, జనవరి 21:** అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేసిన సమయంలో అంతర్జాతీయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా ప్రత్యర్థి దేశాలైన చైనా, రష్యా అధినేతలు జిన్‌పింగ్-పుతిన్ ఆ సమయంలో వీడియో కాల్ మాట్లాడుకున్నారు. జిన్‌పింగ్‌ను 'డియర్ ఫ్రెండ్' అంటూ పిలిచిన పుతిన్ రెండు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత వృద్ధి చేసుకునే దిశగా చైనా అధ్యక్షుడితో చర్చలు జరిపారు. దీనికి సంబంధించిన వీడియోను రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ విడుదల చేసింది. చైనాను అమెరికా పెద్ద పోటీదారుగా భావిస్తుండగా రష్యాను ముప్పుగా పరిగణిస్తోంది. ప్రపంచంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఈ రెండు నిరంకుశ దేశాల నుంచి సవాలు ఎదుర్కొంటున్నాయని గతంలో మాజీ అధ్యక్షుడు జో బైడెన్ విమర్శలు చేశారు. ఇప్పుడు అగ్రదేశానికి కొత్త అధ్యక్షుడు వచ్చిన వేళ జిన్‌పింగ్, పుతిన్ వీడియో కాల్ మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది.



అమెరికా 47వ అధ్యక్షుడిగా సోమవారం ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. తర్వాత రష్యా విషయంలో ట్రంప్ చేసిన అసాధారణ వ్యాఖ్యలు రిపోర్టర్లను ఆశ్చర్యపర్చాయి. ఉక్రెయిన్ యుద్ధం విషయంలో పుతిన్‌ను తీవ్రస్థాయిలో విమర్శించారు. 'ఆయన ఒప్పందం చేసుకోవాలి. సంధి కుదుర్చుకోకుండా రష్యాను నాశనం చేస్తున్నాడని అనుకొంటున్నాను. రష్యా పెద్ద చిక్కుల్లో పడనుంది' అని విలేకర్లతో వ్యాఖ్యానించారు. గతంలో పుతిన్‌ను బాగా అభిమానించిన ట్రంప్‌లో మార్పు రావడం గమనార్హం.

### ఆర్జీకర్ వైద్యురాలి హత్యాచార కేసులో కీలక పరిణామం..

# మృతదేహంపై మహిళ డిఎన్‌ఎ ఆనవాళ్లు




**కోల్‌కతా, జనవరి 21:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన ఆర్జీకర్ ఆసుపత్రి వైద్యురాలిపై హత్యాచారం కేసులో దోషి సంజయ్‌రాయ్‌కి న్యాయస్థానం జీవితఖైదు విధించిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగా సెంట్రల్ ఫోరెన్సిక్ లాబోరేటరీ కోర్టుకు సమర్పించిన రిపోర్టులోని విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. మృతురాలి శరీరంపై ఓ మహిళ డిఎన్‌ఎ లభించినట్లు అందులో పేర్కొంది. జూనియర్ వైద్యురాలి అత్యాచార ఘటనలో దోషిగా తేలిన సంజయ్‌రాయ్ డిఎన్‌ఎ 100 శాతం మృతురాలి శరీరంపై కనుగొన్నారు. అదేవిధంగా అతికొద్ది స్థాయిలో ఓ మహిళ డిఎన్‌ఎ సైతం బయటపడింది. అయితే అది పొరపాటున ఈ డిఎన్‌ఎతో కలిసిందా లేక సదరు మహిళ కూడా నేరంలో భాగమైందా అనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. విచారణలో భాగంగా జూనియర్ వైద్యురాలి శవపరీక్ష వీడియోను పరిశీలించిన న్యాయమూర్తి పోస్టుమార్టం కోసం ఉపయోగించిన వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో స్టెరిలైజ్ చేయలేదని ఈ వీడియోను చూస్తే అర్థమవుతోంది. తగిన సదుపాయాలు లేని కారణంగా వైద్య సిబ్బంది తగిన ప్రోటోకాల్ పాటించలేదని తెలుస్తోంది. కానీ తప్పనిసరి పరిస్థితిలో వారు ఈ విధుల్ని నిర్వర్తించడం మినహా మరో మార్గం లేదు అని వ్యాఖ్యానించారు. ఈ నేరంలో మరికొందరి ప్రమేయం ఉందని జూనియర్ వైద్యురాలి తండ్రి గతంలో ఆరోపణలు చేశారు. తమ కూతురి గొంతుపై గాయాలున్నా స్వాబ్ సేకరించలేదని కేసు ఛేధించడానికి సిబిఐ ఎక్కువగా ప్రయత్నించడంలేదన్నారు. ఈ ఘటనలో నలుగురు పురుషులు, ఇద్దరు మహిళలు ఉన్నట్లుగా డిఎన్‌ఎరిపోర్టులో వెల్లడైందని అధికారులుతనకు తెలిపినట్లు ఆయన వెల్లడించారు.

# ఆసుపత్రినుంచి సైఫ్ డిశ్చార్జి

## మరో వారం రోజులపాటు విశ్రాంతి

**ముంబయి, జనవరి 21:** బాలివుడ్‌నటుడు సైఫ్ ఆలీఖాన్ ముంబయి లీలావతి ఆసుపత్రినుంచి డిశ్చార్జి అయ్యారు. ఆరురోజులపాటు ఆయన ఆసుపత్రిలో చికిత్స పొందినతర్వాత సమగ్ర పరీక్షలు జరిపిన వైద్యులు ఆయన్ను డిశ్చార్జి చేయవచ్చని సిఫారసులు చేసారు. భారత్‌లో అక్రమంగా ప్రవేశించిన బంగ్లాదేశీయుడు సైఫ్ ఆలీఖాన్ ఇంట్లోప్రవేశించి అలజడి సృష్టించిన నేపథ్యంలో ఖాన్‌కు నిందితుడికి జరిగిన పెనుగులాటలో సైఫ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ క్రమంలోనే నిందితుడు తన కత్తితో సైఫ్‌పై దాడిచేయడంతో 2.5 అంగుళాల కత్తిముక్క ఆయన వెన్నుభాగంలో నిలిచిపోయింది. దీనితో వెంటనే ఆయన్ను ముంబయి లీలావతికి తరలించి శస్త్రచికిత్సలుచేసి కత్తిముక్కను తొలగించారు. ఐసియులో కొన్నిరోజులు తర్వాత ప్రత్యేక వార్డులో మరికొన్నిరోజులు చికిత్సలు పొందిన తర్వాత సైఫ్‌ను మంగళవారం డిశ్చార్జిచేసారు. అయితే మరో వారం రోజులపాటు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని వైద్యులు



సూచించారు. అలాగే సందర్శకులు ఎవ్వరినీ కూడా అనుమతించవద్దని పదేపదే విశ్రాంతికి భంగం కలిగించుకోవద్దని కూడా సూచించారు. సైఫ్ డిశ్చార్జి సందర్భంగా లీలావతి ఆసుపత్రి, సైఫ్ నివాసం వద్ద భారీ బందోబస్తును ఏర్పాటుచేసారు. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు షరీఫుల్ ఇస్లామ్ షెహజాద్ అనే బంగ్లాదేశీయుడిని అరెస్టుచేసారు. భారత్‌లోకి రాగానే ఆతని పేరును బిజోయ్‌దాస్‌గా మార్చుకున్నాడు. బెంగాల్‌లో మరొకరి ఆధార్‌సాయంతో సిమ్‌కార్డుకొనుగోలుచేసి వినియోగించినట్లు తెలుస్తోంది. నిందితుడిని సైఫ్ నివాసం బాంద్రా నివాసానికి తీసుకుని వచ్చి సీన్‌రిక్రియేట్‌చేసారు.

# పంచాయతీ పోరుకు తుది ఓటర్ల జాబితా!



**శ్రీనగర్, జనవరి 21:** జమ్ముకాశ్మీర్ ఎన్నికల కమిషన్ పంచాయతీ ఎన్నికలకు ఓటర్ల జాబితాలను సవరించి తుదిజాబితాను ప్రకటించడంతో మొత్తం 70 లక్షల మంది అర్హులైన ఓటర్లు ఉన్నట్లు తేలింది. వీరంతా కూడా కేంద్రపాలితప్రాంత పంచాయతీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. ఈనెల ఒకటవ తేదీనే తుదివిడత జాబితాను ప్రకటించేందుకువీలుగా సవరణలను ఆమోదిం చింది. రివిజన్‌ను గత ఏడాది నవంబరు 11వ తేదీ నుంచే ప్రారంభించారు. మ ఒత్తం 3,41,072 మంది కొతనత ఓటర్లు వచ్చారు. వీటిలో 1,10,768మంది ఓటర్లను తొలగిం చారు. కొందరు మరణించడం లేదా వేరొకచోటికి బదలీకావడం వంటివి జరిగాయి. వీటితోపాటు 10,726మంది ఓటర్లు సవరణలుచేసుకోగా 31,180 మంది ఓటర్లు ఇతర పంచాయతీ హల్కాస్, వార్డులకు తరలిపోయినట్లు గుర్తించారు. తుదివిడతగా జాబితా మొత్తం 7000670 మంది ఉన్నట్లు తేలింది. వీరిలో 35,66,475మంది పురుషులు, 34,34,048 మంది మహిళలు ఉంటే 147 మందిట్రాన్స్ జెండర్లు కూడా ఉన్నారు. జనవరి ఒకటవ తేదీనాటికి 18 ఏళ్లునిండినవారికి తుది విడత ఓటర్లజాబితాలో చేర్చారు. 2023 అక్టోబరు నవంబరునెలల్లో జరగాల్సిన ఎన్నికలు వాయిదాపడుతూ వచ్చాయి. ఒబిసి రిజర్వేషన్లపరంగా తలెత్తిన వివాదంతో వాయిదాపడ్డాయి. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు కూడా అదేవిధంగా ఉన్నాయి. 2023 అక్టోబరునవంబరునెలల్లోనే మున్సిపాలిటీల కాలపరిమితి ముగిసింది. పంచాయతీలు ఐదేళ్ల కాలపరిమితి 2024 జనవరితో ముగిసింది. ఇక బిడిసిలు కూడా ఐదేళ్ల కాలపరిమితి ముగియడంతో వాటికి సైతం ఎన్నికలు జరగలేదు. జస్టిస్ జనక్‌రాజ్ కోత్వాల్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కమిటీలో రిటైర్డ్ ఐఎఎస్ రాజ్‌కుమార్ భగత్, ఎస్‌కౌస్త్ మాజీ ప్రొఫెసర్ మొహిందర్‌సింగ్ భద్వాల్‌లు పనిచేస్తున్నారు. ఈ కమిషన్ నివేదిక ఆధారంగానే ఇపుడు ఎన్నికల రిజర్వేషన్లు కూడా పూర్తిచేస్తామని ఎన్నికల అధికారులు చెపుతున్నారు.

22-1Pg6exHMNWJQE.qxd:22-1Pg6exHMNWJQE.qxd 01/01/01 9:22 AM Page 1



# రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే సిఎం లక్ష్యాన్ని చేరుకుంటాం

## - ఇరవై సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్



**సచివాలయం,జనవరి 21,ప్రభాతవార్త :** అత్తలూరు ఆర్గానిక్ ఫార్మింగ్ ఎఫ్‌పిఒ సంస్థకు సంబంధించిన కార్యకలాపాలను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని, రాష్ట్రంలో ఆర్గానిక్ ఫార్మింగ్ ప్రోత్సహించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి నివేదిక సమర్పించనున్నట్లు 20సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ తెలిపారు. ఆయన నేతృత్వంలో ఆర్గానిక్ ఫారి ్మంగ్ సర్టిఫికేషన్ ఆథార్టి చైర ్మన్ శేవల దత్తు, అత ్తలూరి ఆర్గానిక్ ఫార్మింగ్ ఎఫ్‌పిఒ వ్యవస్థాపకులు నూతలపాటి సురేంద్ర, ఆరా ్గనిక్ ఫార్మింగ్ నిపుణులు శరత్‌కుమార్‌రెడ్డి పెద్దకూరపాడు నియోజకవర్గం అత్తలూరులోని అత్తలూరు ఆర్గానిక్ ఫారి ్మంగ్ ఎఫ్‌ఫిఒ సంస్థ సంబంధించిన కార్యకలాపాలను క్షేత్రసా ్థయిలో పరిశీలించడం జరిగిందని సచివాలయంలో ఏర్పాటుచేసిన పత్రికా సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి చుట్టు 75లక్షల మొక్కలు పెంపకం కోసం రైతుల భాగస్వామ్యం చేసేందుకే కార్యచరణ చేయనున్నామని, అత్తలూరు ఆర్గానిక్ ఫార్మింగ్‌ను ఆదర్శంగా తీసుకొని భవిష్యత్తులో ఆర్గానిక్ ఫార్మింగ్ పై రైతులను ప్రోత్సహించే విధంగా కార్యాచరణ చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉన్నత విద్యావంతులు పీఎం సూర్యాఘర్ పై ప్రజల్లో అవగాహన కలి ్పస్తున్నారని పిఎం సూర్యఘర్ ద్వారా విద్యుత్ చార్జీలు గతంలోరూ.1500–2000 ఉంటే ఇప్పుడు సూర్యాఘర్ వినియోగం ద్వారా రూ.300–400చార్జీలు పరిమిత ం అయ్యాయని అక్కడి యువత తెలిపారని పేర్కొన్నారు. విజయనగరం జిల్లాలో త్వరలోనే అక్కడి ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో వ్యవసాయా ధికారులు సమక్షంలో పైలెట్ ప్రాజెక్టుగా ఆరా ్గనిక్ ఫారి ్మంగ్‌కి సంబంధించినటువంటి కార్యాచరణకు శ్రీకారం చుట్టనున్నామని తెలిపారు. రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రీయ పంటలు పండించేందుకు ప్రోత్సాహం దిశగా రైతులకు కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఆర్గానిక్ ఫార్మింగ్ సర్టిఫికేషన్ ఆథార్టి చైర ్మన్ శేవల దత్తు తెలిపారు. అత్తలూరులో సేంద్రీయ పంటలు పండించి వాటి ద్వారా పచ్చళ్ళు, కారం నూనె మొదలగు వాటిని అక్కడి రైతుల ఉత ్పత్తి చేస్తున్నారని 200పైచిలుకు ఆవులతోగోశాల్లో పాల ఉత్పత్తి చేస్తున్నారని బాగా డిమాండ్ ఉండడంతోఅక్కడ సగటు మూడు లీటర్ల అవసరం ఉంటే 1లీటర్‌మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని తద్వారా నాణ్యమైన ఉత్పత్తులకు ఉన్న డిమాండ్ అందరూ గమనించాలన ్నారు. రానున్న కాలంలో ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చాలనే సిఎం ఆలోచనను నిజం చేసే దిశగా అడుగులు వేస్తున్నామని ప్రతి పంటను ప్రకృతి వ్యవసాయంవైపు మల్లిస్తామని 100శాతం ఆర్గానిక్ దృవీకరణ పంటల ఉత్పత్తి దిశగా సేంద్రీయ ఉత్పత్తులపై సమగ్ర నివేదిక ఇవ్వనున్నట్లు తద్వారా ప్రకృతి వ్యవసాయం ద్వారా గ్లోబల్ వార్మింగ్ అరికట్టవచ్చని తెలిపారు.

# గందరగోళంలో సామాన్యభక్తులు!



## - ఆఫ్‌లైన్‌లో ఎస్ఎస్‌డి టోకెన్ల నిలుపుదలతో అయోమయం

## - ఇప్పటికే సాధారణ సర్వదర్శనంలో భారీగా భక్తులు

**తిరుమల,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం, వడ్డీకాసులవేంకటేశ్వర స్వామి దర్శనంకోసం దేశంనలుమూలల నుండి వస్తున్న సామాన్యభక్తులకు తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో జారీచేసే ఉచిత సర్వదర్శన టోకెన్లు టిటిడి నిలుపుదలచేసింది. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఉన్నఫళంగా మంగళవారం ఉదయం ఈ టోకెన్లు జారీచేయాల్సి ఉన్నా అన్ని కౌంటర్లలో తాత్కాలికంగా నిలుపుదలచేశారు. దీంతో దర్శనం టోకెన్లకోసం తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణునివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్ వద్ద భక్తులు బారులుతీరి నిలబడ్డారు. అయితే టోకెన్లు ఎందుకు రద్దుచేశారు, జారీ చేయక పోవడానికి కారణాలను మాత్రం టిటిడి అధికారులు వెల్లడించలేదు. పైగా సామాన్యభక్తులు తక్కువ సంఖ్యలోనే దర్శన టోకెన్లకోసం నిరీక్షించడం కనిపించింది. ఈనెల 10వతేదీ నుండి 19వతేదీ వరకు పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలకు సంబంధించి రోజువారీగా 43వేలవరకు ఉచిత టైమ్‌స్లాట్ టోకెన్లను టిటిడి జారీచేయడం, అందుకున్న భక్తులు ప్రశాంతంగా వైకుంఠద్వార దర్శనాలు చేసుకున్న విషయం విదితమే. కాగా సోమవారం వేకువజామున నుండి సాధారణ సర్వదర్శనంలో భక్తులను తిరుమలలోని వైకుంఠమ్–2 క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లలోనికి అనుమతించడంతో పూర్తిగా 32కంపార్టుమెంట్లు నిండిపోయాయి. ఉన్న భక్తులకు వరుసక్రమంలో కంపార్టుమెంట్ల నుండి భక్తులను దర్శనానికి వదిలిపెట్టారు. ఇలా సోమవారం అర్ధరాత్రి వరకు 83,806మంది భక్తులకు మహాలఘులోనే ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనం చేయించారు. ఎటువంటి టోకెన్లు లేకుండా, విఐపి బ్రేక్ సిఫార్సు దర్శనాలు రద్దుచేయడంతో సామాన్యభక్తులకే ప్రాధాన్యతనివ్వడంతో 83వేలమందికి దర్శనం చేయించే వెసలుబాటు కలిగింది. దీన్ని ప్రాతిపదికంగా తీసుకున్న టిటిడి తిరుమలలో భక్తుల రద్దీని మరింతగా క్రమబద్దీకరించేలా మంగళవారం తాత్కాలికంగా ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని నిలుపుదలచేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయమై సంబంధిత ఐటి విభాగం అధికారులను, ఆలయ వర్గాలను కలసి అడిగినా సమాధానం మాత్రం రాలేదు. అధికారుల ఆదేశాలతో టోకెన్లజారీని నిలుపుదలచేశామని మాత్రం చెప్పారు. ఇదిలా ఉండగా పదిరోజుల వైకుంఠద్వారదర్శనమ్ టైమ్‌స్లాట్ టోకెన్లు జారీకి తొలిరోజు తిరుపతిలో తొక్కిసలాట జరగడం, ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం తెలిసిందే. ఈ నేపథ్యంలో క్షతగాత్రులైన భక్తుల నుండి తీసుకున్న అభిప్రాయంతో సాధారణ సర్వదర్శనంలో నేరుగా వైకుంఠమ్ 2లోకి అనుమతించి రద్దీ లేకుంటే నాలుగుగంటల్లో దేవుని దర్శనమ్ చేయించనున్నారనేది ప్రధానమైన సమాచారం.

రద్దీపెరిగితే కంపార్టుమెంట్లలోనికి అనుమతించి తిరిగి యాక్సిస్ కార్డులు ప్రవేశపెట్టి ఆ సమయానికి భక్తులు చేరుకుంటే క్యూలైన్లలోనుండి ఆలయంలోనికి అనుమతించేలా కూడా యోచనచేస్తున్నారు.

మొత్తంమీద తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో సాధారణరోజుల్లో 20వేల టోకెన్లు, వారాంతం శని, ఆదివారాల్లో 25వేల టోకెన్లు జారీచేసే విధానంలో కొంతమార్పు తీసుకురానున్నారనేది తెలుస్తోంది.

# తిరుపతి బిజెపి అధ్యక్షుడుగా న్యాయవాది శ్రీనివాస్



**తిరుపతి, జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిజిల్లా బిజెపి నూతన అధ్యక్షుడుగా సీనియర్ న్యాయవాది, ఆ పార్టీ అధికార ప్రతినిధి సామంచి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం ఉదయం తిరుపతిలో జరిగిన బిజెపి తిరుపతి జిల్లా విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కలసి సామంచి నాయకత్వాన్ని బలపరిచారు. పైగా పార్టీకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడమేగాక పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా ఆయన తనవంతుగా కృషి చేస్తున్నారు. ఇప్పటికే ఆయనకు తిరుపతి జిల్లాలో సామాజిక వర్గం పూర్తిమద్దతుగా వుంది. బిజెపిలోని అన్ని వర్గాల నాయకులు, కార్యకర్తలు అండగా నిలబడుతున్నారు. తనపై ఉంచిన బాధ్యతను ,నమ్మకాన్ని పూర్తిస్థాయిలో కాపాడుతానని, ప్రజలతో కలసి పనిచేయడమే తనముందున్న కర్తవ్యమని సామంచి శ్రీనివాస్ అన్నారు. ఇదివరకు తిరుపతి జిల్లా అధ్యక్షుడుగా కొనసాగిన శ్రీకాళహస్తిప్రాంతవాసి చంద్రప్ప పార్టీలో నామమాత్రంగానే మిగిలిపోయారనే నైరాశ్యం ఉంది.

# మధుమూర్తిని మాయచేసేందుకు దందాకు తెరలేపిన బిఎడ్ కళాశాలల యాజమాన్యాలు

## - కూటమి ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకోవాలి

**ఒంగోలు, ప్రభాతవార్త** ఆయన నిజాయితీ, నిబద్దత, పట్టుదలగా పని చేసే అధికారి. నీతి నిజాయితీలకు నిలువుటద్దంలాగా ఆయన గురించి తెలిసిన వాళ్ళు ఘనంగా చెప్పుకుంటూ ఉంటారు. రాజకీయ నాయకుల మౌఖిక ఆదేశాల కంటే ప్రభుత్వ నిబంధనలు ఆయనకు మార్గదర్శకం. తనకు ఏ బాధ్యత అప్పగించినా ఆ పనిలో నిమగ్నమై నిబంధనల ప్రకారం నడుచుకుంటూ నిర్ణీత కాల వ్యవధిలో ప్రభుత్వం సూచించిన విధంగా పనులు వేగవంతంగా జరిగేందుకు కృషి చేయడమే ఆయనకు తెలిసిన విద్య. గడిచిన పదేళ్ల కాలంలో అప్పట్లో పని చేసిన ప్రభుత్వ అధికారులు ప్రభుత్వం పెత్తందారులు పనితీరు కారణంగా ప్రభుత్వ ప్రతిష్ఠతకు మచ్చ తెచ్చిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలిని గాడిలో పెట్టేందుకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేష్ తదితరులు ఏరికోరి తెచ్చుకున్న ఉన్నత విద్యావంతులు నీతివంతమైన పాలనను అందించడంతో పాటు నిర్దేశించిన పనులను సమర్థవంతంగా పూర్తి చేయడంలో ఘనపాటిగా పేరు గాంచిన ప్రస్తుత మధుమూర్తిని ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమించడం జరిగింది. ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన వ్యక్తి అయినప్పటికి ఆయన విధి నిర్వహణలో భాగంగా ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వరి నందు ఐఐటీ నందు ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మూడేళ్ల పాటు ఏపీ ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా పని చేసేందుకు డిప్యూటేషన్‌పై రావడం జరిగింది. ఇంత వరకు భాగానే ఉంది. ఎలాంటి అధికారి ఉన్నత విద్యామండలికి చైర్మన్‌గా వచ్చిన సదరు అధికారిణి మనసు చేతను, మాయ చేతను అవేమి పనిచేయకపోతే పనిచేతనో లోబపర్చుకుని తాము చేయాలనుకున్న పనులన్ని ఉన్నత విద్యామండలి కేంద్రంగా ఎడ్యుకేషన్ మాఫియాను నిర్వహించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో బీఎడ్ కళాశాలల యాజమాన్యాలు రాడ్ తేలి ఉన్నాయని చెప్పడంలో అతిశయోక్తి లేదు. 2014- 2019 సంవత్సర కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పటికి అప్పటి రాష్ట్ర విద్యాశాఖలో పలువురు పెద్దలు ఏపీ ఉన్నత విద్య మండలి అధికారులను మాయచేసిన బీఎడ్ కళాశాలల యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరించి బీఎడ్ అడ్మిషన్ల నిబంధనలకు నీళ్ల వదిలి తమకు నచ్చినట్లుగా ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఆ తరువాత 2019–2024 కాలంలో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో నేరుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యామండలిని బీఎడ్ కళాశాలల యాజమాన్యాలు శాసించాయి. అక్కడ పని చేస్తున్న అధికారులను గుప్పిట్లో పెట్టుకుని ఎన్ని రకాల దందాలు చేయాలో అన్ని విధాలుగా చేసినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మారిన తరువాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలికి చెందిన కొన్ని ఫైళ్ళను కృష్ణానది కరకట్ట వద్ద తగలబెట్టారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. అందులో సగానికి పైగా బీఎడ్ కళాశాలలకు చెందిన ఫైల్స్ ఉన్నాయన్నది అప్పట్లో పలు ఆరోపణలు వచ్చాయి.

# మాజీ మంత్రి పరిటాల రవీంద్ర వర్ధంతికి భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్‌లు

**అనంతపురం, జనవరి 21 ప్రభాతవార్త బ్యూరో** .తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 20వ వర్ధంతికి రామగిరి మండలం వెంకటాపురంలో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. పరిటాల రవి మరణించి 20 ఏళ్లు గడిచిన నేపథ్యంలో, ఈ సారి వర్ధంతి కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. గత నాలుగు రోజుల నుంచి ఏర్పాట్లు జరుగుతున్నాయి. అనంతపురం జిల్లాతోపాటు వివిధ ప్రాంతాల నుంచి భారీగా పరిటాల అభిమానులు, టిడిపి కార్యకర్తలు తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పరిటాల రవీంద్ర సతీమణి, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఘాట్ వద్ద అలంకరణలు జరుగుతున్నాయి. మరోవైపు వేలాది మందికి జరిగే అన్నదానం సంబంధించి ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

# నివేదిక సిద్ధమైతే ఇంకొందరిపై చర్యలు

## - 8న బందోబస్తు - పోలీసులపై వేటు తప్పేలాలేదు!

**తిరుపతి,జనవరి 21ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల ఆలయంలో పదిరోజుల వైకుంఠద్వారదర్శనాలు ముగియడంతో...ఉచిత దర్శనాలకోసం సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేసిన ఈనెల 8వతేదీ రాత్రి తిరుపతిలో చోటుచేసుకున్న పరిణామాలపై నివేదికలు సిద్ధమవుతోంది. ముందస్తు ప్రణాళిక లేకుండా ఉన్నఫళంగా భక్తులను క్యూలైన్లలో అనుమతించే విషయంలో ఆయా చోట్ల విధుల్లో ఉన్న కొందరు పోలీసు, టిటిడి అధికారులు నిర్లక్ష్యంతోనే ఈ ఘటన జరిగిందనేది ప్రాథమిక విచారణలోనే తేల్చారు. దీనిపై 9వతేదీ తిరుపతికి చేరుకున్న సిఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, వైసిపి అధినేత వైఎస్‌జగన్ కూడా తీవ్రస్థాయిలో విచారం వ్యక్తం చేసిన విషయం విదితమే. వేలసంఖ్యలో భక్తులు పలు చోట్ల టోకెన్ జారీచేసే కేంద్రాల వద్ద గుమికూడటం, ఒకటిరెండుచోట్ల కౌంటర్లకు దూరంగా ఖాళీస్థలాల్లో భక్తులను ఉంచడం జరిగింది. వీరందరినీ నియంత్రించి వరుసక్రమంలో పంపే విషయంలో పోలీసులు, టిటిడి సిబ్బంది అజాగ్రత్తగా వ్యవహరించడమే ప్రధాన కారణంగా తేల్చారు. దర్శన టోకెన్లు కోసం వచ్చి ఒకేసారి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పవడం సంచలనం కలిగించింది. 50మందివరకు క్షతగాత్రులవడం జరిగింది. బాధితులందరికీ టిటిడి నగదు పరిహారం చెల్లించినా ,పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు ముగియడంతో టిటిడి చరిత్రలో ఇదివరకు జరగని అనూహ్య విషాదఘటనలతో దేశం మొత్తం కలతచెందింది. దేశం నలుమూలల నుండి విచ్చేసిన వేలాదిమంది భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో టిటిడి యంత్రాంగం, జిల్లా అధికారగణం విఫలమైందనేది భక్తుల్లో వినిపించిన నిరసనలు. ఈ కారణంగానే సొమ్మసిల్లి భక్తులు క్రిందపడిపోతే తొక్కిసలాట జరిగిందనేది కూడా భక్తుల్లోనే వినిపించిన వాదనలు. ఈ నేపథ్యంలో ఈనెల 8వతేదీ రాత్రి తిరుపతిలోని బైరాగిపట్టెడ రామానాయుడు పాఠశాల ప్రాంగణం, శ్రీనివాసం, విష్ణునివాసం ప్రాంగణాల్లో జరిగిన తప్పిదాలతో భారీ చెడ్డపేరును టిటిడి మూటగట్టుకునే పరిస్థితి వచ్చింది. ఈ ఘటనపై ఉన్నఫళంగా ఒక్కరోజులోనే టిటిడి జేఈఓ గౌతమి. సివిఎస్ఓ శ్రీధర్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడును ఆయా స్థానాల నుండి తప్పించారు. తిరుపతి క్రైమ్ డిఎస్పీ రమణకుమార్, టిటిడి గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాధరెడ్డిలపై సస్పెన్షన్ వేటువేశారు. ఇంకా తాజాగా తిరుపతి టౌన్ డిఎస్పీ జె.వెంకటనారాయణ పనితీరు, ఒకింత పర్యవేక్షణ కూడా సరిగా లేకపోవడం ఒకింత కారణమని భావించినట్లు చెప్పారు.

# దుర్గమ్మకు హుండీలో రూ.3కోట్ల కానుకలు



ముఖ్యమంత్రి కార్యదర్శి ఎవి రాజమౌళికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, జనవరి 21, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం లెకి ్కంచగా రు.3,22,45,920ల నగదు, బంగారం 618 గ్రాములు, వెండి 6కెజిల 28 గ్రాములు, విదేశీ కరెన్సీ యుఎస్ఎ డాలర్లు 773 , ఆస్ట్రేలియా డాలర్లు 125 డాలర్లు, సౌదీ రియాల్స్ 30, యూరోలు 5, యుఎఇ దిర్హామ్స్ 35, కెనడా డాలర్లు 205, సింగపూరు డాలర్లు 14, మలేషియా రింగెట్లు 93, థాయిలండ్ 120 భాట్, ఇంగ్లాండ్ 15 పౌండ్లు, స్కాట్లాండ్ 10 పౌండ్లు, న్యూజిలాండ్ 10 డాలర్లు, హాంకాంగ్ 10 డాలర్లు, ఖతర్ 50 రియాల్‌లు, ఒమన్‌లు 400 బైసా, కువైట్ 0.5దినార్‌లు లెక్కించినట్లు ఇఒ కె రామచంద్ర మోహన్ తెలిపారు . ఇఒ, డిప్యూటి ఇఒ ఎం రత్నరాజు పర్యవేక్షణలో జరిగిన ఈ లెకి ్కంపుల్లో అమ్మవారి సేవాదారులు, ఏఇఓలు, ఎండోమెంట్ అధికారులు, ఎస్‌పిఎఫ్, ఒన్‌టౌన్ పోలీస్ పాల్గొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఈ హుండీల ద్వారా డిసెంబర్ 31 నుండి జనవరి 20 వరకు రు.1,13,084లు లభించాయని ఇఒ తెలిపారు. దుర్గమ్మను మంగళవారం సిఎం కార్యదర్శి ఏవి రాజమౌళి దంపతులు దర్శించుకున్నారు. వారికి దుర్గమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రంలను ఇఒ కె రామచంద్రమోహన్ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనం పలికారు .

# శివరాత్రి సాంస్కృతిక కళావేదిక రూపకల్పన

**శ్రీకాళహస్తి,జనవరి 21 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన వాయులింగేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబులు యుద్ధ ప్రాతిపదికపై చక చకా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజగోపురం పక్కనే ఏర్పాటు చేయనున్న ధూర్జటి కళాప్రాంగణం వేదిక రూపకల్పనకు సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది ఇక్కడ వేదిక స్క్రీన్‌ను రూ.7లక్షలతో రూపకల్పన చేసారు. ఈ ఏడాది గతం కన్నా భిన్నంగా రూపొందించుటకు పనులు అప్పగించారు. పానగల్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలోని ప్రతాప్ అనే యువకుడు కళావేదికను రూపకల్పన చేసారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో కీలక కార్యక్రమాలు సాంస్కృతిక కార్యక్రమాలు. గతంలో సన్నిధివీధిలోని ప్రస్తుత కార్‌పార్కింగ్ వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసే వారు. కానీ భక్తులకు అందుబాటులో స్థానికులు సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు వీలుగా కళావేదిక వెనుక సీన్‌ను రూపొందించారు.

# ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తలసేమియాపై అవగాహన కోసం విజయవాడలో తమన్ మ్యూజికల్ నైట్




తమన్ మ్యూజికల్‌నైట్ పోస్టరును ఆవిష్కరిస్తున్న నారా భువనేశ్వరి

**విజయవాడ.జనవరి21, ప్రభాత వార్తప్రతినిధి:** తలసేమియా వ్యాధిపై అవగాహన కలిగించేందుకు ఫిబ్రవరి 15న విజయవాడ ఇందిరా గాంధీ మైదానంలో తమన్ మ్యూజికల్ నైట్ ఏర్పాటు చేస్తున్నటు ఎన్టీఆర్ ట్రస్టు అధినేత నారా భువనేశ్వరి తెలిపారు. ఇందుకు సంబంధించిన ఒక సమావేశ ప్రాంగణంలో మీడియాతో తలసేమియాపై అవగాహనకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మ్యూజికల్ నైట్‌కు టిక్కెట్లు ద్వారా ప్రజామద్దతును కోరుతున్నామన్నారు. షో ద్వారా వచ్చే నిధులన్ని తలసేమియా వ్యాధి గ్రస్తులకు వినియోగిస్తామన్నారు. తమన్ మ్యూజికల్ నైట్ టికెట్లు బుక్‌మై షోలో అందుబాటులో ఉన్నాయని భువనేశ్వరి తెలిపారు. అంతేకాకు హైదారాబాద్‌లో తలసేమియా కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు భువనేశ్వరి తెలిపారు. త్వరలో ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ ఏర్పాటు చేస్తామనిభువనేశ్వరి అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీఎం చంద్రబాబు హాజరవుతారనిభువనేశ్వరి తెలిపారు. మ్యూజికల్ నైట్ కార్యక్రమానికి పవన్ కల్యాణ్‌ను ఆహ్వానిస్తామన్నారు. ఇక విజయవాడలో తమన్ మ్యూజికల్ నైట్‌కు సంబంధించిన భారీ పోస్టర్ నారా భువనేశ్వరి ఆవిష్కరించారు.

# రైల్వే నిఘా విభాగం అధికారుల విస్తృత తనిఖీలు



**గుంతకల్లు రైల్వే,జనవరి 21,ప్రభాతవార్త** రాష్ట్ర నిఘా విభాగం, జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు నిఘా విభాగం అధికారులు దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు జంక్షన్ కేంద్రంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. రాష్ట్ర నిఘా అధికారుల, అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక రైల్వే జంక్షన్, స్టేషన్‌లలో ముమ్మరంగా రైల్వే సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించారు. గుంతకల్లు రైల్వేస్టేషన్/జంక్షన్‌లో అకస్మాత్తుగా సంభవించే ప్రమాదాలు, ఉగ్రవాదుల దాడులు, ఆస్తులకు సంబంధించిన నేరాలు, రైళ్లలో చోరీలు, అక్రమ మాదక ద్రవ్యాల సరఫరా, పండుగ వేళలో అధిక రద్దీ సమయంలో విదేశీయుల రాకపోకలపై కదలికలు, మహిళల అక్రమ రవాణా, రైల్వే యూనియన్, రాజకీయ పార్టీల ధర్నాలు, రాస్తారోకోలు జరిగిన పక్షంలో రైల్వే స్టేషన్‌లో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండ ఉండేందుకు ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి, ఎలాంటి సౌకర్యాలు అవసరం వంటి కీలకమైన వివరాలను తెలుసుకొని ప్రభుత్వానికి నివేదించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఈ తనిఖీల్లో అనంతపురం జిల్లా ఇంటెలిజెన్స్ డిఎస్‌పి రాంబాబు, గుంతకల్లు ఆర్‌డిఓఎం బివియస్ బి శ్రీనివాస్, మున్సిపల్ కమీషనర్ సిఎంఎ నయీమ్, ఎఆర్ డిఎస్‌పి నీలకంఠేశ్వర్‌రెడ్డి, స్థానిక డిఎస్‌పి శ్రీనివాస్, తహశీల్దార్ రమాదేవి, రైల్వే ఎస్‌సి అనిల్ కుమార్ సింగ్, సిఐలు మనోహర్, మస్తాన్, అజయ్‌కుమార్, వసంతకుమార్, వసంతరావు, వెంకట కృష్ణ, ఇంజనీరింగ్ అధికారులు నందగోపాల్, సత్యనారాయణ, స్టేషన్ మేనేజర్ మురారి, లాల్ మీనా, హరిక్రిష్ణ, సంబంధిత విభాగాలకు చెందిన సిబ్బంది నిఘా విభాగం అధికారులు రైల్వే ట్రాక్, రైల్వే స్టేషన్, ప్లాట్ ఫారాలు విస్తృతంగా తిరిగి తనిఖీలు నిర్వహించారు. అనంతరం అవసరమైన సదుపాయాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు చర్చించి తగు సూచనలు చేశారు. ఇందుకు సంబంధించి సమగ్రమైన నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు సంబంధిత ఉన్నతాధికారులు తెలిపారు.

# సోలార్ సెల్ తయారీ ప్లాంట్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలి

## - మిట్టల్ గ్రూప్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్‌ను కోరిన మంత్రిలోకేష్



**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** సోలార్ సెల్ తయారీ ప్లాంట్‌ను ఏపీలో ఏర్పాటు చేయాలని మంత్రి లోకేశ్ మిత్తల్ గ్రూప్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్ ను కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఏపీ సర్కార్ ప్రతిపాదనలపై లక్ష్మీమిత్తల్ సానుకూలంగా స్పందించినట్లు లోకేశ్ తెలిపారు. అనకాపల్లి జిల్లాలో ఏర్పాటు చేసే ఆర్సెలర్ మిత్తల్, నిప్పాన్ స్టీల్ ప్లాంట్ అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ప్రాజెక్ట్‌ల్లో ఒకటిగా నిలుస్తుందని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు దావోస్ పర్యటనలో భాగంగా మిత్తల్ గ్రూప్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీమిత్తల్,, సీఈఓ ఆదిత్య మిట్టల్ లో సీఎం నేతృత్వంలోని బృందం సమావేశమైంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అనుకూలతలపై లక్ష్మీమిత్తల్ తో మంత్రి నారా లోకేశ్ చర్చించారు. భావనపాడులో పెట్రో కెమికల్ హబ్ ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. ఏపీలో సోలార్ సెల్ తయారు ప్లాంట్ ఏర్పాటును పరిశీలించాలని కోరారు. పెట్రోకెమికల్స్ అన్వేషణకు భావనపాడు వ్యూహాత్మక ప్రాంతమని చెప్పారు. ఎంటీపీఏ సామర్థం గల పోర్టు, వైజాగ్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం ఎనర్జీ కొలువై ఉండటం, స్థిరమైన మౌలిక సదుపాయాలు ఉన్నాయని లోకేశ్ వారికి వివరించారు. బలమైన ప్రభుత్వం మద్దతు పెట్రోకెమికల్ రంగంలో పెట్టుబడులకు అనుకూలతలుగా ఉంటాయని చెప్పారు. భావనపాడుమూలపేట ప్రాంతం తయారీ, రవాణా, లాజిస్టిక్స్ సౌకర్యాలను నెలకొల్పడానికి, పెట్రోకెమికల్స్, గ్రీన్ ఎనర్జీలో నూతన ఆవిష్కరణలకు అవకాశాలు కలిగి ఉందని పేర్కొన్నారు. హెచ్‌పీసీఎల్–మిత్తల్ సంయుక్త భాగస్వామ్య సంస్థ హెచ్‌ఎంఈఎల్ హెచ్ పీసీఎల్‌మిత్తల్ గ్రీన్ ఎనర్జి లిమిటెడ్ ఆధ్వర్యంలో రూ.3,500 కోట్లతో 2 గిగా వాట్స్ సామర్థం గల సోలార్ సెల్ తయారీ ప్లాంట్‌ను భారత్ లో ఏర్పాటు చేయాలని భావిస్తుంది.

ఈ ప్లాంట్ ను ఏపీలో ఏర్పాటు చేయాలని లోకేశ్ లక్ష్మీమిత్తల్ ని కోరారు. తద్వారా 2,000ల మందికి ఉపాధి అవకాశాలు లభించే ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తుందని స్పష్టం చేశారు. ఆర్సెలర్ మిత్తల్, జపాన్‌కు చెందిన నిప్పాన్ స్టీల్ సంయుక్తంగా 17.8 మిలియన్ టన్నుల కెపాసిటీతో గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్రాజెక్ట్‌ను ఏపీలో ఏర్పాటు చేస్తున్నామని లక్ష్మీమిత్తల్ గుర్తు చేశారు. అనకాపల్లి జిల్లా సమీపంలో 2 దశల్లో రూ.1.4 లక్షల కోట్ల పెట్టుబడితో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేస్తామని చెప్పారు. గ్రీన్‌కో హైడ్రో పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌ను ఉపయోగించి 975 మెగావాట్ల సౌర, పవన విద్యుత్ సామర్థ్యాన్ని అభివృద్ధి చేయడానికి ఆర్సెలార్ మిత్తల్ భారతదేశంలోని గ్రీన్‌కో గ్రూప్‌తో భాగస్వామ్యం కలిగి ఉందని తెలిపారు.

# సహజ వనరుల వినియోగంలో కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలి:మంత్రి కొల్లు రవీంద్ర




నేషనల్ మైనింగ్ మినిస్టర్స్ సమావేశంలో ప్రసంగిస్తున్న కొల్లు రవీంద్ర

**విజయవాడ,జనవరి21,ప్రభాతవార్తప్రతినిధి:** మైనింగ్ రంగంలో కొత్త లక్ష్యాలతో ముందుకు సాగినపుడు మాత్రమే మెరుగైన ఫలితాలను సాధించే అవకాశం ఉంటుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. భువనేశ్వర్‌లో నిర్వహించిన నేషనల్ మైనింగ్ మినిస్టర్స్ సమావేశంలోసస్టైనబుల్ మైనింగ్ ఫర్ వికసిత్ భారత్ మూడో సదస్సులో మంత్రి పాల్గొన్నారు. రాష్ట్రంలో మైనింగ్ రంగంలో ఉన్న అపార అవకాశాలు, క్రిటికల్ మైనింగ్ ఆవశ్యకతను మంత్రి కొల్లు రవీంద్ర వివరించారు. దేశస్థాయిలో మైనింగ్ శాఖల సదస్సుల ద్వారా రాష్ట్రాలు తమ సూచనలను,, పాలసీలను, అవసరాలను, ఆకాంక్షలను పరస్పరం పంచుకోవడానిక అవకాశం కలుగుతుంది. ప్రధాన మంత్రి ఖనిజ క్షేత్ర కళ్యాణ్ యోజన కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మైనింగ్ ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు, యువతలో నైపుణ్యాభివృద్ధికి చర్యలు తీసుకునే అవకాశం లభిస్తోంది.

డీఎంఎఫ్ ద్వారా రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాల పెంపు సహా సమగ్రాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ ముందంజలో ఉంది. భారతదేశం గత 75 సంవత్సరాల్లో స్టీల్, సిమెంట్, అల్యూమినియం వంటి అనేక ఉత్పత్తుల్లో మెరుగైన స్థానాన్ని సంపాదించుకుంది. ఇనుప ఖనిజం, బాక్సైట్, లైమ్ స్టోన్ లాంటి లాంటి కీలక మినరల్స్ ఎగుమతిలో తమదైన ముద్ర వేసుకున్నాం.

# అంబేడ్కర్ స్మృతివనం పనులను త్వరలోనే పూర్తి చేస్తాం

## - మంత్రిడాక్టర్ బాల వీరాంజనేయ స్వామి

**విజయవాడ.జనవరి 21,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ నగరంలోని అంబేడ్కర్ స్మృతివనం నిర్మాణ పనులు వేగవంతం చేస్తామని, అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను త్వరలోనే పూర్తి చేస్తామని అని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. మంగళవారం మంత్రి, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావుతో కలిసి విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనం ను సందర్శించి, మిగిలిపోయిన నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.... నవ్యాంధ్ర రాజధానిలో దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు గత టిడిపి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అందుకనుగుణంగా అమరావతిలో స్థలం కేటాయించి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయన్నారు.

# గేట్ల మరమ్మతుపై నిర్లక్ష్యంతో జూరాల నుంచి నీటి లీకేజి

### ఖాళీ అవుతున్న ప్రాజెక్టు

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** తెలంగాణలో కృష్ణా నదిపై ఉన్న తొలి ప్రాజెక్టు అయిన ప్రియదర్శిని జూరాల డ్యామ్ నుంచి నీరు లీక్ అవుతున్నది. ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేయించకపోవడంతో తుప్పు పట్టి, రబ్బర్లు ఊడిపోయాయి. దీంతో మొత్తం 12 క్రస్ట్ గేట్ల నుంచి నీరు దిగువకు పోతున్నది. ఇందులో 8 గేట్ల రోప్ దెబ్బతిన్నది. అయినప్పటికీ అధికారులు పట్టించుకోక పోవడంతో జూరాల ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జూరాల ప్రాజెక్టును 1995లో ప్రారంభించారు. 9.68 టీఎంసీల సామర్థ్యంతో దీనిని నిర్మించారు. ఇటీవల వర్షాలతో కురిసిన భారీ వర్షాలకు జలాశయం నిండు కుండలా ఉంది. ప్రాజెక్టు పర్యవేక్షణ చేసే ఇంజనీర్ల నిర్లక్ష్యం కారణంగా నీరువృథా అవుతోందన్నారు. క్రస్ట్ గేట్లకు సకాలంలో మరమ్మతులు చేయక పోవ డంతో తుప్పుపట్టి గేట్లకు అమర్చిన రబ్బర్లు ఊడిపోయాయి. దీంతో ఆ ప్రాతంలో నీరు లీకవుతుండటంతో క్రమంగా ప్రాజెక్టు ఖాళీ అవుతున్నది. వేసవి నాటికి పరిస్థితి ఇలాగే కొనసాగితే జూరాలపై ఆధారపడిన ప్రజలకు నీటి సమస్య తలెత్తనున్నయ్యే అవకాశం ఉన్నది. అందులో సుమారు మూడు టీఎంసీల సామర్థ్యంతో సిల్ట్ కూడా ఉంది.

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు అభినందనలు

### సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన డోనాల్డ్ ట్రంప్‌నకు సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అభినందనలు తెలిపారు. సహజంగా ప్రజలచేత ఎన్నికయిన వారెవరైనా అభినందించాల్సిందేనని అన్నారు. పాలస్తీనా, ఇజ్రాయిల్ మధ్య ప్రశాంతతకు దారి తీసినందుకు స్వాగతిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాలస్తీనా విధ్వంసానికి గురిఅయిందని, ఆ దేశ పునరుద్ధరణకు కూడా సాయం చేయాల్సిన బాధ్యత అమెరికాపై ఉందన్నారు.



పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ రంగనాథ్

## హైడ్రా పోలీస్‌స్టేషన్ ఏర్పాట్లను పరిశీలించిన కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** హైడ్రా ప్రధాన కార్యాలయంలో ఉన్నటు వంటి బుద్ధభవన్ పక్కనే ఏర్పాటు చేస్తున్న పోలీసు స్టేషన్ కార్యాలయ ఏర్పాట్లను మంగళవారం కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఈ సందర్భంగా హైడ్రా పోలీసు స్టేషన్లో కల్పించాల్సిన సౌకర్యాలపై సమీక్ష నిర్వహించి పోలీసు స్టేషన్ తరహాలోనే లోపల గదులు, కేబిన్ల నిర్మాణాలు వుండాలని తెలిపారు. స్టేషన్ అధికారుల క్యాబిన్లతోపాటు ఫిర్యాదు దారులకు కల్పించాల్సిన వసతులపై సమీ క్షించారు. అలాగే హైడ్రా పోలీసు స్టేషన్ సైన్ బోర్డులు ప్రముఖంగా కనిపించేలా చూడాలని, పోలీసు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల వాహనాల పార్కింగ్ సౌకర్యం వుండేలా చూడాలని అధికారులకు సూచించారు.

## నిరుద్యోగులకు నష్టం లేకుండా స్పౌజ్ బదలీలు చేపట్టాలి

### రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో నిరుద్యోగులకు నష్టం లేకుండా స్పౌజ్ బదిలీలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. విద్యాశాఖ విడుదల చేసిన 834 మంది ఉపాద్యాయ స్పౌజ్ జాబితాలో కొన్ని జిల్లాలకి ఎక్కువ మంది ఉపాద్యాయులు వచ్చే అవకాశం ఉంది కాబట్టి నిరుద్యోగులకు నష్టం జరగకుండా వచ్చే డీఎస్సీలో పోస్టులపై ప్రభావం చూపకుండా ఆయా జిల్లాల్లో పోస్టులు తగ్గకుండా చూడాలని ప్రభుత్వానికి విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా హన్మకొండ, కరీంనగర్, సిద్దిపేట, వరంగల్, మహబూబ్ నగర్, నిజామాబాద్, మేడ్చల్ జిల్లాలకు ఎక్కువ సంఖ్యలో స్పౌజ్ బదిలీలతో రావడం వల్ల రాబోయే డీఎస్సీపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. కాబట్టి క్లియర్ వెకెన్సీలపై ప్రభావం లేకుండా చూడాలని ప్రభుత్వానికి.. అలాగే విద్యాశాఖ అధికారులకు తెలంగాణ రాష్ట్ర డీఎడ్. బీఎడ్ అభ్యర్థుల సంఘం విజ్ఞప్తి చేసింది. స్పౌజ్ బదలీల్లో భాగంగా ఉపాధ్యాయ దంపతులు దరఖాస్తు చేసుకున్న జిల్లాలకు బదిలీ చేసేందుకు ప్రభుత్వం తాజాగా జీఓలు జారీచేసిన నేపథ్యంలో.. బదలీ కాబడిన ఉపాధ్యాయుల జాబితాను పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఈవీ నరసింహారెడ్డి సోమవారం ఆయా డీఈఓలకు పంపారు. మొత్తం 834 మందిని బదిలీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జీవో 317 స్పౌజ్ బదిలీల్లో కొందరికి కాలేదని పిర్యాదులు వస్తున్న నేపథ్యంలో కొందరు ఉపాధ్యాయులు పాఠశాల విద్య డైరక్టర్‌ని సంప్రదించగా .. జాబితాలో మిస్ అయిన వారు వారి అప్పీల్‌ను వెంటనే తగిన ఆధారాలతో సంబంధిత డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించినట్టు ఉపాధ్యాయ సంఘాలు చెబుతున్నాయి.



ధర్నాలో నినాదాలు చేస్తున్న తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

## ఆదివాసీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### మాజీ ఎంపీ మిడియం బాబురావు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జనవరి 21, ప్రభాతవార్త:** ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపి మిడియం బాబురావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ అధ్యక్షతన మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేసించి బాబురావు మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఎస్టీ కోయ, గుత్తి కోయ వలస ఆదివాసీయులకు కులధ్రువీకరణ పత్రాలు ఇవ్వటంలేదని, వీరంతా పుట్టుకతో ఆదివాసీలు అయినప్పటికీ ఎటువంటి ప్రభుత్వ పథకాలు వీరికి అందటం లేదన్నారు. రైతు రుణమాఫీ ఆదివాసీలకు కూడా అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధర్నాకు సిఐటియూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ హాజరై మద్దతు తెలిపారు.

# అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు

### గ్రామ సభల్లోనే అర్హుల ఎంపిక

### మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇవ్వనున్నామని బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుండి ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా విషయంలో ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల లబ్ధి జరుగుతుందని మంగళ వారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు. మంగళవారం నుంచే గ్రామాల్లో గ్రామ సభలు, వార్డు సభలు జరుగుతుండడంతో అక్కడికి వెళ్లి రేషన్ కార్డులు రానివారు, ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక విషయంలో గ్రామ సభల్లోనే ఎంపిక చేయను న్నారు. ఎవరికైనా అర్హత ఉండి రానివారు ఉంటే గ్రామ సభలో అప్లికేషన్‌లు పెట్టుకోవాలని మంత్రి సూచించారు. ప్రజలు ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని... గత 10 సంవత్సరాల్లో ఒక్క రేషన్ కార్డు అయినా ఇచ్చారా? అని బీఆర్ఎస్‌ను ప్రశ్నించారు. రైతు భరోసా పథకం ద్వారా ప్రస్తుతం ఉన్న రూ. 10 వేలను రూ. 12 వేలకు పెంచడం జరిగింద న్నారు. అలాగే దేశంలోనే మొదటి సారిగా భూమి లేని ఉపాధి హామీ రైతు కూలీలకు రూ. 12 వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిదన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రజా సంక్షేమ పథకాలు అందిస్తుందని మంత్రి తెలిపారు. ఇప్పటికే ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందిస్తున్నామని.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ 500కే గ్యాస్ సిలిండర్, ఆరోగ్యశ్రీని రూ.5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచుకున్నామన్నారు. రైతులకు రూ. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేశామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే 55 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని.. సన్న వడ్లకు రూ. 500 బోనస్ ఇచ్చామని.. గతంలో ఎప్పుడు లేని విధంగా ధాన్యం సేకరణ చేసిన 48 గంటల్లోపు రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలతోపాటు ఈనెలలోనే మరో 4 పథకాలు ప్రారంభం కానున్నాయన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు వర్తిస్తాయన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

# కిడ్నీ రాకెట్ గుట్టురట్టు

### పేరుకే ఆస్పత్రి.. లోపల జరిగేదంతా దందా

**హైదరాబాద్ (హుడా కాంప్లెక్స్), జనవరి 21, ప్రభాతవార్త:** ఎలాంటి ప్రభుత్వ అను మతులు లేకుండా కిడ్నీ మార్పిడి జరుగుతోందన్న సమాచారంతో ఎల్‌బినగర్ ఎసిపి కృష్ణయ్య, రంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఒ వెంకటేశ్వర్లు, డిప్యూటీ డిఎంహెచ్ఎ గీత, సరూర్‌నగర్ పీ హెచ్‌సీ వైద్యురాలు అర్చన, జిహెచ్ఎంసి అధికారులు, సరూర్‌నగర్ పోలీసులతోపాటు సిబ్బంది సంఘటనా హాస్పిటల్‌కు చేరుకుని తనిఖీలు చేపట్టారు. అమాయకుల్ని ఆసరాగా చేసుకొని సరూర్‌నగర్ లోని అలకనంద హాస్పిటల్‌లో కిడ్నీ రాకెట్ దందా కొనసాగిస్తున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన అమ్మా యిలకు డబ్బులు ఆశచూపి పక్క రాష్ట్రానికి సంబంధించిన డాక్టర్లు తీసుకొచ్చి ఇక్కడ ఉన్న హాస్పిటల్ వాళ్లతో కుమ్మక్కయి కిడ్నీలను విక్రయించి డబ్బులు దండు కుంటున్నారు. ఈ విషయం బయటికి వెలుగు చూడడంతో మెడికల్ ఆఫీసర్ హాస్పిటల్ వద్దకు చేరుకుని పోలీసుల సహకారంతో విచారణ చేపట్టారు. హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నలుగురు రోగులను అంబులెన్స్‌లో గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అయితే వైద్యులు చికిత్స మధ్యలోనే వదిలి పెట్టారు. ఈ హాస్పిటల్‌లోని వైద్యులు, సిబ్బంది అంతా కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందినవారని అధికారులు తెలిపారు. భవనాన్ని సీజ్ చేశారు.

# మహిళా రైతులకు ప్రోత్సాహకం

### వెదురు సాగుతో ఆదాయం పెంపు

### తొలి విడతలో ఆరు జిల్లాల్లో విస్తరణ

### రేవంత్ సర్కార్ మరో కీలక నిర్ణయం

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రధానంగా మహిళా రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గాను రాష్ట్రంలో వెదురు సాగు చేపట్టాలని తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా థర్మల్ విద్యుత్ కేంద్రాల నుంచి వెలువడే కాలుష్యం నియంత్రణకు వెదురు కలపను తప్పనిసరిగా వాడాలని ఇంధన నూతన విధానంలో రాష్ట్రాలకు కేంద్రం స్పష్టం చేసింది. ఇందుకు బొగ్గుకు బదులుగా వెదురును వాడాలని సూచించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం వెదురు చెట్ల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు చెట్టుకు 120 రూపాయల వరకూ రాయితీ అందిస్తోంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో వెదురు సాగును ప్రోత్సహించాలని నిర్ణయించింది. రాష్ట్రంలో వెదురు సాగు పెంపునకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధమయ్యారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణలో లక్షలాది ఎకరాల సాగు భూమి ఉంది. నీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో వరి, మిర్చి, మొక్కజొన్న, వంటి ఆహార పంటలు సాగు చేస్తుంటారు. ఇక నీరు తక్కువగా ఉండే మెట్ట ప్రాంతాల్లో వాణిజ్య పంటలు వేస్తుంటారు.

అయితే ఎక్కువగా రైతులు సంప్రదాయ పంటల వైపే మొగ్గుతుంటారు. అటువంటి సందర్భాల్లో లాభాలు పెద్దగా ఉండవు. ఈ నేపథ్యంలో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలను రూపొందించింది. రాష్ట్రంలో వెదురు సాగును ప్రోత్సహించాలని నిర్ణయం తీసుకుంది. జాతీయ వెదురు మిషన్ పథకం కింద రైతులకు రాయితీ ఇవ్వడంతో పాటుగా, గిరిజన ప్రాంతాల్లో మహిళా రైతులు వెదురు సాగును చేపట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ వ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో వెదురు సాగు చేయాలని వ్యవసాయ శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం కుమురంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో సుమారు 2,200 ఎకరాల్లో వెదురు పంటను సాగు చేస్తున్నారు. దీన్ని మరింత విస్తరింప చేసి, తద్వారా మహిళా రైతులకు ఆదాయాన్ని సమకూర్చేందుకు వెదురు సాగుపై అవగాహన కల్పించటంతో పాటుగా, సాగువైపు మళ్లేలా వ్యవసాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. మహిళా సాధికారతలో భాగంగా తెలంగాణలోని స్వయంసహాయక సంఘాల ద్వారా 32 జిల్లాల్లో వెదురు సాగు చేపట్టేలా వారిని ప్రోత్సహించనున్నారు. వెదురు సాగుకు అయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వమే భరించనున్నట్లు తెలిసింది.

నర్సరీల్లో మొక్కల్ని పెంచి వాటిని రైతులకు పంపిణీ చేయనున్నారు. తొలి విడతలో కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, ఆదిలాబాద్, ములుగు, భూపాలపల్లి, ఆసిఫాబాద్ జిల్లాల్లో మహిళా రైతులను ఎంపిక చేసి ఇటీవల పంట సాగుపై హైదరాబాద్‌లో శిక్షణ కూడా ఇప్పించారు. వీరికి త్వరలో మొక్కలు పంపిణీ చేయనున్నారు.

# నుమాయిష్‌ను నగరం బయట నిర్వహించండి

### సిఎం రేవంత్‌రెడ్డికి

### బిజెపి ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి

**హైదరాబాద్, జనవరి 21, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లోని నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ప్రతి ఏటా నిర్వహించే నుమాయిష్‌పై గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. నగరం మధ్యలో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించడం వల్ల ఎగ్జిబిషన్‌కు వచ్చే వేలాది మంది ప్రజలతో భారీగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతుందని తెలిపారు. గంటల తరబడి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. గతంలో నుమాయిష్‌లో అగ్నిప్రమా దాలు జరిగిన సంఘటనలను కూడా రాజాసింగ్ గుర్తుచేశారు. ఇరుకు ప్రదేశం కావడం వల్ల ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు నష్టం ఎక్కువగా జరిగే అవకాశం ఉందని అన్నారు. అందుకే నుమాయిష్‌ను నగరం అవతలకు మార్చాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ సిటీ బయట 100-200 ఎకరాల్లో ఈ నుమాయిష్‌ను నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డిని విజ్ఞప్తి చేశారు. నుమాయిష్‌కు వచ్చేవారి నుంచి పార్కింగ్ పేరుతో అడ్డగోలుగా దోచుకుంటున్నారని రాజాసింగ్ అన్నారు. కారు పార్కింగ్‌కు రూ.150 వసూలు చేయడం సబబేనా అని ప్రశ్నించారు. నుమాయిష్ పార్కింగ్ లాట్ కేటాయింపుల్లోనూ పెద్ద కుంభకోణం ఉందని రాజాసింగ్ ఆరోపించారు. ఈ పార్కింగ్ ఛార్జీల ఖరారుకు టెండర్ పిలిచారా అని ప్రశ్నించారు. ఛార్జీలపై జిల్లా కలెక్టర్ తమను సంప్రదించలేదని స్పష్టం చేశారు. నుమాయిష్ ఎగ్జిబిషన్ కోసం వచ్చే వారి కోసం నిర్వాహకులే ఉచితంగా పార్కింగ్ సదుపాయం కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయినా ప్రభుత్వ స్థలంలో పార్కింగ్ ఫీజులు వసూలేంటని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలంలో ఫ్రీ పార్కింగ్ కల్పించాలని డిమాండ్ చేశారు.

# ముమ్మాటికీ ఇది ప్రజావ్యతిరేక పాలన

### మాజీ మంత్రి హరీశ్‌రావు ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 21:** ప్రజాపాలన కాదు, మీది ముమ్మాటికీ ప్రజా వ్యతిరేక పాలన అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశిస్తూ మాజీ మంత్రి హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ సోకాల్డ్ ప్రజాపాలన పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా..? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ఆడంబరంగా నిర్వహిస్తున్న గ్రామ సభల సాక్షిగా ప్రభుత్వంపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకత తేటతెల్లమైందని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఊరూరా తిరగబడుతున్న జనం, ఎక్కడిక్కడ నిలదీస్తున్న ప్రజానీకాన్ని చూస్తే కాంగ్రెస్ ఏడాది పాలన పెద్ద ఫెయిల్యూర్ అని అర్థమవుతున్నదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాల్లో, మంత్రులందరూ పక్క రాష్ట్రాల్లో బిజీగా ఉంటే ప్రజలను ఎవరు పట్టించుకోవాలె అని అడిగారు. ఇందిరమ్మ రాజ్యంలో పోలీసు పహారా నడుమ గ్రామ సభలు నిర్వహించాల్సిన దుస్థితి రావడం దారుణం అని పేర్కొన్నారు. పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఒకవైపు గ్రామ సభలు నిర్వహిస్తుంటే, మరోవైపు కార్యకర్తలకే పథకాలు ఇస్తామని అధికార పార్టీ ఎంఎల్ఎలు, నాయకులు చెప్పడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. అలాంటపుడు గ్రామ సభలు తూతూ మంత్రంగా నిర్వహిస్తున్నట్లేనా..? అర్హులైన వారికి పథకాలు ఎగ్గొడుతున్నట్లేనా..? అని ప్రశ్నించారు.

**కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారింది**

కాంగ్రెస్ నాయకుల పాపం, అధికారులకు శాపంగా మారిందని, సమాధానం చెప్పలేని పరిస్థితి అని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామ సభలు దగా.. ఆరు గ్యారెంటీలు అమలు దగా..రుణమాఫీ చేయడం దగా..పంట బోనస్ ఇవ్వడం దగా..రైతు భరోసా అమలు దగా..రేషన్ కార్డుల జారీ దగా..ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక దగా అని మండిపడ్డారు.

# ఉగ్రదాడిలో జవాను మృతి

### - నేడు స్వగ్రామం ఎగువ రాగిమానుపెంటకి మృతదేహం

### - అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

**బంగారుపాళ్యం, జనవరి 21 ప్రభాతవార్త:** ఉగ్రవాదులను ధైర్యంగా ఎదుర్కొని దేశ రక్షణ కోసం ఈ యువ సైనికుడు ప్రాణాలు అర్పించాడు. భారతమాత ముద్దుబిడ్డగా పలువురి మన్ననలు పొంది వీర మరణం పొందాడు. చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలంలోని ఎగువ రాగిమానుపెంటకు చెందిన సైనికుడు కార్తీక్ ఉగ్రదాడిలో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. నార్త్ జమ్ము కాశ్మీర్‌లో ఆదివారం ఉగ్రవాదులకు భద్రతా దళాలకు మధ్య దాడులు జరిగాయి. ఈ దాడుల్లో సైనికుడు కార్తీక్‌కు బుల్లెట్ గాయాలు తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఆర్మీ అధికారులు చికిత్స నిమిత్తం కార్తీక్‌ను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. చికిత్స పొందుతున్న కార్తీక్ సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు తుది శ్వాస విడిచాడు. ఈ విషయంను ఎగువ రాగిమానుపెంటలో వున్న కార్తీక్ తల్లిదండ్రులకు ఆర్మీ అధికారులు ఫోను ద్వారా సమాచారం అందించారు. ఎగువ రాగిమానుపెంట గ్రామంకు చెందిన దేవరాజులు, సెల్విలకు కార్తీక్ చిన్న కుమారుడు కాగా రాజేష్ పెద్ద కుమారుడు వున్నాడు. కార్తీక్‌కు ప్రాథమిక విద్యను ఎగువ రాగిమానుపెంట ప్రాథమిక పాఠశాలలో పూర్తి చేసి టెన్త్ క్లాస్ వరకు ఆ పాఠశాలలోనే చదివాడు.

## జాతీయ రహదారుల విస్తరణకు వేగవంతంగా భూసేకరణ పూర్తి చేయండి

### - ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

**విజయవాడ జనవరి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో వివిధ జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ, వాటిపై బైపాస్ రహదారుల నిర్మాణానికి సంబంధించి అవసరమైన భూసేకరణను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లు సంయుక్త కలక్టర్లతో పాటు సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ ఆదేశించారు. జాతీయ రహదారుల నిర్మాణం, విస్తరణ, బైపాస్ రహదారుల నిర్మాణానికి అవసరమైన భూసేకరణ అటవీ అనుమతుల మంజూరు తదితర పెండింగ్ అంశాలపై మంగళవారం రాష్ట్ర సచివాలయం నుండి రెవెన్యూ అటవీ, టిఆర్‌అండ్బి, జాతీయ రహదారుల సంస్థ, మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్టు అండ్ హైవేస్ శాఖల అధికారులతో కలిసి ఆయన జిల్లా కలెక్టర్లు జెసీలతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ జాతీయ రహదార్లు వంటి ప్రాధాన్య రహదార్ల నిర్మాణం, విస్తరణకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి సంబంధిత నిర్మాణ ఏజెన్సీలకు సకాలంలో అందించే విధంగా కలక్టర్లు, జెసిలు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్ భూసేకరణ అటవీ అనుమతుల మంజూరుపై జిల్లాల వారీగా కలక్టర్లు జెసీలతో సీఎస్ విజయానంద్ సమీక్షించారు. భూసేకరణకు సంబంధించిన నిబంధనలు ప్రకారం రైతులకు నష్ట పరిహారాన్ని అందించి సకాలంలో భూసేకణ ప్రక్రియను పూర్తి చేసి ఆయా నిర్మాణ సంస్థలకు అందించాలని స్పష్టం చేశారు.

## విజయవాడలో 24 నుంచి 27 దాకా 68 వ అండర్ 14 బాల బాలికల స్కూల్ గేమ్స్ జాతీయ సెపక్ తక్ర పోటీలు

**విజయవాడ,జనవరి 21.ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, ఎన్ టి ఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్తం గా ఈ నెల 24 నుంచి 27 వ తేదీ వరకు నగరం లో నిర్వహిస్తున్న 68 వ అండర్ 14 బాల బాలికల స్కూల్ గేమ్స్ జాతీయ సెపక్ తక్ర పోటీలు విజయ వంతం గా నిర్వ హించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీనరసింహారావు కోరారు. పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జాతీయ సెపక్ తక్ర పోటీల నిర్వహణ కమిటీల సమావేశం జరిగింది. ఈ సమావేశం లో ఆయన మాట్లాడుతూ పోటీలు స్థానిక పటమట జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానం లో జరుగుతాయని ,పోటీల్లో పాల్గొనే బాలబాలికల తో తల్లి తండ్రులు లాగా మెలగాలని, వాళ్ళకి కుటుంబ వాతావరణం కల్పించి వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. రాష్ట్ర స్కూల్ గేమ్స్ కార్యదర్శి జి. భానుమూర్తి రాజు మాట్లాడుతూ ఈ జాతీయపోటీల్లో 15 రాష్ట్రాల బాల బాలికల జట్లు పాల్గొంటున్నాయని చెప్పారు. అన్ని రాష్ట్రాల జట్టుకు స్థానిక హోటల్ లలో ఉచిత బస ఏర్పాటు చేస్తున్నామని వారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పూర్తి రక్షణ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చేవారు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా రైల్వే స్టేషన్, బస్ స్టాండ్ లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి రవాణా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. పోటీలు జిల్లా కలెక్టర్ లక్ష్మి షా, పార్లమెంటు సభ్యుడు కేశినేని చిన్ని,లు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని అన్ని ఏర్పాట్లు పరిశీలిస్తున్నారని తెలిపారు. జిల్లా కార్యదర్శి ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ పోటీలకు 4 కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని, అందులో రెండు ఫ్లడ్ లైట్ల ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు .పోటీలు లీగ్ కమ్ నాక్ అవుట్ పద్ధతిలో జరుగుతాయని, ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 10 గంటల వరకు పోటీలు జరుగుతాయని వివరించారు. ఈ సమావేశం లో రాష్ట్ర స్కూల్ గేమ్స్ సంయుక్త కార్యదర్శి కె.వి. రాధా కృష్ణ, ఎ.పి. రాజు , పోటీల కార్య నిర్వహణ కార్యదర్శి ఎస్. రమేష్ ,వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విశాఖలో రూ. 800 కోట్లకు పైగా క్రికెట్ బెట్టింగ్ బెట్టింగ్ లలో పెద్ద తలకాయలు ఉలిక్కిపడ్డ పోలీస్ యంత్రాంగం ఒక హెడ్ కానిస్టేబుల్ పై వేటు.. మరో ఏడుగురు అరెస్ట్ కుంభమేళాకు పారిపోయిన బుకీలు

**విశాఖపట్నం, జనవరి 21, ప్రభాతవార్త:** విశాఖలో క్రికెట్ బెట్టింగ్లు హద్దు మీరాయి. నగరంలో గడిచిన కొద్ది రోజులుగా 800 కోట్ల రూపాయలకు పైగా క్రికెట్ బెట్టింగ్ జరిగాయి అంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. కొంతమంది పోలీసుల తెరవెనుక సహకారంతో విచ్చలవిడిగా ఈ బెట్టింగుల వ్యవహారం నడిచిపోతోంది. కొద్ది రోజుల కిందట క్రికెట్ బ్యాటింగ్లో ఓడిపోయిన ఒకరి నుంచి బుకీలు 48 లక్షల రూపాయలు డిమాండ్ చేశారు. ఆ మొత్తం చెల్లించకపోతే అసభ్య వీడియోలు బహిర్గతం చేస్తామంటూ వేధించడంతో వారు నగర పోలీస్ కమిషనర్ ను ఆశ్రయించారు. దీంతో బెట్టింగ్ బుక్ ఇలా డొంక కదిలింది. పోలీసులు రంగ ప్రవేశం చేయగా, దీని వెనక పెద్ద మాఫియా ఉన్నట్లు పోలీసులు గమనించారు. ఇందులో పారిశ్రామికవేత్తలు, ప్రముఖ రాజకీయ నాయకులు ఉన్నట్లు పోలీసుల దృష్టికి వచ్చింది. దీంతో పోలీసులు యాక్షన్ లోకి దిగారు.

# సచివాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, భూభారతి చట్టంపై వర్క్‌షాప్

### హాజరైన సిఎస్ శాంతికుమారి, అధికారులు రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జనవరి 21:** తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూభారతి చట్టం, 2025పై మంగళవారం సచివాలయంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, తెలంగాణ భూభారతి చట్టం, 2025 వివరించేందుకే ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ భూభారతి చట్టం, 2025పై రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్ ప్రజెంటేషన్ ఇచ్చారు. నవీన్ మిట్టల్ మాట్లాడుతూ రెవెన్యూ పరిపాలనను క్రమబద్ధీకరించడంతోపాటు జవాబుదారీతనం పెంచడమే లక్ష్యంగా సమగ్ర భూసంస్కరణలు తీసుకురావడమే ప్రభుత్వ విజన్ అని అన్నారు. ఈ చట్టం సమర్థవంతమైన వ్యవసాయ భూపరిపాలన విధానాన్ని ప్రోత్సహిస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తం 19 రాష్ట్రాల్లో అనుసరిస్తున్న రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి, నిజమైన ప్రజాస్వామ్య స్ఫూర్తిని అనుసరించి 2024 జూలై 1న ముసాయిదా చట్టాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచామన్నారు. ప్రజల నుండి వచ్చిన పలు సూచనలను స్వీకరించిన తరువాతే ఈ చట్టంను రూపొందించామని ఆయన తెలియజేశారు. శాసనసభ ఆమోదం పొందిన ఈ చట్టాన్ని గవర్నర్ కూడా ఆమోదించడంతో ఈ నెల 4న గెజిట్ నోటిఫికేషన్ వెలువడిందన్నారు.

యూజర్ ఫ్రెండ్లీ పోర్టల్‌ను తయారు చేయడంతో పాటు అవసరమైన నియమ, నిబంధనలను రూపొందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, తెలంగాణ క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ 2025 ద్వారా రాష్ట్రాన్ని పునరుత్పాదక ఇంధన రంగంలో అగ్రగామిగా నిలిపేందుకు ఉద్దేశించిన ముఖ్యాంశాలను వివరించారు. సోలార్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్ట్‌లు, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్, గ్రీన్ హైడ్రోజన్ వంటి పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల అభి వృద్ధికి ప్రోత్సాహకాలను అందించడం ద్వారా, రాష్ట్ర వినియోగదారులకు స్వచ్ఛమైన, విశ్వసనీయమైన, సరసమైన విద్యుత్‌ను అందించడానికి కృషి చేస్తూ, రాష్ట్రానికి ఇంధన భద్రతను నిర్ధారించడం ఈ విధానం లక్ష్యం అన్నారు.

ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు రామకృష్ణారావు, రవిగుప్తా, వికాస్‌రాజ్, సబ్యసాచి ఘోష్, ముఖ్య కార్యదర్శులు దానకిషోర్, రిజ్వీ, క్రిస్టినా జోంగ్తు, కార్యదర్శులు లోకేష్ కుమార్, యోగితా రాణా, సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ హరీశ్, ఇతర అధికారులు వర్క్‌షాప్‌కు హాజరయ్యారు.

ఆట

# 10 బంతుల్లోనే ఖేల్ ఖతం

## అండర్ 19 మహిళల టి20 వరల్డ్ కప్‌లో.. సమోవా మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా సంచలనం



**ఢిల్లీ:** అండర్ 19 మహిళల టీ20 ప్రపంచ కప్-2025లో సంచలనం నమోదైంది. దక్షిణాఫ్రికా జట్టు 10 అంటే 10 బంతుల్లోనే మ్యాచ్ ముగించేసింది. ఇన్నింగ్స్ బ్రేక్‌కు వెళ్లొచ్చేలోగా ఖేల్ ఖతమైంది. గ్రూప్ సిలో భాగంగా సమోవా జట్టుతో జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ఈ ఘనత సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సమోవా 9.1 ఓవర్లలో 16 పరుగులకే కుప్పకూలింది. సమోవా ఇన్నింగ్స్‌లో ఏకంగా ఐదుగురు డకౌట్లు కాగా, నాలుగు ఒకట్లు (1), రెండు మూడులు (3 పరుగులు) నమోదయ్యాయి. ఎక్స్‌ట్రాల రూపంలో వచ్చిన 6 పరుగులే సమోవా తరఫున అత్యధిక స్కోర్గా ఉంది. సమోవా బ్యాటర్లు చేసిన పరుగుల కంటే సఫారీ బౌలర్లు తీసిన వికెట్లే అంకెల్లో టాప్‌గా ఉన్నాయి. ఎన్‌తబిసెంగ్ నిని 3 వికెట్లు, ఫేకొలింగ్, కేలా రేనెకె, శేషిని నాయుడు తలో 2 వికెట్లు తీశారు. అనంతరం దక్షిణాఫ్రికా ఓపెనర్లు ఇద్దరే పలువురు ప్రేక్షకులు బ్రేక్‌కు వెళ్లొచ్చే లోగా 10 బంతుల్లో 17 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో ఘన విజయాన్ని అందించారు. ఓపెనర్లు సిమోన్ లారెన్స్ (6 పరుగులు, నాటౌట్), జెమ్మా బోతా (6 పరుగులు, నాటౌట్) 1.4 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించారు.

# స్వియాటెక్ జోరు..



ఢిల్లీ: ఆస్ట్రేలియా ఓపెన్‌లో పోలండ్ భామ ఇగా స్వియాటెక్ జోరు కొనసాగిస్తోంది. ప్రత్యర్థికి ఒక్క సెట్ కాదు కదా కనీసం ఒక్క గేమ్ కూడా గెలవనీయకుండా ఆడుతున్న ఆమె ప్రిక్వార్టర్స్‌లోనూ అదే దూకుడును ప్రదర్శించింది. మెల్‌బోర్న్‌లో జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ స్వియాటెక్ 6-0, 6-1తో జర్మనీకి చెందిన ఎవా లిస్‌ని మట్టి కరిపించింది. 59 నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించిన ఈ పోలండ్ ప్లేయర్, వరుసగా నాలుగో మ్యాచ్‌లోనూ వరుస సెట్లలో ఇరుకున పెట్టి ప్రత్యర్థిని చిత్తు చేసి మ్యాచ్‌లను సొంతం చేసుకోవడం విశేషం. గత రెండు మ్యాచ్‌లలోనూ ఆమె రదుకాను, ప్రమ్కోవాలపైనా 6-0 తేడాతో సెట్‌లను గెలుచుకున్న విషయం విదితమే. మరో మ్యాచ్‌లో కజకిస్థాన్‌కు చెందిన ఆరో సీడ్ ఎలీనా రిబాకినా 3-6, 6-1, 3-6తో యూఎస్‌కు చెందిన మాడిసన్ చేతిలో ఓడింది. ఇక స్వితోలినా, నవ్రో క్వార్టర్స్ చేరారు. కాగా, పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ సిన్నర్ క్వార్టర్స్ చేరాడు. నాలుగో రౌండ్‌లో ఈ ఇటలీ కుర్రాడు 6-3, 3-6, 6-3, 6-2తో డెన్మార్క్‌కు చెందిన హోల్గర్ రూణెతో పోరాడి గెలిచాడు. సుమారు మూడున్నర గంటల పాటు సాగిన ఈ మ్యాచ్‌లో రెండో గేమ్ గెలిచినప్పటికీ రూణె ఆ జోరు కొనసాగించక చతికిలపడ్డాడు. 8వ సీడ్ అలెక్స్ డి మినార్, బెన్ షెల్టన్, లొరెంజో సొనెగొ క్వార్టర్స్‌కు అర్హత సాధించారు.

# ఆసిస్‌దే మహిళల టి20 సిరీస్

## ఇంగ్లండ్‌పై 57 పరుగుల తేడాతో గెలుపు

**ఢిల్లీ:** మహిళల యాషెస్ సిరీస్‌ను ఆస్ట్రేలియా తిరిగి సొంతం చేసుకుంది. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో భాగంగా ఇంగ్లంతో జరిగిన తొలి మ్యాచ్‌లో ఆసిస్ 57 పరుగుల తేడాతో గెలుపొందింది. ఈ గెలుపుతో ఆసీస్ మరో రెండు టీ20లు, ఓ టెస్ట్ మ్యాచ్ మిగిలి ఉండగానే 8-0 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. టీ20లోనూ ఆసీస్ విజయం సాధించింది. తద్వారా ఒక్కో గెలుపునకు రెండు పాయింట్లు చొప్పున ఆస్ట్రేలియా ఖాతాలో 8 పాయింట్లు చేరాయి. ఈ సిరీస్‌లో ఇంకా రెండు టీ20లు, ఓ టెస్ట్ మ్యాచ్ మిగిలి ఉన్నాయి. ఈ మ్యాచ్‌లన్నీ గెలిచినా ఇంగ్లండ్ కనీసం సిరీస్‌ను సమం కూడా చేసుకోలేదు. తదుపరి మ్యాచ్‌లన్నీ గెలిస్తే ఇంగ్లండ్ ఖాతాలో 6 పాయింట్లు మాత్రవే ఉంటాయి. ఇక తొలి టీ20 విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఓపెనర్ బెత్ మూనీ (51 బంతుల్లో 75 పరుగులు, 11 ఫోర్లు) మెరుపు అర్ధ సెంచరీతో సత్తా చాటింది. మరో ఓపెనర్ జార్జియా వాల్ (21), ఫోబ్ లిచ్ఫీల్డ్ (25), కెప్టెన్ తహిల మెక్గ్రాత్ (26) ఓ



మోస్తరు స్కోర్లు చేశారు. స్టార్ ప్లేయర్ ఎల్లిస్ పెర్రీ (7), అన్నాబెల్ సదర్ల్యాండ్ (3) తక్కువ స్కోర్లకే పెవిలియన్‌కు చేరగా, గ్రేస్ హ్యారిస్ 8 బంతుల్లో 14, జార్జియా వేర్హామ్ 10 బంతుల్లో 11 (నాటౌట్) పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో సోఫీ ఎక్లెస్టోన్, లారెన్ బెల్ తలో 2 వికెట్లు పడగొట్టగా, ఫ్రేయా కెంప్, చార్లీ డీన్ చెరో వికెట్ దక్కించుకున్నారు. 199 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఇంగ్లండ్, ఆసీస్ బౌలర్లు మూకుమ్మడిగా దాడిచేయడంతో 16 ఓవర్లలో 141 పరు గులకే టపా కట్టేసింది.

ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో సోఫీ డంక్లీ (59) ఒక్కరే హాఫ్ సెంచరీతో రాణించగా, మిగతా వారంతాదారుణంగా విఫలమయ్యారు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్ లో ఏకంగా నలుగురు డకౌట్లయ్యారు. నాట్ సీవర్ బ్రంట్ (20),కెప్టెన్ హీథర్ నైట్ (18), ఆమీజోన్స్ (12), సోఫీఎక్లెస్టోన్ (13), ఫ్రేయా కెంప్ (11 నాటౌట్) రెండంకెల స్కోర్లు చేశారు. ఆసీస్ బౌలర్లలో జార్జియా వేర్హామ్ 3 వికెట్లు పడగొట్టగా, అలానా కింగ్ 2, మెగాన్ షట్, కిమ్ గార్త్, సదర్ల్యాండ్, తహిల మెక్‌గ్రాత్ తలో 1 వికెట్ దక్కించుకున్నారు. ఈ సిరీస్‌లో రెండో టీ20 ఈ నెల 23న కాన్‌బెర్రాలో జరుగనుంది.



# ముగ్గురు స్టార్లు ఔట్

## ఇంగ్లండ్‌తో తొలి టి20 మ్యాచ్.. లిస్టులో షాకింగ్ ప్లేయర్

**ఢిల్లీ:** ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌కు భారత జట్టు సిద్ధమైంది. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో ఈ నెల 22 నుంచి బరిలోకి దిగనుంది. ఈ క్రమంలో తొలి టీ20 ఐ ప్లేయింగ్ 11 నుంచి ముగ్గురు ఆటగాళ్లు తప్పుకోనున్నారు. భారత్, ఇంగ్లండ్ మధ్య ఐదు టీ20ల సిరీస్‌లో భాగంగా కోల్‌కతా వేదికగా తొలి టీ20 మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా వంటి ఆటగాళ్ల ఆడటం ఖాయం. అయితే, జట్టులో చోటు దక్కించుకోలేని కొందరు ఆటగాళ్ల ఉన్నారు. ఇటు వంటి పరిస్థితిలో, ఈ ఆటగాళ్ల నిరాశను ఎదుర్కోవలసి ఉంటుంది. ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో కనిపించని ముగ్గురు ఆటగాళ్లలో రవి బిష్ణోయ్, ధృవ్ జురెల్, హర్షిత్ రాణా ఉన్నారు. ఇంగ్లండ్‌తో జరిగే తొలి టీ20 మ్యాచ్‌లో రవి బిష్ణోయ్ ఆడడం కూడా కష్టమే. అక్షర్ పటేల్‌ను జట్టుకు వైస్ కెప్టెన్‌గా నియమించారు. కాబట్టి, అతను ఆడటం ఖాయం. రెండో స్పిన్నర్‌గా వరుణ్ చక్రవర్తికి చోటు దక్కవచ్చు. దక్షి ణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో అతను చాలా బాగా బౌలింగ్ చేసి ఫామ్‌లో ఉండడమే ఇందుకు కారణం. ఇటువంటి పరిస్థితిలో, అతనికి ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు కల్పించవచ్చు. రవి బిష్ణోయ్‌ను బెంచ్‌కే పరిమితం కావచ్చు. అలాగే టీ20 సిరీస్‌కి భారత జట్టులో వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ ధ్రువ్ జురెల్ కూడా ఎంపికయ్యాడు. అయితే, తొలి టీ20 మ్యాచ్‌లో ఆడలేకపోవచ్చు.

సంజూ శాంసన్ ప్లేయింగ్ ఎలెవన్‌లో ఆడటం ఖాయం. అతను వికెట్ కీపింగ్ బాధ్యతను కూడా నిర్వహించగలడు. భారత్‌లో రింకు సింగ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ వంటి ఆటగాళ్ల కూడా ఉన్నారు. అందుకే ధృవ్ జురెల్ ప్లేయింగ్ ఎలెవన్‌లో చోటు దక్కించుకోలేకపోయాడు. ఇటువంటి పరిస్థితిలో అతను మొదటి టీ20 నుంచి తొలగించబడవచ్చు. ఇక ఇంగ్లండ్‌తో జరిగే ఈ సిరీస్‌కి భారత జట్టులో ఫాస్ట్ బౌలర్ హర్షిత్ రాణా ఎంపికయ్యాడు. అతను ఆడటం కష్టంగా ఉంది. అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ షమీ కూడా జట్టులోకి ఎంపిక కావడమే ఇందుకు కారణం. ఈ ఆటగాళ్ల కూడా ఛాంపియన్స్ ట్రోఫీలో ఆడాల్సి ఉంది. ఇటువంటి పరిస్థితిలో, హర్షిత్ రాణా ప్లేయింగ్ ఎలెవన్ నుంచి సిట్ అవుట్ చేయాల్సి ఉంటుంది. తొలి టీ20లో ఆడడం అతనికి కష్టమే. ఈ ముగ్గురూ బెంచ్‌కే పరిమితం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# భారత్ రెండో విజయం

## మలేసియాపై 10 వికెట్ల తేడాతో గెలుపు

**ఢిల్లీ:** ఐసీసీ అండర్ 19 మహిళల టీ20 ప్రపంచ కప్-2025లో భారత్ రెండో విజయం సాధించింది. మలేషియాతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టీమిండియా 10 వికెట్ల తేడాతో గెలుపొందింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన మలేషియాను భారత బౌలర్లు 14.3 ఓవర్లలో 31 పరుగులకే కుప్పకూల్చారు. భారత స్పిన్నర్ వైష్ణవి శర్మ హ్యాట్రిక్ సహా 5 వికెట్లతో (4-1-5-5) చెలరేగింది. మరో స్పిన్నర్ ఆయుషి శుక్లా (3.3-1-8-3) 3 వికెట్లు తీసింది. వీజే జోషిత్ (2-1-5-1) 1 వికెట్ పడగొట్టింది. మలేసియా ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. ఎక్స్‌ట్రాల రూపంలో లభించిన 11 పరుగులే ఆ జట్టు తరఫున అత్యధికం. 4గురు బ్యాటర్లు డకౌట్ కాగా, ఇద్దరు 5 పరుగులు, ఇద్దరు 3 పరుగులు, ఒకరు 2 పరుగులు, ఇద్దరు ఒక్క పరుగు చేశారు. అనంతరం అతి స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన భారత్ కేవలం 17 బంతుల్లోనే ఆట ముగించేసింది. ఓపెనర్లు గొంగడి త్రిష, జి కమలిని కళ్లు మూసి తెరిచేలోగా ఖేల్ ఖతం చేశారు. త్రిష పూనకాలు




వచ్చినట్లు ఊగిపోయి 12 బంతుల్లో 5 బౌండరీల సాయంతో 27 పరుగులు చేసింది. కమలిని 5 బంతుల్లో బౌండరీ సాయంతో 4 పరుగులు చేసింది.

ఈ గెలుపుతో భారత్ గ్రూప్ ఏలో తిరుగులేని రన్ రేట్‌తో (+9.148) పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి ఎగబాకింది. గ్రూప్ ఏలో భారత్ సహా శ్రీలంక (2 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో రెండో స్థానం), వెస్టిండీస్ (2 మ్యాచ్‌ల్లో 2 పరాజయాలతో మూడో స్థానం), మలేషియా (2 మ్యాచ్‌ల్లో 2 పరాజయాలతో నాలుగో స్థానం) జట్లు ఉన్నాయి కాగా, భారత్ తమ తొలి గ్రూప్ మ్యాచ్‌లో వెస్టిండీస్ తిరుగులేని విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లోనూ భారత బౌలర్లు చెలరేగి వెస్టిండీస్‌ను 44 పరుగులకే కుప్పకూల్చారు. అనంతరం టీమిండియా వికెట్ మాత్రమే కోల్పోయి విజయతీరాలకు చేరింది. ప్రత్య ప్ర ర్థినిర్ధేశించిన 45 పరుగులలక్ష్యాన్ని భారత్ 4.2 ఓవర్లలనేఛేదించింది.గొంగడిత్రిష 4 పరుగులకేఔటైనా.. కమలిని (16 నాటౌట్), సనికా ఛల్కే (18 నాటౌట్) భారత్నుగెలుపు తీరాలు దాటించారు. అంతకుముందు భారత బౌలర్లు పరుణిక సిసోడియా (2.2073),ఆయూషి శుక్లా (4162), వీజేజోషిత్ (2052) విజృంభించడంతో వెస్టిం డీస్ 44 పరుగులకే ఆలౌటైంది.

# రూ.7 లక్షల కోట్లు హాంఫట్!

**ముంబై, జనవరి 21:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్ష పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పొరుగు దేశాలైన మెక్సికో, కెనడా దేశాలపై ట్రేడ్ టారిఫ్‌లు విధిస్తామని ప్రకటించడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. దీనికి తోడు రిలయన్స్ ఇండస్ట్రీస్, జొమాటో వంటి బ్లూచిప్ షేర్లలో అమ్మకాలు సూచీలను పడేశాయి. సెన్సెక్స్ ఓ దశలో 1300 పాయింట్ల మేర నష్టపోగా, నిఫ్టీ సైతం 23వేల స్థాయిని కోల్పోయింది. ఆఖర్లో సూచీలు కాస్త కోలుకున్నాయి. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.7 లక్షల కోట్ల మేర క్షీ ణించి రూ.424 లక్షల కోట్లకు చేరింది.

సెన్సెక్స్ ఉదయం 77,261.72 పాయింట్ల వద్ద స్వల్ప లాభాలలో చూసింది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 75,641.87 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరికి పాయింట్ల 1235 పాయింట్ల నష్టంతో 75,838.36 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 320 పాయింట్ల నష్టంతో 23,024.65 వద్ద స్థిరపడిం ది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.58గా ఉంది. అల్ట్రా టెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఐటీసీ, హిందు స్థాన్ యూనిలీవర్ షేర్లు మిన హాయించబడ్డాయి. అల్ట్రాటెక్ సిమెంట్, హెచ్‌సీఎల్ టెక్నా లజీస్, ఐటీసీ, హిందుస్థాన్ యూనిలీవర్ షేర్లు మినహా



అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. జొమాటో, ఎన్టీపీసీ, అదానీ పోర్ట్స్, ఐసీఐసీఐ బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 79 డాలర్లు ట్రేడవగా, బంగారం ఔన్సు 2732.20 డాలర్ల వద్ద కొనసాగింది. అమెరికా అధ్యక్షురాలు పగ్గాలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ పొరుగు దేశాలైన కెనడా, మెక్సికోపై 25 శాతం సుంకాలు విధిస్తారు. భారత్ సహా ఇతర దేశాలపైనా సుంకాలు విధిగా గతంలో వ్యాఖ్యలు చేశారు. ఈ నేపథ్యంలో ట్రంప్ ఎప్పుడు నిర్ణయం తీసుకుంటారోనన్న ఆందోళనలు మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బ తీశాయి. త్రైమాసిక ఫలితాలతో నిరాశ పరిచిన జొమాటో ఓ దశలో 11 శాతం మేర నష్టపోయింది. దీనికి తోడు అధిక వెయిటేజీ కలిగి స్టాక్స్ అయిన ఐసీఐసీఐ బ్యాంక్, రిలయన్స్, హెచ్‌డీఎఫ్సీ బ్యాంక్, ఎస్బీఐ వంటి షేర్లలో అమ్మకాలతో సూచీలు భారీగా పతనమయ్యాయి.

# జొమాటో, స్విగ్గీ షేర్ల పతనం

**ముంబై, జనవరి 21:** ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లు అయిన జొమాటో, స్విగ్గీ షేర్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. ఫలితాల నేపథ్యంలో జొమాటో షేర్లు అమ్మకాలు ఒత్తిడి ఎదుర్కోగా, దాని ప్రభావం అటు స్విగ్గీపైనా పడింది. దీంతో రెండు కంపెనీల షేర్లు మంగళవారం నష్టాల్లో ట్రేడయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికి గానూ జొమాటో ఏకీకృత నికర లాభం రూ.59 కోట్లుగా పేర్కొంది. గతేడాది ఇదే త్రైమాసికంతో పోలిస్తే లాభం 57.2 శాతం నష్టపోయింది. తన క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్ బ్లింకిట్ త్వరితగతిన పూర్తి చేసేం దుకు, దూకుడుగా స్టోర్ల విస్తరణ చేపట్టడంతో లాభం తగ్గిందని జొమాటో వివరణ ఇచ్చింది. స్టోర్ విస్తరణ కోసం పెట్టుబడుల్ని వేగవంతం చేయడంవల్ల సమీప కాలంలో నష్టాలు నమోదు కావచ్చని తెలిపింది. ఫలితాల అనంతరం బ్రోకరేజీ సంస్థలు అంచనాలను తగ్గించాయి. దీంతో కంపెనీ షేర్లు 11శాతం మేర కుంగాయి. క్విక్ కామర్స్ విభాగంలో పోటీ పెరుగుతున్న వేళ, బలహీన త్రైమాసిక ఫలితాలను ప్రకటించడం కూడా షేర్లలో అమ్మకాల ఒత్తిడికి కారణమైంది. స్విగ్గీ షేర్లు కూడా ట్రేడింగ్ సెషన్‌లో 10 శాతానికిపైగా కుంగాయి. గత నాలుగు ట్రేడింగ్ సెషన్లలో లాభాల్లో ట్రేడయిన షేర్లు మంగళవారం భారీగా పతనమయ్యాయి. గతేడాది స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయిన తర్వాత ఒక్క రోజులోనే షేర్లు పెద్ద ఎత్తున పతనమయ్యాయి. జొమాటో త్రైమాసిక ఫలితాలు బలహీనంగా నమోదవడం కూడా స్విగ్గీషేర్లపై ప్రభావం చూపింది. దీంతో షేర్లు 8 వారాల కనిష్టమైన రూ.427కు చేరింది.




# ప్రపంచ బిలియనీర్ల సంపద రూ.1275 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ, జనవరి 21:** ప్రపంచవ్యాప్తంగా ఉన్న బిలియనీర్ల సంపద పెరుగుదల వేగంగా పెరుగుతూనేఉంది. గతయేడాదితో పోలిస్తే మూడు రెట్లు పెరిగింది. 1990నుంచి పేదల సంఖ్య మాత్రం తగ్గలేదు. అంతర్జాతీయ స్థాయిలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలపై దృష్టిని ఆకర్షించే ఈ సమాచారం ఆక్స్‌ఫామ్ ఇంటర్నేషనల్ తాజా నివేదికలో పేర్కొంది. ఆర్థిక అసమానతలను తగ్గించేందుకు సంపన్నులపై అధిక పన్నులు విధించాలని కూడా ఈ నివేదిక లో పేర్కొంది. నివేదిక శీర్షిక టేకర్స్, నాట్ మేకర్స్ ప్రపం చంలోని చాలా మంది సంపన్నులు కష్టపడి సంపాదించినది కాదని, గుత్తాధిపత్యం, క్రోనీ కనెక్షన్ల ద్వారా కోట్లాది రూపాయలను కూడబెట్టుకున్నారని సూచిస్తుంది. ఒక్క 2024న సంవత్సరంలోనే కుబేరుల సంపద 2లక్షల కోట్ల డాలర్లు పెరిగినట్లు పేర్కొంది. మొత్తంగా ప్రపంచంలోని కుబేరుల సంపద 15 లక్షల కోట్ల డాలర్లు ఉన్నట్లు తెలిపింది. ఆసియా ఖండంలో బిలియనీర్ల సంపద 299 బిలియన్‌డాలర్లు అంటే రూ.25.42 లక్షల కోట్లకు చేరినట్లు టేకర్స్ నాట్ మేకర్స్ రిపోర్టు వెల్లడించింది. వచ్చే దశాబ్ద కాలంలో కనీసం అయిదుగురు లక్షల కోట్లుగా అవతరించవచ్చని అంచనా వేసింది. 2024లో కొత్తగా 204 మంది బిలియనీర్లుగా మారారని, అందులో 41 మంది ఆసియా నుంచే ఉన్నట్లు నివేదిక పేర్కొంది. 2023లో నార్త్ వరల్డ్‌కు సౌత్ వరల్డ్ నుంచి గంటకు 30 మిలియన్ డాలర్ల సంపద వెళ్లినట్లు తెలిపింది. 60శాతం మంది బిలియనీర్ల సంపద వారసత్వం, గుత్తాధిపత్యం ద్వారానే వచ్చినట్లు వెల్లడించింది.



20-39 యేళ్లలో వెయ్యి మందికిపైగా బిలియనీర్లు రూ.442 లక్షల కోట్ల సంపద తమ వారసులకు అందించవచ్చని తెలిపింది. ప్రపంచబ్యాంకు డేటానుఉటంకిస్తూ ఆక్స్‌ఫామ్, 1990 నుంచి రోజుకు 6.85 డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న పేదల సంఖ్యలో గణనీయమైన మార్పు లేదని పేర్కొంది. 2023లో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ వంటి గ్లోబల్‌నార్త్ దేశాలలో నివసిస్తున్న ప్రపంచంలోని అత్యంతసంపన్నులైన ఒకశాతంమంది ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ద్వారా గ్లోబల్ సౌత్‌లోని పేద, అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి ప్రతి గంటకు రూ.255 కోట్లు తీసుకుంటున్నారని గుర్తుచేశారు.

# భారత్‌లో మొదటి సోలార్ 'ఇవి'

**పుణె, జనవరి 21:** పుణెకు చెందిన వైవ్ మొబిలిటీ భారతదేశపు మొట్టమొదటి సౌరశక్తితో నడిచే ఎలక్ట్రిక్ వాహనం వైవే ఈవాను భారత్ మొబిలిటీ ఎక్స్‌పో 2025లో ఆవిష్కరించింది. రూ.3.25 లక్షల ధర కలిగిన వైవే ఈవా సోలార్ టెక్నాలజీతో ఇవి మార్కెట్‌లో విప్లవాత్మక మార్పులు తీసుకు రానుందని కంపెనీ వర్గాలు తెలిపాయి. వైవే ఈవా పైకప్పుపై సోలార్ ప్యానెల్స్ అమర్చారు. ఇది రోజుకు 10 కిలోమీటర్ల పరిధిని పెంచుతుంది. ఈ ఫీచర్ సాంప్రదాయ ఛార్జింగ్ అవసరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ వాహనం ప్రత్యేకమైన బ్యాటరీ రెంటల్ ప్లాన్‌ను అందిస్తుంది. ఇందుకోసం కిలోమీటరుకు రూ.2 సబ్‌స్క్రిప్షన్ ఖర్చు అవుతుంది. ఇది మూడే వేరియంట్లలో లభిస్తుంది. నోవా, స్టెల్లా, వెగా వేరియంట్లు ఉన్నాయి. ఎంచుకున్న బ్యాటరీ ప్యాక్‌ను బట్టి ధరలు రూ.3.25 లక్షల నుంచి రూ.5.99 లక్షల వరకు ఉంటాయి. వైవే ఈవా గరిష్టంగా గంటలకు 70 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. కేవలం 5 సెకన్లలో 0 నుంచి 40 కిలోమీటర్ల వేగాన్ని చేరుకుంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే 250 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుందని కంపెనీ వెల్లడించింది.



# వాణిజ్యం

# ట్రంప్ రాకతో చైనా స్టాక్ మార్కెట్ల ర్యాలీ

**చైనా, జనవరి 21:** ట్రంప్ తీసుకుంటున్న దూకుడు వాణిజ్య నిర్ణయాలు ఒకపక్క ప్రపం చ మార్కెట్లను అతలాకుతలం చేస్తున్నాయి. ప్రధానంగా భారతీయ స్టాక్ మార్కెట్లు తీవ్రంగా ప్రభావితం అయ్యాయి. గీతదాటితే ఇండియాపై కూడా సుంకాల విషయంలో తగ్గేదే లే అని ట్రంప్ తేల్చి చెప్పటం వ్యాపార వర్గాలను, ఇన్వెస్టర్లను ఆందోళకు గురిచేస్తోంది. ఈ క్రమంలో భారతీయ బెంచ్ మార్క్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీలు కుప్పకూలటంతో పాటు స్మాల్ అండ్ మిడ్ క్యాప్ సూచీలు కూడా భారీగా నష్టాలను చూస్తున్నాయి. బ్యాంకింగ్, ఐటీ రంగాలకు చెందిన లిస్టెడ్ కంపెనీలు రక్తపాతాన్ని చూస్తున్నాయి. కానీ.. మరో పక్క చైనాస్టాక్ మార్కెట్లు మాత్రం ట్రంప్ ప్రకటనలతో భారీగా దూసుకుపోతున్నాయి. డొనాల్డ్ ట్రంప్ మొదటి రోజు నుంచి సుంకాలను పెంచిన తరువాత, చైనీస్ ఆస్తుల్లో ఇన్వెస్ట్ చేసిన పెట్టుబడి దారులు ఉపశమనం పొందారు. అయితే ప్రపంచ మార్కెట్లు మాత్రం భారీ ఒత్తిడికి లోనవటంతో ఇన్వెస్టర్లు అప్రమ త్తంగా ముందుకు సాగుతున్నారు. ఫిబ్రవరి 1, 2025 నాటికి మెక్సికో, కెనడాలపై 25 శాతం చొప్పున సుంకాలు విధిస్తామని తొలిరోజే ట్రంప్ బెదిరించారు. ఈ క్రమంలో తన ప్రత్యర్థిక అయిన చైనాపై తక్షణం ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో చైనా స్టాక్ మార్కెట్లు బుల్ జోరును కొనసాగిస్తున్నాయి. అలాగే చైనాపై అదనపు సుంకాల విషయంలో అడిగిన ప్రశ్నలకు ట్రంప్ సమాధానం చెప్పకుండా దాటవేయటం చూస్తే ఇప్పట్లో చైనాపై ప్రత్యక్ష ప్రభావం ఉండకపోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ క్రమంలో హాంగ్‌సెంగ్ చైనా ఎంటర్‌ప్రైజెస్ ఇండెక్స్ 1.3శాతం పెరుగుదలను చూసింది. ఈ పరిణామాలతో ఆసియా మార్కెట్లలో అత్యధికంగా చైనీస్ స్టాక్స్ లాభపడ్డాయి. చాలా కాలంగా ట్రంప్ హిట్ లిస్టులో చైనా కూడా సుంకాల పెంపుకు గురవుతుందనే ఊహాగానాలకు తెరపడటంతో ప్రస్తుతం రిలీఫ్ ర్యాలీ కొనసాగుతోందని నిపుణులు చెబుతున్నారు.



# కేంద్ర బడ్జెట్‌పైనే ఆశలు

**ముంబై, జనవరి 21:** పరిశ్రమలు బాగుంటే అనేకమందికి ఉపాధి కూడా దొరుకుతుంది. ఈనేపథ్యంలో వైద్య పరికరాలు, ఎలక్ట్రానిక్స్, పాదరక్షలకు సంబంధించిన ముడి పదార్థాలపై కస్టమ్స్ సుంకాలను తగ్గించాలని ఆయారంగాల ప్రముఖులు కోరుతున్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి ఒకటో తేదీన 2025-26 కేంద్ర బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. దీనిలో అందించే మినహాయింపుల కోసం ఎదురు చేస్తూనే.. కొన్నిరాయితీలను ప్రభుత్వం నుంచి పరిశ్రమల యాజమానులు కోరుకుంటున్నారు. ముఖ్యంగా ముడిసరుకులపై కస్టమ్స్‌సుంకం తగ్గింపు కోసం ఆయారంగాలు ఎదురుచూస్తున్నారు. ఎలక్ట్రానిక్స్, ఆరోగ్య సంరక్షణ ఉత్పత్తులు, ఔషధాలలో వాడే ముడిపదార్థాలపై కొన్నిసుంకాలను తగ్గించాలనే డిమాండ్ వినిపిస్తోంది. తయారీపరంగా తమకు ఈ ప్రోత్సాహం ఇవ్వాలని ఈ పరిశ్రమలు కోరుతున్నాయి. ముఖ్యంగా ముడి సరుకులపై ట్యాక్సులు తగ్గితే తమకు ప్రయోజనంగా ఉంటాయని చెబుతున్నాయి. ఒక విధంగా చెప్పాలంటే రేట్ల హేతుబద్ధీకరణ, నిర్వహణను సులభతరం చేయడం అనేవి కస్టమ్స్ రంగం నుంచి కీలకమైన డిమాండ్లుగా ఉన్నాయి. వివిధ సంస్థలు తమ ఉత్పత్తులకు కావాల్సిన ముడి పదార్థాలను దిగుమతి చేసుకుంటాయి. ఈ సమయంలో వాటి నుంచి ప్రభుత్వం కొంత పన్ను వసూలు చేస్తుంది. దాన్నే కస్టమ్స్ ట్యాక్స్ అంటారు. దిగుమతి చేసుకున్న వస్తువుల విలువ, మూలం, వర్గీకరణ ఆధారంగా వీటిని నిర్ణయిస్తారు. ముడిసరుకులపై కస్టమ్స్ సుంకం తగ్గిస్తే ఆయా పరిశ్రమలకు ప్రోత్సాహకంగా ఉంటుందని నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. అలాగే దేశీయ తయారీకి మద్దతు లభిస్తుందని, మేక్ ఇన్ ఇండియా లక్ష్యాన్ని మరింత ముందుకు తీసుకువెళ్లే అవకాశం కలుగుతుం దన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps